లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక

# జనబలం

ప్రజలే ప్రభువులు

డిసెంబర్ 2020

రూ.10/-




## ఉమ్మడి ప్రయోజనాలే 'సోషల్' సక్సెస్ సూత్రం



## నగర ప్రభుత్వాలకు సాధికారత లేకుంటే ఓటింగ్‌లో నిర్లిప్తతే




## ప్రపంచాన్ని కుదుట పరిచేందుకు కొత్త అధ్యక్షుడు తేవాల్సిన మూడు మార్పులు



# Internship Opportunity for #law students!

Foundation for Democratic Reforms is looking to hire law students/graduates who can contribute to cutting edge policy research to reform our rule of law institutions.

The scope of work includes extensive secondary research in the areas of judicial and police reforms, accountability of courts, prison reforms, and procedural delays, among others.

Interns based in #hyderabad are preferred, but virtual internships are also available.

Apply now - https://www.fdrindia.org/online-application/

#policy #ruleoflaw #publicpolicy #judiciary#policereform #courts #advocacy #internship#opportunity #hiring #legal #india #workfromhome



ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

సంపుటి 23 సంచిక 12
డిసెంబర్ 2020

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్

వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా | రూ. 475.00 |
| జీవితకాలపు చందా | రూ. 1200.00 |

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

## చందాదారులకు విజ్ఞప్తి

చాలా మంది చందా గడువు ముగిసినా జనబలం పత్రికను మీకు ప్రతీనెలా పంపుతున్నాము.అట్టివారు తప్పక తమ చందాను వెంటనే పునరుద్ధరించుకోగోరుతున్నాము. చందా డబ్బును Foundation for democratic reforms పేరున జనబలం కార్యాలయంనకు పంపగలరు.

## లోపలి పేజీల్లో...

06 'ఉమ్మడి ప్రయోజనాలే' సోషల్ మీడియాలో సక్సెస్ సూత్రం!

17 ప్రజాస్వామ్యాన్ని కుదిపేసిన ఎన్నికలు

25 ప్రపంచాన్ని కుదుటపరిచేందుకు అమెరికా కొత్త అధ్యక్షుడు తేవాల్సిన మూడు మార్పులు

కార్యాలయ చిరునామా : తులిప్స్ అపార్ట్‌మెంట్స్ 6-3-655, ఫ్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక, సోమాజిగూడ, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288
Email: janabalam.loksatta@gmail.com, loksattaudyamasamstha@gmail.com

## కార్టూన్ కార్నర్










## జనబలంలో ప్రకటన రేట్లు

| | |
|---|---|
| **కలర్‌పేజీ:** | **10,000** |
| **ఇన్‌సైడ్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **5,000** |
| **ఫుల్‌పేజీ బ్లాక్ అండ్ వైట్ :** | **2,000** |
| **సగం పేజీ బ్లాక్ అండ్ వైట్:** | **1,000** |

ప్రకటన రుసుము, ప్రకటనకు సంబంధించిన ఫొటోలు, సమాచారం ప్రతినెలా 20వ తేదీ లోపుగా మాకు అందేలా పంపించగలరు. చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను

**చిరునామా: సంపాదకుడు, జనబలం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక,**
*తులిప్స్ అపార్ట్‌మెంట్స్, 6-3-655, ప్లాట్ నెం 407, సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక,*
*సోమాజిగూడ, హైదరాబాద్-500 082*

సంపాదకీయం

# చర్చలే పరిష్కారం

కేంద్ర ప్రభుత్వం ఇటీవల పార్లమెంటులో ఆమోదించిన మూడు వ్యవసాయ చట్టాలపై దేశంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఇది ఒకందుకు మంచిదే అయ్యింది. ఇప్పటికైనా దేశ రైతాంగ దుస్థితిపై తప్పో ఒప్పో ఒక పెద్ద చర్చ జరగడానికి ఈ చట్టాలు మరో రకంగా దోహదపడ్డాయి. దేశ రాజధాని చుట్టుపక్కల పంజాబ్, హర్యానా రైతులు గత పదిహేను రోజులుగా దిగ్బంధం చేస్తున్నారు. చట్టాలను ఆమోదించడానికి ముందే ప్రభుత్వం రైతులు, ప్రతిపక్ష పార్టీలు, రాష్ట్రాలతో సంప్రదిస్తే ఉద్యమం వరకు వచ్చేది కాదు. ఉద్యమం మొదలైన తర్వాత ఇప్పటిదాకా కేంద్ర ప్రభుత్వంతో రైతు సంఘాలు ఆరు మార్లు చర్చించాయి. కానీ కనుచూపు మేరలో పరిష్కార మార్గం కనిపించడం లేదు. ఇక పోరు దారి తప్ప అన్ని దారులు మూసుకుపోయాయని రైతు సంఘాలు ప్రతిపక్షాలు అంటున్నాయి. తాము తీసుకువచ్చిన ఈ మూడు చట్టాలు అద్భుతమని రైతాంగ సమస్యలకు సమగ్ర పరిష్కారం చూపిస్తాయని కేంద్ర ప్రభుత్వం వాదిస్తుంటే, ఈ మూడు చట్టాల వల్ల రైతుల బతుకు ఛిద్రమవుతుందని ప్రతిపక్షాలు, రైతు సంఘాలు వాదిస్తున్నాయి. నిజానికి ఈ రెండు వాదనలు వాస్తవం కాదు. కేంద్ర ప్రభుత్వం ఈ మూడు వ్యవసాయ చట్టాలు తీసుకురాక ముందు రైతుల బతుకు అద్భుతంగా ఉందని కాదు. ఈ మూడు చట్టాలు రావడం వల్ల రైతుల బతుకు పూర్తిగా నాశనం అవుతుందనే వాదన కూడా అవాస్తవం. అందుకే ఈ మూడు చట్టాలను ఆహ్వానిస్తూనే ఇంకా లాభసాటి వ్యవసాయం కోసం అనేక సంస్కరణలు తీసుకురావాలని మధ్యేవాదులు అంటున్నారు. కానీ వీరి గొంతు ఈ రణగొణ ధ్వనుల రొదలో వినిపించడం లేదు. పార్టీలకు అతీతంగా రైతు సమస్యలకు అసలుసిసలైన పరిష్కారాలు సూచించే విజ్ఞుల మాటలు రాజకీయవాదుల మభ్యపెట్టే మాటల మధ్యన అరణ్యరోదనే అవుతోంది. నిజం గడప దాటేలోగా అబద్ధం లోకం చుట్టి వస్తుంది. అందుకే రాజకీయ రణరంగంలో రైతు బతుకు చితికిపోతోంది.

తమ మాటే నెగ్గాలి అన్న ప్రభుత్వము, ప్రతిపక్షాలు, కొన్ని రైతు సంఘాల వాదనల మధ్య అసలు వాస్తవాలు మరుగున పడుతున్నాయి. సందట్లో సడేమియాలాగా ఇప్పటిదాకా మర్చిపోయిన విద్యుత్ రంగ సంస్కరణలు కూడా మళ్లీ ఈ వ్యవసాయ రంగ సంస్కరణల మధ్యన వెలుగులోకి వస్తున్నాయి. వాస్తవాల ఆధారంగా జరగాల్సిన చర్చలు అపోహలు, అపనమ్మకాల మధ్య జరుగుతున్నాయి.

ఈ మూడు చట్టాలలో కనీస ప్రస్తావన లేని అంశాలు కూడా చర్చకు వస్తున్నాయి. ఉదాహరణకు మార్కెట్ యార్డులను ప్రభుత్వం రద్దు చేస్తుందనే వాదనతో పాటు కనీస మద్దతు ధర ఇకముందు ఉండదని, గోధుమలు, వరి ధాన్యాన్ని ఫుడ్ కార్పొరేషన్ ఇండియా వారు ఇక ముందు కొనడం మానేస్తారని ఇలాంటి వాదనలు తెరమీదికి తెస్తున్నారు. గత 70 సంవత్సరాలలో రైతు సమస్యల మీద పార్టీలకతీతంగా ఇప్పటిదాకా అధికారంలో ఉన్న పార్టీలు చిత్తశుద్ధితో ఆలోచించలేదు. "తిలా పాపం తలా పిడికెడు" అన్నట్లు గతంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రస్తుతం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వాలను సమానంగా నిలదీయడం పోయి ప్రస్తుతం అధికారంలో ఉన్న పార్టీని మాత్రమే నిలదీస్తున్నారు. ఇప్పటిదాకా కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ, బీజేపీ అధికారంలో ఉన్నపుడు కాంగ్రెస్ రైతుల పట్ల కపట ప్రేమ ఒలకబోస్తూ చేసిన దుర్మార్గపు చట్టాలను ప్రశ్నించడం పోయి ప్రస్తుతం ఉన్న ప్రభుత్వాన్ని ఎలా ఇరుకున పెడదామన్న ఆలోచనతో ఉన్న రాజకీయ పక్షాలకు మేధావులు, రైతు సంఘాలు వత్తాసు పలుకుతున్నాయి.

రైతులకు అసలే సమస్యలు లేవని కాదు. కానీ ఉన్న సమస్యలకు ప్రస్తుతం వీరు పోరాడుతున్న తీరు పరిష్కారం కాదన్న సంగతిని రైతు సంఘాలు గమనించాలి. వ్యవసాయంలో నష్టాలు వస్తున్నాయి "ప్రకృతి శాపం కాదు- పాలకుల పాపానికి" వ్యవసాయం బలిపశువుగా మారింది. పార్టీలకు అతీతంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటిదాకా అవలంబిస్తున్న రైతు వ్యతిరేక విధానాలే రైతు కష్టాలకు కారణం అని గమనించలేక పోతున్నాము. అసలు సమస్యలను మరచి కొత్త సమస్యలతో రాజకీయ రణరంగాన్ని సృష్టిస్తున్నారు. ఈ మూడు చట్టాలను వ్యతిరేకించడమే పరిష్కారం కాదు. వీటిలో అవసరమైన సవరణలు చేయడమే అసలు సిసలైన పరిష్కారం. అలాగే ఈ మూడు చట్టాలలో ప్రస్తావించని అనేక అంశాలను రైతుకు అనుకూలంగా మరికొన్ని అవసరమైన చట్టాలు చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాలి. అందులో మొదటిది భారతదేశంలో ఎగుమతి దిగుమతి విధానాన్ని మార్చడం. రెండోది రైతు పరపతిని పెంచడం. మూడవది పండిన పంటకు సరైన ధర లభించే మార్కెట్ ను ఏర్పరచడం. పంట పండినా పండకపోయినా రైతులు నష్టపోతున్నారు. పండిన పంటకు మార్కెట్‌లో సరైన ధర రాక అయినకాడికి అమ్ముకుంటున్నారు. అమ్మబోతే అడవి కొనబోతే కొరివిలా రైతు పరిస్థితి మారింది. పంటల సాగు మొదలు పెట్టినప్పటి నుంచి పంట పండించే వరకు ఉన్న దోపిడీ వ్యవస్థను రద్దు చేయడం, లేదా సంస్కరించడం చేయాలి. విత్తనం నుంచి మొదలుకొని పురుగు మందులు, ఎరువులు వీటిలో రైతులు దోపిడీకి గురవుతున్నారు. రైతును ఆదుకోవడానికి అవసరమైన పకడ్బందీ చట్టాలు చేయడం మాని ఇవాళ స్వేచ్ఛా మార్కెట్‌ను వ్యతిరేకిస్తోన్న శక్తులు మిగతా పనికిరాని అంశాల చుట్టూ తిరిగి డొంకతిరుగుడు వాదనలు చేస్తున్నాయి. ఇప్పటిదాకా దేశంలో రైతు సంఘాలు, ప్రతిపక్షాలు డిమాండ్ చేసినట్లుగా ఈ మూడు చట్టాలలో ఏడు, ఎనిమిది సవరణలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చింది. అయినా సరే మేము ఈ మూడు చట్టాలను పూర్తిగా రద్దు చేసేంతవరకు మా ఉద్యమం ఆగదనీ రైతు సంఘాలు ప్రతిపక్షాలు భీష్మించుకు కూర్చున్నాయి. ఇది సరైంది కాదు. తెగేదాక లాగితే ఏమవుతుందో అటు ప్రభుత్వం ఇటు ప్రతిపక్షాలు, రైతు సంఘాలు గమనించాలి. అధికారంలో ఉన్న ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టడానికి ఇదే అదునుగా సమయం వచ్చింది కదా అని ఇవాళ మొండికేస్తే రేపు ఇవే ప్రతిపక్షాలు అధికారంలోకి వచ్చిన తర్వాత అవే సమస్యలు మళ్లీ మళ్లీ ఆ ప్రతిపక్షాల వెంట కూడా పడతాయని గమనించాలి. "గోటితో పోయేదానికి గొడ్డలి" దాక తెచ్చుకునే మొండివైఖరి ఇరుపక్షాలు విడనాడాలి. సాగురంగ చట్టాలపై ఇప్పటికైనా మరొకసారి సమగ్ర చర్చ జరగాలి. ఇరుపక్షాలు భేషజాలకు పోకుండా సామరస్య పరిష్కారం సాధించాలి. ఎవరు గెలిచారు ఎవరు ఓడారు అనే మీమాంస లేకుండా "విన్ విన్ సొల్యూషన్" సాధించాలి. అప్పుడే ఈ సమస్యకు సరైన పరిష్కారం దొరుకుతుంది.

**-బండారు రామ్మోహనరావు**

# ‘ఉమ్మడి ప్రయోజనాలే’ సోషల్ మీడియాలో సక్సెస్ సూత్రం!

కొవిడ్ చుట్టుముట్టటం మొదలయ్యాక అది పెద్ద ఆరోగ్యసంక్షోభం మాత్రమేనని మనలో పలువురం అనుకున్నాం, ఆ తర్వాత ఆర్థిక సంక్షోభం కూడా అని అర్థమైంది. ఆ రెండూ మాత్రమే కాదు, అది సమాచార సంక్షోభం కూడా అని అదేసమయంలో తెలిసొచ్చింది. ఒకరకంగా చెప్పాలంటే, ఆధునిక సమాచార వ్యవస్థలో ఇప్పటికే అడుగడుగునా ఉన్న కల్తీ.. కరోనా కాలంలో మరీ బరితెగించినట్లుగా బట్టబయలైంది.

మన తరంలోనే కాదు, సోషల్ మీడియా యుగంలో కూడా వచ్చిన మొట్టమొదటి ప్యాండమిక్ కరోనా. ఆర్థిక ప్రపంచీకరణకన్నా విస్తృతమైన సోషల్ మీడియా ప్రపంచీకరణ వల్ల కరోనా ప్రజలపై విపరీత ప్రభావం చూపింది. కరోనా ప్యాండమిక్ నుంచి కాపాడే ఛత్రంలా ఉపయోగపడాల్సిన సామాజిక మాధ్యమాలు, చాలా సందర్భాల్లో ఆ ప్యాండమిక్ కంటే కూడా హాని చేసేలా ప్రచారం సాగించాయి (కొవిడ్ వైరస్‌కు బాగా భయపడుతున్న దశలో కూడా వైరల్ పదం పట్ల సోషల్ మీడియాలో యావ తగ్గలేదు). వ్యాధి గురించి నిపుణులకే స్పష్టత రాని సమయంలో.. సోషల్ మీడియా రకరకాల చిట్కాల్ని, వ్యాఖ్యానాల్ని ఎడాపెడా ప్రచారం చేసింది. మనలో చాలామంది ఏది నిజమో, ఏది అబద్ధమో తెలుసుకోలేక ప్యానిక్‌తో వాటిని అనుసరించటం, ఫార్వర్డ్ చేసేయటం పెద్దఎత్తున జరిగింది. ఆ తర్వాతి దశలో కూడా మన దేశంలోనైతే లాక్‌డౌన్ కొనసాగింపు, సడలింపులు, వ్యాక్సిన్లు తదితరాంశాల చుట్టూ అనేక రకాల వ్యాఖ్యానాలు, వార్తలు చక్కర్లు కొట్టాయి. ప్రజల్లో విపరీత భయాందోళనల్ని, అపోహల్ని పెంచటంలో సామాజిక మాధ్యమాలు పెద్దపాత్రను పోషించాయి. తప్పుడు సమాచారంతో మానసిక సమస్యలతోపాటు బలవన్మరణాలు కూడా సంభవించాయి. భారత్‌లో వలస కార్మికులు లాక్‌డౌన్ సమయంలో సుదూర ప్రాంతాలకు నడిచివెళ్తుంటే, వారికి సాయం, సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేయటం కన్నా రాజకీయ లబ్ధికి సామాజిక మాధ్యమాల్ని అమానవీయంగా వాడుకున్నవారున్నారు. చివరికి కరోనాను మించి దుష్ప్రభావం చూపుతున్న ‘ఇన్ఫోడెమిక్’గా సోషల్ మీడియాను వ్యాఖ్యానించాల్సిన పరిస్థితి వచ్చింది.




సోషల్ మీడియాలో అసత్యాలు, అర్ధసత్యాలు, నకిలీలు, వ్యక్తిత్వాలపై శాడిస్టిక్ దాడుల గురించి కరోనా ముందు కాలం నుంచే పెద్దఎత్తున ఫిర్యాదులు ఉన్నాయి. కరోనా కేవలం దాని తీవ్రతను ఒక విశ్వరూప స్థాయిలో మనకు చూపించిందంతే. ఇదే సమయంలో చైనాతో తీవ్ర స్థాయికి చేరిన సరిహద్దు ఉద్రిక్తతల గురించి భావోద్వేగాల్ని రెచ్చగొట్టటమే లక్ష్యంగా అసత్యాలు, అర్ధసత్యాల పోస్టులు షికారు చేశాయి. బెంగళూరులో ఒక విశ్వాసాన్ని కించపరుస్తూ పెట్టిన ఫేస్‌బుక్ పోస్ట్ హింసాత్మక ఘటనలకు దారితీసి పోలీస్ స్టేషను, ఇళ్లు, వందలాది వాహనాలు దహనమయ్యాయి, పోలీసు కాల్పుల్లో కొందరు మృతి చెందారు. అమెరికా అధ్యక్ష ఎన్నికలతోపాటు, దుబ్బాక ఉప ఎన్నిక, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ ఎన్నికలు సోషల్ మీడియాలో నాయకులను కించపరిచేందుకు, విద్వేషాలను రెచ్చగొట్టేం దుకు, ఓటర్లను విభజించేందుకు, ఫేక్ న్యూస్‌తో మభ్యపెట్టేందుకు వేదికలుగా మారాయి. మరోపక్క, రాజకీయంగా కొన్ని రకాల సోషల్ మీడియా పోస్టుల్ని పెట్టినం దుకు, షేర్ చేసినందుకు దేశంలోని పలు చోట్ల కేసులు పెట్టటం, జడ్జీలపై వ్యాఖ్యలు చేసినందుకు ఉన్నత న్యాయస్థానాలే సుమోటోగా ఆదేశాలివ్వటం వంటి ఉదంతాలు జరిగాయి. ఈ నేపథ్యంలో.. అరచేతిలో అందుబాటులో ఉండటంతోపాటు ప్రభుత్వ సేవలు, విద్య, సమాచారం, విపత్తుల్లో సాయం, సామాజిక తోడ్పాటు, ఆత్మవిశ్వాసం, ఉపాధి అవకాశాలు సహా వివిధ అవసరాల రీత్యా సమాచార సాంకేతికత వినియోగంలోకి సామాన్య, మధ్యతరగతి విద్యార్థులు కూడా వచ్చి చేరుతూ టెక్ వినియోగం పెరగటమే తప్ప తగ్గటం లేని పరిస్థితుల్లో.. మనం సామాజిక మాధ్యమాల పాత్ర గురించి కొంతైనా సీరియస్ ఆలోచన చేయటం అవసరం. ఈ ప్రజాస్వామిక వేదికలపై ప్రజాస్వామికతను కాపాడుకోవటానికి, బలోపేతం చేసుకోవటానికి కావలసిన ప్రమాణాల గురించి ఒక ఫ్రేమ్‌వర్క్ మేరకైనా స్పష్టత తెచ్చుకోవాలి.

దాదాపు రెండు దశాబ్దాల సాంకేతిక పురోగతి ఫలితంగా మనకు అందుబాటులోకి వచ్చిన సోషల్ మీడియాలో ఖాతా తెరుస్తున్నా మంటేనే, మనం వ్యక్తిగతం నుంచి జగమంత సమాజంగా విస్తృత స్థాయిలో వ్యవహరించటానికి సిద్ధపడుతున్నామన్నమాట. మన జీవితాన్ని, సమాజంతో సమన్వయం చేసుకోవటానికి చేస్తున్న అత్యాధునిక ప్రయత్నమిది. కాబట్టి వ్యక్తిగత ప్రయోజనాలతోపాటు సమాజ అవసరాల గురించి కూడా కొంత పనిగట్టుకుని పట్టించుకోవాల్సిన అవసరం సోషల్ మీడియాకుండే మౌలిక ప్రాతిపదిక.

సోషల్ మీడియా మన ఉమ్మడి ఆసక్తుల్ని కలిపే ఒక అద్భుత వేదిక. అంటే, మనలాగా ఆలోచించేవారితో కలిసి ఎప్పటికప్పుడు జరిగే సంఘటనల మీద, భవిష్యత్తుకి పనికొచ్చే గతం మీదా చర్చించేందుకు, ఆహ్లాదకరమైన భావాల్ని పంచుకునేందుకు ఇదో చక్కటి అవకాశం. ఇలా మనలాంటి వారితో కలిసి కమ్యూనిటీగా ఏర్పడటానికి ఉపయోగపడటం వల్ల గతంలో ఆర్కుట్ వంటివి ఎంతో ఆదరణ పొందాయి. కానీ క్రమంగా సామాజిక మాధ్యమాల్లో మనం నేల విడిచి సాము చేయటం మొదలుపెట్టాం. ఈవేళ సోషల్ మీడియా మనలో మానసికాందోళనకు, అభద్రతకు పెద్దకారణంగా తయారైంది. స్నేహితులు, సహచరులు, పరిచయస్తులు, బంధువులు మనకంటే మెరుగ్గా ఏదైనా సాధించినా, కాస్త ఎక్కువ డబ్బుతో ఏదైనా కార్యక్రమాలు జరుపుకున్నా, చివరికి వీకెండ్ ఎంజాయ్ చేసినా మానసిక ఆందోళన చెందే వారు ఎక్కువవుతున్నారు. మనం చేసే పనులలో మెరిట్‌తో సంబంధం లేకుండా వాటికి సోషల్ ప్లాట్‌ఫాం లో ఎన్ని లైక్‌లు వచ్చాయనేది మన ఆలోచనాసరళిని, కార్యాచరణను ప్రభావితం చేస్తోంది. దీనికంతటికీ కారణం– సోషల్ మీడియాకు పునాదిగా ఉండే 'ఉమ్మడి ఆసక్తులు' అనే లక్షణం పక్కదోవ పట్టి వ్యక్తి గత ఆసక్తులు విపరీత పోకడలు పోతూ దాన్ని డామినేట్ చేయటమే.

సోషల్ మీడియా కేవలం నా వ్యక్తిగత ఆసక్తులు, అవసరాల కోసమే అనుకుంటే.. మనం సమస్యలో భాగమవుతాం, క్రమంగా ఆ మాధ్యమం మన ప్రయోజనాలకు కూడా శత్రువుగా మారుతుంది. అందుకే సోషల్ మీడియా విస్తరిస్తున్నకొద్దీ ఉమ్మడి ఆసక్తుల్ని బలో పేతం చేసుకునే దిశగా ఏర్పాట్లు ఉండాలి. అంటే, మన ఆసక్తులు.. మన ఉమ్మడి ప్రయోజనాలకు దారితీయాలి. మన గ్రూప్‌లో ఉమ్మడి ఆసక్తులే కాకుండా, ఉమ్మడి ప్రయోజనం కూడా ఉంటే.. అప్పుడు సోషల్ మీడియాలోని అద్భుత సానుకూల శక్తి ఆవిష్కృతమవుతుంది. మానవాళికి అదో గొప్ప ప్రయోజనకారిగా సాయపడుతుంటుంది.

ఉమ్మడి ప్రయోజనం ఉన్నప్పుడు ఎదుటివ్యక్తితో 'హిట్ అండ్ రన్' తరహా వ్యవహారశైలిని ప్రదర్శించం. సంభాషణ, చర్చ పద్ధతిలో ఎదుటివారితో దీర్ఘకాల సంబంధాలకు ప్రాధాన్యమిస్తాం. మన రోజువారీ జీవితంలో ఒక స్నేహితుడ్ని ఎంచుకోవటంలో అప్రయత్నం గానే చాలా జాగ్రత్తలు పాటిస్తాం. సోషల్ మీడియాలో కూడా వ్యక్తుల పట్ల కొంత పరిశీలన అవసరం. ఒకోసారి నిజ జీవితంలో కంటే కూడా ఎక్కువ అవసరం కావచ్చు. ఎవరో పూర్తిగా తెలియాల్సిన అవసరం లేని సందర్భంలో, మనిషిలోని తామస లక్షణాలు మితిమీరే అవకాశాలు ఎక్కువ. మనిషి ఆలోచనాశక్తిని పెంచుకుంటున్నాడే తప్ప, ఇప్పటికీ పూర్తిస్థాయి పరిణతిని సాధించలేదు. ఇంకా జంతు స్వాభావిక ఆటవిక లక్షణాలు అనేకం మనలో అనేకమందిలో ఉన్నా యి. అవకాశం వస్తే, అలాంటి పరిస్థితులు ఏర్పడితే, జంతులక్షణాలు పేట్రేగుతాయి. ఆన్‌లైన్‌లో ఆ అవకాశాలు చాలా ఎక్కువ. వ్యక్తిగత అవసరాల కోసం, ఆనందాల కోసం జంతువుల్లాగే పైకి నటించే, ట్రాప్ చేసే వాళ్ల సంఖ్య తక్కువేమీ కాదు. ప్రత్యక్ష ప్రపంచంలో నూటికి ఐదుగురు ఏ చట్టం అవసరమూ లేని అత్యుత్తములు ఉంటే, 90 శాతం మంది చుట్టూ ఉండే ప్రభావాలకు అనుగుణంగా ప్రవర్తిస్తుంటారు, మిగిలిన ఐదుశాతం ఎన్నున్నా తప్పుడు పనులు చేస్తూనే ఉంటారు. ఈ చివరి ఐదు శాతం కోసమే చట్టాలు పనిచేయాల్సింది. ఈ థియరీలోని శాతాలు ఆన్‌లైన్‌లో కొంత మారే అవకాశముంది. ఎక్కువమందిలోని మృగస్వభావం ప్రకోపించొచ్చు. నైతికంగా తప్పిదాలు అని ప్రత్యక్ష ప్రపంచంలో మనం నూటికి నూరు శాతం నమ్మే తప్పిదాల్ని కూడా వర్చువల్ ప్రపంచమైన సోషల్ మీడియా మన చేత క్రమంగా చేయిస్తోంది. ఉద్వేగాలకు, సహజాతాలకు ఉండే వివేచనను ఒక క్రమపద్ధతిలో సోషల్ మీడియాలోని ధోరణులు మనలో దెబ్బతీస్తున్నాయి. దీన్ని తట్టుకుని ఆలోచనాశక్తితో వ్యవహరించటం, ఉద్వేగ ప్రజ్ఞను ప్రదర్శించటం మరీ తేలిక కాదు. మన చుట్టూ ఉన్నవారు కూడా ఇంపల్సివ్‌గా, విభజన ధోరణితో వ్యవహరిస్తుంటే, మనలోని ఆటవిక భావోద్వేగాలు కట్టలు తెంచుకోవటం పెద్ద కష్టమేమీ కాదు. అందుకే మృగస్వభావం ప్రకోపించే ప్రమాదం పట్ల సోషల్ మీడియాలో అప్రమత్తతను పాటించాలి. తొందరపడకుండా.. ఎదుటివారు మన ఆసక్తులకు తగ్గ వ్యక్తి, కనీస ప్రమాణాలను పాటించే వ్యక్తి అని నిర్ధారించుకోవటానికి కొంత సమయం తీసుకోవాలి. ఇలా ఉమ్మడి ఆసక్తులతో బలమైన కమ్యూనిటీని నిర్మించటం, ఒక ఉమ్మడి ప్రయోజనాన్ని దానికి బలమైన పునాదిగా ఏర్పాటు చేసుకోవటం ఇప్పుడు సోషల్ మీడియాలో మనందరి ముందూ ఉన్న పెద్ద పని. ఉమ్మడి ప్రయోజనమంటే సమాజానికి ఉపయోగపడేది లేదా సమాజానికి ఉపయోగపడుతూ ఆ గ్రూప్‌కి, మరికొందరికి కూడా ప్రయోజనం చేకూర్చేది అనుకోవచ్చు (ఉమ్మడి ప్రయోజనాలు అంతిమంగా తిరిగి వ్యక్తిగత ప్రయోజనాల మెరుగైన పరిరక్షణకు ఉపయోగపడతాయి).

ఒక ఉమ్మడి ప్రయోజనం మనకు ఉందని గుర్తించినప్పుడు.. మనం స్పందించే తీరులో కూడా పరిణతి కనిపిస్తుంది. హేతుబద్ధంగా మాట్లాడతాం, విభజనకు బదులు ఐక్యతకు ప్రాధాన్యమిస్తాం, విభేదాలు తలెత్తితే 'క్రియేటివ్ టెన్షన్' పద్ధతిలో సృజనాత్మకంగా విమర్శను తెలియచేస్తాం, మితిమీరి వాదించటానికి బదులు హేతుబద్ధంగా, అవతలివారి ఆసక్తుల్ని కూడా సమన్వయం చేసుకుంటూ ఒప్పించటానికి ప్రయత్నిస్తాం. మరీ విభేదాలు ఎక్కువయ్యాయనిపిస్తే కొంత బ్రేక్ తీసుకుని, సోషల్ మీడియా డిస్టెన్సింగ్‌ని తాత్కాలికంగా పాటిస్తాం. మన పొరపాట్లు, తప్పిదాలకు నిజాయతీగా క్షమాపణ చెప్పటానికి వెనుకాడం.

**ఫ్యాక్ట్ చెకర్స్ .. మెంటార్స్**

సోషల్ మీడియాలోకి ప్రవేశించేనాటికి మనకు బాల్యం దాటి కొంత వయసు వచ్చేస్తుంది. మనలో కాస్త పరిణతిగలవారికి.. ఉమ్మడి ప్రయోజనాల్ని ప్రత్యేకించి గుర్తించాల్సిన అవసరం కూడా లేకుండా, ఉమ్మడి ఆసక్తులే ఉమ్మడి ప్రయోజనాలుగా ఉంటాయి. అలా ఉమ్మడి ప్రయోజనాల్ని నేరుగా గుర్తించగలిగినవారు.. తమకతోటివారితో కలిసి కమ్యూనిటీగా ఏర్పడి కార్యాచరణను ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే ఈ ప్రాథమిక జాగ్రత్తలు తీసుకున్నా కూడా కొన్ని సమస్యలుంటాయి. సోషల్ మీడియాలో అబద్ధాలు, పొంతనలేని ముక్కముక్కలుగా చేసిన వాస్తవాలు, ప్రలోభాలు, ఉద్రేకాలతో తాత్కాలిక ప్రయోజనాల్ని సాధించే అవకాశం ఉండటంతో వృత్తినైపుణ్యంతో దాన్ని స్వప్రయోజనాల కోసం

## ఐదేళ్లలో 150 శాతం పెరిగిన సోషల్ మీడియా యూజర్లు

మన దేశంలో 70 కోట్ల మంది ఇంటర్నెట్ వాడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. మొబైల్ డేటా ద్వారా స్మార్ట్‌ఫోన్లను ఎక్కడైనా వినియోగించుకునే సదుపాయం ఉండటంతో పల్లెల్లోనూ వీటి పట్ల మొగ్గు చూపుతున్నారు. కొన్ని లెక్కల ప్రకారం మన దేశంలో 62 కోట్ల మంది జనాభా సెల్‌ఫోన్లలో ఇంటర్నెట్‌ను వినియోగిస్తున్నారు. కొవిడ్ తర్వాత మొబైల్ నెట్ వినియోగం వేగంగా విస్తరిస్తోంది. ఇండియాలో సగటు వ్యక్తి ఇంటర్నెట్ వినియోగ సమయం రోజుకు రెండున్నర గంటలకు పెరిగిందని ఆర్‌బీఐ నివేదిక తెలిపింది. ప్రస్తుతం భారత్‌లో ఒక్కో స్మార్ట్‌ఫోన్ ద్వారా డేటా వినియోగం సరాసరి నెలకు 15.7 జీబీగా ఉంది. ప్రపంచవ్యాప్తంగా ఇదే అత్యధికం. 2026 నాటికి భారత్‌లో మొబైల్ డేటా ట్రాఫిక్ నాలుగు రెట్లు పెరిగి 35 ఎక్సాబైట్లకు చేరుకునే అవకాశం ఉంది. 2026 నాటికి 4 జీ వినియోగదారులు 82 కోట్లకు పెరగవచ్చని, 5 జీ వినియోగదారులు 35 కోట్లకు చేరుకోవచ్చని అంచనా. 2020లో భారత్‌లో మొబైల్ బ్రాడ్‌బ్యాండ్ టెక్నాలజీని వినియోగించుకుంటున్నవారి సంఖ్య 67 శాతం కాగా, 2026 నాటికి 120 కోట్ల మంది వినియోగిస్తారు. మరోపక్క గత ఐదేళ్లలో దేశంలో సోషల్ మీడియా యూజర్లు ఏకంగా 150 శాతం పెరిగారు. సోషల్ మీడియా వినియోగదారుల్లో చైనా అగ్రస్థానంలో ఉండగా, రెండోస్థానంలో భారత్ ఉంది. ప్రముఖ మార్కెట్, వినియోగదారుల డేటా సర్వీస్ సంస్థ 'స్టాటిస్టా' ఇటీవలి నివేదికలో ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. సోషల్ మీడియా వేదికల్లో ఫేస్‌బుక్ అగ్రస్థానంలో కొనసాగుతోంది. సోషల్ మీడియా వినియోగించేవారిలో 83.56 శాతం మంది ఫేస్‌బుక్‌లో చురుగ్గా ఉంటున్నారు. దీంతో పోలిస్తే మిగతా సామాజిక మాధ్యమాలు మన దేశంలో బాగా వెనుకబడి ఉన్నాయి. రెండో స్థానంలో ఉన్న ఇన్‌స్టాగ్రామ్‌ను కేవలం 6.51 శాతం మంది అనుసరిస్తున్నారు. యూట్యూబ్, ట్విట్టర్ మొదలైన వేదికలు ఇంకా వెనుకబడి ఉన్నాయి. రానున్న రోజుల్లో సోషల్ మీడియా పరిధి మరింత పెరుగుతుందని, సమాచార సాధనాల్లో ప్రభావవంతమైన పాత్ర పోషించటం ఖాయమని పరిశీలకులు భావిస్తున్నారు. స్టాటిస్టా నివేదిక ప్రకారం.. 2015లో దేశంలో 15 కోట్ల మంది సోషల్ మీడియా వాడకందారులు ఉండగా, 2020 జనవరి నాటికి ఇది 37 కోట్లకు చేరుకుంది. ఈ ఐదేళ్ల కాలంలో ఎస్ఎం నెటిజన్ల సంఖ్య 2016లో 17 కోట్లు, 2017లో 29.30 కోట్లు, 2018లో 32.60 కోట్లు, 2019లో 35.50 కోట్లు, 2020లో 37 కోట్లుగా ఉంది. 2023 నాటికి దేశంలో సోషల్ మీడియా యూజర్ల సంఖ్య 48 కోట్లకు చేరవచ్చని అంచనా. వినియోగదారుల సంఖ్య 2021లో 40 కోట్లు, 2022లో 43 కోట్లుగా ప్రొజెక్ట్ చేస్తున్నారు. అయితే ఈ వినియోగదారుల సంఖ్య ఇంకా ఎక్కువేనని, ఇప్పటికే దేశంలో 45 కోట్ల మంది సోషల్ మీడియా యూజర్లు ఉన్నారని ఇంకొన్ని సంస్థలు చెబుతున్నాయి. వీరిలో ఫేస్‌బుక్ వాడేవారు 33 కోట్ల మంది ఉన్నారని తెలిపాయి. సోషల్ మీడియా యూజర్లలో దాదాపు 70 శాతం మంది 18-24 ఏళ్ల మధ్యవారే కావటం గమనార్హం.

ఉపయోగించుకునే వారు ఎంతోకొంతమంది ఎప్పుడూ ఉండే అవకాశముంది. ఇంకొందరు ప్రాచుర్యం పొందేవాటిని వాడుకుని నకిలీ పథకాలు వంటి రకరకాల పద్ధతుల్లో లబ్ధి పొందటం కోసమే కాచుకుని ఉంటారు. కరడుగట్టిన విద్వేషవాదులు తక్కువమందే ఉన్నా వారి ప్రచారాల ప్రభావం మాత్రం చాలామందికి వ్యాప్తి చెందుతూ అవాంఛనీయ పర్యవసానాలకు దారి తీస్తుంటుంది. ఇలాంటి అంశాల గురించి ముఖ్యంగా యవ్వనంలోకి ప్రవేశిస్తున్నవారిలో ఎక్కువమందికి ఎప్పుడో ఒకసారి చెబితే సరిపోదు. వారికి ఒకటికి పదిసార్లు సందర్భోచితంగా వివరిస్తూ ఆదర్శంగా నిలిచేవారు కావాలి. ఇంట్లో ఆ పని తల్లిదండ్రులు, ఇతర పెద్దలు విధిగా చేయాలి. వివాదాస్పదం అనుకున్న విషయాలపై, కొన్ని అంశాలపై సందేహం లేకున్నా కూడా.. నిజాల్ని నిర్ధారించుకోవటానికి ఫ్యాక్ట్ చెకర్స్ వినియోగాన్ని పెంపొందించాలి. ఇదేసమయంలో ఖాతాదారులు ఒక ప్రామాణికమైన మెంటార్‌ని ఎంచుకోవటం మేలు. సమాజహిత కృషిలో గణనీయమైన ట్రాక్ రికార్డు ఉండి, హేతుబద్ధంగా, శాస్త్రీయంగా, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేసే లోక్‌సత్తా జేపీ లాంటి వారిని ఎంచుకుని మరీ ఫాలో అవ్వాలి. దీనివల్ల సోషల్ మీడియా వేదిక మనకు గరిష్ఠంగా మేలు చేసే ఉపకరణం అవుతుంది. సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే వార్తల్లో నిజానిజాల్ని సమగ్రంగా నిగ్గుతేల్చుకోవటానికి కూడా ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. హ్యాష్‌ట్యాగ్ ఉద్యమాల్లో తప్పటడుగులు వేయకుండా సరైన కారణాలకు మద్దతిచ్చే అవకాశముంటుంది.

### ఉమ్మడి కార్యాచరణగా కూడా మారాలి

ఇక విశ్వసనీయ మిత్రుల్ని, మెంటార్ని ఎంచుకోవటం, ఉమ్మడి ప్రయోజనంలో భాగంగా ఆన్‌లైన్‌లో చర్చలు చేయటంతో సరిపోదు. ఉమ్మడి ప్రయోజనం.. ఉమ్మడి కార్యాచరణగా కూడా మారాలి. అందుకు మిత్రుల్ని, మెంటార్‌ని ప్రత్యక్షంగా కూడా కలుసుకుని ప్రణాళికాబద్ధంగా పని ప్రారంభించాలి. ఆ పని నుంచి సోషల్ మీడియాలో స్పందనలు, భావాలు మరింత పదునెక్కుతాయి. ఆ వేదిక మరింత సత్ఫలితాలనివ్వగలుగుతుంది. సోషల్ మీడియాలో మనం కూడా విశ్వసనీయతను పెంపొందించుకోగలుగుతాం.

ఈ రకమైన ఒక స్పష్టత మనకు లేకపోతే, సోషల్ మీడియా మనకో అద్భుతావకాశంలా కాకుండా, దీర్ఘకాల సమస్యలా మారుతుంది. ఈ మాధ్యమాల్ని అడ్డంపెట్టుకుని మన చుట్టూ అల్గోరిథమ్‌లు, సంక్లిష్ట సాఫ్ట్‌వేర్‌ల ద్వారా వ్యాపారం చేసి లాభాల్ని

ఆర్జించాలనుకునే గుత్తాధిపత్య భారీ కంపెనీల చేతుల్లో పావులుగా మారిపోతాం. నూతన సాంకేతిక ఆవిష్కరణ వల్లో, మరో కారణంగానో ఒక కంపెనీ గుత్తాధిపత్యం పోతే వచ్చే కంపెనీది కూడా గుత్తాధిపత్యమే అవుతోంది. వాళ్లు ఎన్నికలప్పుడు రాజకీయ పార్టీలకు మనల్ని అమ్మేస్తారు, మన మనస్సాక్షికి విరుద్ధంగా మనమే ఓటు వేసేలా చేస్తారు, ఎన్నికల మధ్యకాలంలో పక్షపాత రాజకీయ భావజాలాలకు మొగ్గు చూపుతుంటారు, తరచూ వ్యాపార సంస్థలకు తాకట్టు పెడతారు. మనల్ని ఓటు వేసే, డేటాను ఉత్పత్తి చేసే, ఉత్పత్తుల్ని కొనుగోలు చేసే బంగారు బాతుల్లా వాళ్లు భావిస్తారు. మన బలహీనతలు, అవగాహనారాహిత్యాలే వారికి పెట్టుబడి కాబట్టి.. విద్వేషపూరిత పోస్టులు నిజమేనని నమ్మి వాటిని అనుసరిస్తున్నా, అమాయకత్వంతో, అజ్ఞానంతో కొన్నిసార్లు మనమే విద్వేషాన్ని వెళ్లగక్కుతున్నా, ఉన్మత్తతను ప్రదర్శిస్తున్నా, వాటి వల్ల మూకదాడులు సైతం జరుగుతూ అమాయకులు ప్రాణాలు కోల్పోతున్నా చోద్యం చూస్తారు తప్ప పట్టించుకోరు. డబ్బులిచ్చి మరీ లైకుల్ని కొట్టించుకుంటున్నా ఆ తప్పు మీద కాకుండా.. ఆ ఖాతాల నుంచి ఉత్పత్తి అయ్యే వ్యక్తుల ప్రవర్తనకు సంబంధించిన డేటా మీదే ఎక్కువ దృష్టి పెడతారు. తమ నిబంధనల్ని పూర్తిగా చదివేవారి సంఖ్య తక్కువని తెలిసినా, వాటిని ప్రజలకు అర్థమయ్యేలా తెలియచేసే ప్రయత్నం సోషల్ మీడియా కంపెనీలు చేయవు. అసాధారణ పరిణామాలతో మరీ ఒత్తిడి పెరిగితేనో, రాజకీయ శక్తుల నుంచి ప్రయోజనాల రీత్యానో అప్పుడప్పుడు నిజాలు చెబుతారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్వీట్లు మరీ గందరగోళాన్ని సృష్టిస్తున్నప్పుడో (2020 ఎన్నికల్లో దాదాపు 3,00,000 ట్వీట్లు మభ్యపెట్టే సమాచారంతో ఉన్నట్లు అధికారిక అంచనా), వర్ణవివక్షకు పోలీసు చేతిలో జార్జి ఫ్లాయిడ్ పాశవిక హత్యకు గురైన ఘటనపై తీవ్ర వ్యతిరేకత పెల్లుబికి 'స్టాప్ హేట్ ఫర్ ప్రాఫిట్' వంటి ఉద్యమాల రూపం దాల్చినప్పుడో కాస్త ఎక్కువ నిజాయతీగా వ్యవహరిస్తారు. ఈ సంస్థల తీరు వల్ల ప్రజాస్వామ్యం ఉనికికే ప్రమాదం ఏర్పడుతోంది. ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయాలని

## ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్‌కు భారతదేశ విశ్రాంత ఉన్నతాధికారులు ఇటీవల రాసిన బహిరంగ లేఖ

ప్రియమైన శ్రీ జుకర్‌బర్గ్,

మేము (కాన్‌స్టిట్యూషనల్ కాండక్ట్ గ్రూప్), భారతదేశ మాజీ ప్రభుత్వోద్యోగులం (సివిల్ సర్వెంట్స్). అఖిల భారత, కేంద్ర ప్రభుత్వ సర్వీసులకు చెందిన మేము మా వృత్తి జీవిత క్రమంలో కేంద్ర ప్రభుత్వంలోను, వివిధ భారతీయ రాష్ట్ర ప్రభుత్వ వ్యవస్థలలోనూ పని చేశాం. ఒక బృందంగా, మాకు ఏ రాజకీయ పార్టీతోనూ అనుబంధం లేదు. తటస్థ, నిష్పాక్షిక వైఖరితో వ్యవహరిస్తూ భారత రాజ్యాంగానికి నిబద్ధమయివుండటం మా ముఖ్య స్వభావమూ, లక్షణమూ అని విశ్వసిస్తున్నాం. మేము గతంలో, భారతీయ పౌరుల ప్రాథమిక హక్కులు ఉల్లంఘనకు గురయ్యాయని భావించినప్పుడల్లా ప్రభుత్వానికి, ప్రభుత్వ సంస్థలకు మా అభిప్రాయాలను తెలియజేస్తూ బహిరంగ లేఖలు రాశాం. ఇప్పటివరకు ఏ భారతీయేతర సంస్థ లేదా వ్యక్తికి మేము ఇలా బహిరంగ లేఖ రాయలేదు. ఇప్పుడు మేము మా సాధారణ అలవాటును వదిలి మీకు ఈ బహిరంగ లేఖ రాస్తున్నాం. ఎందుకంటే భారతదేశంలో ఫేస్‌బుక్ తన వ్యాపార వ్యవహారాలలో చేపట్టిన (లేదా చేపట్టని) నిర్ణీత చర్యలు భారత ప్రజలకున్న కొన్ని ప్రాథమిక హక్కులను ప్రమాదంలోకి నెట్టేశాయి. మీరు ఒక పౌరుడుగా ఉన్న అమెరికా, మా భారతదేశం రెండూ కూడా తమ తమ పౌరులకు అనేక మౌలిక హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛలకు హామీ ఇచ్చాయి. విద్వేష ప్రసంగాలు ప్రజాస్వామిక హక్కులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని మీకు బాగా తెలుసు. అందుకే విద్వేష ప్రసంగాలు లేదా వ్యాఖ్యలను అనుమతించకూడదనే నిబంధనను ఫేస్‌బుక్ తన విధానంలో భాగంగా చేసుకుంది. 'జాతి, తెగ, జాతీయ మూలాలు, మతపరమైన అనుబంధం, లైంగిక ధోరణి, స్త్రీ పురుష భేదం, జెండర్ లేదా జెండర్ అస్తిత్వం, తీవ్ర అంగవైకల్యాలు లేదా వ్యాధులు' మొదలైన వాటి ప్రాతిపదికన ప్రజలపై ప్రత్యక్షదాడినే విద్వేష ప్రసంగంగా ఫేస్‌బుక్ నిర్వచించింది. న్యాయస్థానాలతో ప్రమేయం లేకుండా అక్రమ విచారణతో పలువురిని.. ముఖ్యంగా ముస్లింలు, దళితులను చిత్రవధకు గురిచేసి హతమారుస్తున్న సంఘటనలు ఇటీవల భారత్‌లో పెచ్చరిల్లిపోయాయి. ఈ నేరాలలో అత్యధిక భాగం ఫేస్‌బుక్, వాట్సాప్, ట్విటర్ మొదలైన సామాజిక మాధ్యమాల ద్వారా వ్యాప్తి చెందుతున్న విద్వేష ప్రసంగాల ఫలితంగా జరిగినవే కావడం గమనార్హం. ఈ విషయం తెలిసి కూడా విద్వేష ప్రసంగాలను నిరుత్సాహపరచడంలో ఫేస్‌బుక్ తన సొంత విధానాన్ని భారత్‌లో అమలుపరచడంలో విఫలమైంది. ఒక విస్పష్టమైన పక్షపాత రీతిని అమలుపరిచింది. ఫేస్‌బుక్ వ్యాపార ప్రయోజనాలను కాపాడుకొనేందుకు ఇలా చేయడమనేది కచ్చితంగా అభిశంసనీయమని అన్పిస్తోంది. ఫేస్‌బుక్ అలా తన సొంత విధానానికి విరుద్ధంగా ప్రవర్తించడం ఇతర దేశాలలో కూడా చర్చనీయాంశం కావడాన్ని మేం గమనించాం. మానవ జీవితాలకు, మానవీయ విలువలకు సంభవించే నష్టాన్ని అలక్ష్యం చేసి వ్యాపార ప్రయోజనాలు సాధించుకోవడమా? విద్వేష నేరాలకు దారితీస్తున్న విద్వేష పూరిత ప్రసంగాలు, పోస్టులకు వ్యతిరేకంగా మీ సొంత విధానాన్ని అమలు పరచడంలో మీ కంపెనీ వ్యాపార ప్రయోజనాలు అడ్డురాకుండా జాగ్రత్త వహించగలరని కూడా మేము మనఃపూర్వకంగా ఆశిస్తున్నాం. విద్వేష భాషను అదుపు చేయకపోవడం భారత రాజ్యాంగపు ప్రజాస్వామిక, లౌకిక ప్రాతిపదికను బలహీనపరుస్తుంది.

## 45 శాతానికిపైగా నకిలీ వార్తలు, పోస్టులు

సోషల్ మీడియాలో 45 శాతానికిపైగా నకిలీ వార్తలు, నకిలీ పోస్టులు ఉంటున్నాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. డేటా యుగంలో తప్పుడు సమాచారాన్ని వడపోయటానికి పటిష్ఠ చర్యలు అవసరమంటున్నారు. సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ గవర్నెన్స్ ఇన్నోవేషన్ (సీఐజీఐ) గత ఏడాది అంతర్జాతీయంగా చేపట్టిన సర్వేలో మన దేశంలో ఫేస్‌బుక్ ద్వారా 67 శాతం ఫేక్‌న్యూస్ వ్యాప్తి చెందుతున్నట్లు తేలింది. ఎక్కువ శాతం పోస్టులు వాస్తవాలను వక్రీకరించేలా, తప్పుడు సమాచారాన్ని చొప్పించేలా ఉంటున్నాయని వెల్లడించింది. ఫేక్‌న్యూస్‌లో ఫేస్‌బుక్ తర్వాతిస్థానంలో వాట్సాప్ ఉంది.

ఈ సంస్థలు పనిగట్టుకుని ప్రయత్నించకపోవచ్చు. నిషేధిత భావజాలాన్ని, ఉత్తుత్తుల్ని తాము ప్రచారం చేయటం లేదని , ఫిల్టర్లు పెట్టామని వాదించవచ్చు. కానీ వీరి లాభార్జన ధ్యేయంలో ప్రజాస్వామ్యం కూడా మూల్యం చెల్లిస్తోంది. ఎన్నికల్లో ప్రజలను పక్కదోవ పట్టించి ఫలితాల్నే మార్చేసిన ఘనత ఈ కంపెనీలకుంది. అమెరికా దాకా పోనక్కర్లా. భారతదేశంలో, తెలుగు రాష్ట్రాల్లో కూడా ఈ తరహా ప్రచార ప్రభావం పెరుగుతోంది (భారీ టెక్ కంపెనీలను గట్టిగా కట్టడి చేయాలని ఇంటర్నెట్‌ను కనిపెట్టిన టిమ్ బెర్నర్స్-లీ కూడా వాదిస్తున్నారు). ఊబిలో కూరుకుపోయాక బయటపడటానికి నానాఅవస్థలు పడే బదులు.. సోషల్ మీడియాను మన కోసం, మన ఉమ్మడి అవసరాల కోసం ఒక చక్కటి అవకాశంగా ఉపయోగించుకునే స్పష్టతతో ముందునుంచే వ్యవహరించటం మేలు. వ్యాపార, వృత్తిపరమైన అవసరాలకు, రాజకీయ ప్రచారానికీ సోషల్ మీడియాను ఉపయోగించుకోవాలనుకోవటం తప్పు కాదు. కానీ ఆ స్పష్టతనివ్వకుండా.. ప్రజలకు సామాజిక సంబంధాల వేదిక ముసుగులో, గుత్తాధిపత్యాన్ని అడ్డంపెట్టుకుని ప్రజల వ్యక్తిగత వివరాలు, వారి భావోద్వేగాలతో వ్యాపారం చేయటం, కులం, మతం, ప్రాంతం వంటి విభజనల్ని రెచ్చగొట్టటం, లైక్‌లు, షేర్‌లు, కామెంట్లను ప్రోత్సహిస్తూ డెమోగ్రాఫిక్, సైకోగ్రాఫిక్ వర్గీకరణలు, పుకార్లను, తప్పుడు సమాచారాన్ని నియంత్రించకుండా వదిలేయటం, పారదర్శకత, జవాబుదారీతనం లేకుండా వ్యవహరించటాల్ని మాత్రం ఆమోదించకూడదు. చట్టబద్ధపాలన అరకొరగా ఉండే భారత్ లాంటి దేశాల్లో ఆ ధోరణి చాలా అనర్థాలకు దారితీస్తుంది.

మన వ్యక్తిగత వివరాలను సోషల్ మీడియా సంస్థలు రహస్యంగా తెలుసుకోవటం, వ్యాపార అవసరాలకు వినియోగించు కోవటం చేయకపోతే, మనకు ఇంత తేలిగ్గా సామాజిక మాధ్యమాలు అందుబాటులో ఉండవేమో అనుకోవాల్సిన పన్లేదు. మనకు చాటింగ్‌లు, ఫోటో, వీడియో షేరింగ్‌లు వంటివి ఈ టెక్ కంపెనీలు అందిస్తున్న చిన్న ఆఫర్‌లు మాత్రమే. కచ్చితంగా ప్రభుత్వాలు తగిన రెగ్యులేషన్లను, ఫ్యాక్ట్ చెకర్లను అమలు చేస్తూనే వీటిని మనకు మన బడ్జెట్‌లోనే ఇంతకంటే ఎక్కువగా అందుబాటులో ఉంచవచ్చు. తీవ్రమైన చట్టాలతో వ్యక్తి స్వేచ్ఛకు సంకెళ్లు వేయకుండానే వ్యక్తుల బారి నుంచి సమాజాన్ని కాపాడటం ప్రభుత్వాల ప్రధాన విధి. ప్రజలకు నాణ్యమైన చదువు లేకపోవటం, వారిలో పౌరసత్వ భావన కొరవడటాల్ని ఆసరాగా తీసుకుని మన దేశంలో పాలకులు ప్రజానీకం వ్యక్తిగత వివరాల్ని మార్కెట్‌కి వదిలేస్తున్నారు.

**సోషల్ మీడియాలో గెలుపు కోసం లక్ష్యాలను వదులుకోకూడదు**

సమాచారం అంటే సాధికారత నిచ్చేది. తప్పుడు సమాచారమంటే సాధికారతను దెబ్బతీయటమే. ప్రతి సమాచారం మనకు తక్షణ ఆనందాన్ని, ఆహ్లాదాన్నీ పంచేది కాకపోవచ్చు. కానీ విశ్లేషణతో, పరిశోధనతో, ప్రయత్నంతో వాస్తవ ప్రపంచం గురించి మనకు మెరుగైన పరిజ్ఞానాన్నిచ్చి, అంతిమంగా మనల్ని మెరుగైన

## ఫేక్‌న్యూస్ వేగానికి గోబెల్స్ పద్ధతే కారణమట!

నిజం దుస్తులు ధరించేలోపు అబద్ధం ఊరంతా తిరిగి వస్తుందని సామెత. ఫేక్‌న్యూస్ కూడా ఇంతే. అసలు విషయం తెలిసేలోపు ఊరంతా ప్రచారమై ఉంటుంది. ఎందుకిలా అంటే.. ఒకే సమాచారం పదేపదే తారసపడుతూ ఉంటే దాన్ని షేర్ చేయటం తప్పుకాదని ప్రజలు అనుకోవటమే అంటున్నారు యూనివర్సిటీ ఆఫ్ సదరన్ కాలిఫోర్నియా శాస్త్రవేత్త మేధా రాజ్. ఈ భారతీయ సంతతి శాస్త్రవేత్త ఒక అధ్యయనం జరిపి ఈ నిర్ధారణకు వచ్చారు. అసత్య వార్త శీర్షికను ఒకసారి చూస్తే ఎవరైనా దాన్ని నమ్మరుగానీ.. రెండు, మూడు, నాలుగుసార్లు చూస్తే నిజమే అనుకుంటారని ఈ అధ్యయనం చెబుతోంది. సైకలాజికల్ సైన్స్‌లో ఆమధ్య ప్రచురితమైన అధ్యయనంలో భాగంగా శాస్త్రవేత్తలు కొంతమందికి ఆన్‌లైన్‌లో కొన్ని ప్రశ్నలు వేశారు. ఒక అసత్యపు శీర్షిక ప్రచురించడం ఎంతమేరకు నైతికం? ఆమోదయోగ్యం? అని అడగటంతోపాటు అలాంటి శీర్షికలను లైక్ చేసి, షేర్ చేసే లేదా పోస్ట్ చేసిన వ్యక్తిని బ్లాక్, అన్‌ఫాలో చేసే అవకాశం ఏమిటని కూడా అడిగారు. వచ్చిన సమాధానాలను విశ్లేషించినపుడు చాలామంది ఒకసారి కంటే ఎక్కువ చూసిన వార్త/శీర్షికను షేర్ చేయటం పెద్దగా అనైతికం కాదని భావిస్తున్నట్లు తేలింది. రెండోసారి చూసినపుడు లైక్, షేర్ చేసే అవకాశాలు ఎక్కువన్నారు. పదేపదే అందే సమాచారం సత్యమన్న భావన ఎక్కువయ్యేలా చేస్తుందని అధ్యయనం విశ్లేషించింది. గ్రాఫిక్ కార్డులు ఉపయోగించి ప్రముఖ వ్యక్తులపై ప్రచారం చేయటం ద్వారా అవాస్తవ సమాచారాన్ని వైరల్ చేసేవారిలో సాధారణ ప్రజలు కూడా చాలాసార్లు తమకు తెలియకుండానే పాలుపంచుకుంటున్నట్లు మైక్రోసాఫ్ట్ సర్వే గుర్తించింది.

వ్యక్తులుగా తీర్చిదిద్దేది సరైన సమాచారం. అది ఎంత చేదుగా ఉన్నా సరే. వినియోగదారులుగా మనం మెరుగైన ఉత్పత్తిని కొనుగోలు చేయాలన్నా సరైన సమాచారమే కీలకం. అందుకే, మనం కోరుకునే స్వేచ్ఛను ఇతరులకు కూడా ఇస్తూ, వారి స్పందనల్ని, మౌనాన్ని కూడా గౌరవిం చాలి. ఇదంతా పరిణామక్రమమని గుర్తిస్తూ మనం పరిణతితో వ్యవహ రించటాన్ని పెంపొందించుకుం టుండాలి. సోషల్ మీడియాలో గెలవటం కోసం మన లక్ష్యాలను ఎప్పుడూ వదులుకోకూడదు. అసత్యాలు కావు కదా అని అర్ధసత్యాల బారిన పడకూడదు. ఆయా సందర్భాల్ని ఉపయోగించుకుని సత్యాన్ని, అసత్యాన్ని రసవత్తరంగా మిక్స్ చేయటం ప్రమాదకరమైన క్రీడ. ప్రతి తరం గత తరం కంటే ఎక్కువ తెలివితేటలు కలిగినదే అవుతుంది. అందుకే సామాజిక మాధ్యమాల్లో కొత్తతరం వారిలో సృజనాత్మకత అబ్బురపరుస్తుంటుంది. కానీ ఏది సత్యం, ఏది అసత్యం అని గుర్తించే శక్తిని పెంపొందించుకోకుంటే చిటికెడు నిజంలో కలిపే బండెడు అబద్ధాలు యువత ప్రత్యేకతల్ని పక్కదోవ పట్టే అవకాశముంటుంది. సోషల్ మీడియాలో వార్తల్ని, కనీసం కాస్త పెద్దవార్తల్ని నమ్మే ముందు మనం ఒక్కసారి డిజిటల్ టూల్స్‌తోనో, ప్రింట్ మీడియాలోనో (ప్రింట్ మీడియాలో కొంత కల్తీ ఉండొచ్చుగానీ, నకిలీ చాలా తక్కువ), ఒరిజినల్/సోర్స్ వెబ్‌సైట్స్ ఉంటే వాటిలోనో, జేపీ లాంటి అవగాహన, విశ్వసనీయత గల వ్యక్తుల ఖాతాల్లోనో తరచి చూసుకోవటం మేలు.

**"వినదగు నెవ్వరు చెప్పిన**
**వినినంతనె వేగపడక వివరింపదగున్**
**కనికల్ల నిజము తెలిసిన**
**మనుజుడెపో, నీతిపరుడు మహిలో సుమతీ!"**

వయసు ప్రభావం వల్ల కొత్తతరంలో ఎక్కువమందికి దీర్ఘకాలిక దృష్టి తక్కువగా ఉండే అవకాశం ఉంది. కుటుంబ సభ్యులు, మెంటార్లు, మంచి పుస్తకాల సాయంతో సహనాన్ని, ముందుచూపుని విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవాలి.

నిజాల్ని, నిజమైన స్నేహితుల్ని దూరం చేసుకోకుండా సంయమనంతో వ్యవహరించాలి అలాగే నకిలీ ఖాతాలు, దురుద్దేశపు అనామకత్వాల (ఎనానిమిటీలు) పట్ల అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా అపరిచితుల ట్రోల్స్‌కి స్పందించకుండా సంయమనం పాటించాలి. బుల్లీయింగ్ బారిన పడినా గందరగోళ పడకుండా అధిగమించాలి. మితిమీరిన ఉద్వేగపూరిత అనుబంధాన్ని పెంచుకుంటూ.. వాస్తవాల నుంచి, వాస్తవ ప్రపంచం నుంచి దూరంగా పారిపోకూడదు. నిజాలు చెప్పేవారిని, నిజమైన స్నేహితుల్ని దూరం చేసుకోకూడదు. ప్రైవసీని, పబ్లిక్ లైఫ్‌ని కలగలిపి అనుక్షణం థ్రిల్స్‌తో ఊరించే సోషల్ మీడియాలో మనం ఏరోజుకారోజన్నట్లు తాత్కాలిక ఉద్వేగాలతో వ్యవహరిస్తే, రాబోయే రోజుల్లో, రాబోయే తరాల ముందు బద్‌నామ్ అవుతాం. ఎన్నేళ్లయినా మన మాటలు, ప్రవర్తన శాశ్వతంగా ఉంటాయని గుర్తించి.. మనం సోషల్ మీడియాలో స్పందిస్తుండాలి.

సోషల్ మీడియా వేదికలు రకరకాల రూపాంతరాలు చెందుతుండవచ్చు. భవిష్యత్తులో కన్వర్జెన్స్ పంథాలోకి రావొచ్చు. కానీ సోషల్ మీడియా వేగంగా విస్తరించే దీర్ఘకాల ప్రజాస్వామిక వేదిక. కరోనా అనంతర పరిణామాలు విస్తరణ వేగాన్ని ఇంకా పెంచుతాయి. సామాజిక మాధ్యమాల్ని దుర్వినియోగం చేసినా, అసలు ఉపయోగించకపోయినా.. రెండూ మనకు, మన భావితరాలకూ నష్టం చేసేదే అవుతుంది. ప్రజాస్వామ్యంలో చాలా చికాకు ఉంటుంది, చాలా చెత్త ఉత్పత్తి అవుతుంది. కానీ ప్రజాస్వామ్యానికి ప్రత్యామ్నాయం లేదు. చెడ్డ ప్రజాస్వామ్యానికి విరుగుడు మరింత మంచి ప్రజాస్వామ్యమే. అపరిపక్వ ప్రజాస్వామ్యానికి విరుగుడు మరింత పరిపక్వ ప్రజాస్వామ్యమే. కాబట్టి.. ఉమ్మడి ప్రయోజనాలు, వాటి చుట్టూ కార్యాచరణతో ప్రతి ఒక్కరూ ప్రజాస్వామిక సంభాషణా వేదికైన సోషల్ మీడియాలో భాగస్వాములు కావాలి. స్మార్ట్‌ఫోన్ యుగంలో ఇదో మంచి అవకాశం. అదే సమయంలో అబద్ధాల చుట్టూ కాకుండా నిజాల చుట్టూ సోషల్ మీడియా తిరిగేలా చూసుకుంటుండాలి. ప్రజల్ని విభజించేది కాకుండా కలిపేదిగా.. ఆందోళనను, మానసిక జాడ్యాలను పెంచేది కాకుండా సంతోషాన్ని పంచే వేదికగా తయారుచేసుకోవాలి. ఎన్నికల సమయంలోనే కాకుండా, ఎన్నికల మధ్య కూడా పాలనను, రాజకీయాల్ని, సమాజాన్ని పట్టించుకునే, ప్రభుత్వంలో భాగస్వాములుగా వ్యవహరించే డిజిటల్ పౌరసత్వాన్ని భారత్‌లో పెంపొందించాలి. ప్రభుత్వం తాను చేయాల్సిన పనులు– చట్టబద్ధ పాలన, అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందించటం, స్థానిక స్వయంపాలన, హక్కుగా ప్రభుత్వ సేవలు, మౌలిక వసతులు వంటివి చేస్తే ప్రజలు సోషల్ మీడియాను గణనీయంగా సద్వినియోగం చేసుకుంటారు. ఇది ఎంత వేగంగా జరిగితే భారత్‌కు అంత ప్రయోజనకరం. ■

## రాజకీయ దుష్ప్రచారం కోసమే ప్రత్యేక విభాగాలు

రాజకీయ పార్టీలు తమ గురించి ప్రచారం చేయటానికి సోషల్ మీడియా విభాగాలను ఏర్పాటు చేసుకోవటాన్ని మనం ఆక్షేపించనక్కర్లేదు. కానీ కొన్ని రాజకీయ పార్టీలు సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం కోసమే ప్రచార విభాగాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. జీతాలిచ్చి మరీ ప్రత్యర్థి పార్టీలపై, ఆ పార్టీ నాయకులపై బురద జల్లిస్తున్నారు. ముఖ్యంగా ఎన్నికల సమయంలో. ఇటీవల దుబ్బాక ఉప ఎన్నిక, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ఇది విపరీత పోకడలు పోయింది. వినాయకుడి విగ్రహం పాలు తాగింది, గోధుమలో ప్లాస్టిక్ ఉంది వంటి ప్రచారాల్ని ముందువెనుక చూసుకోకుండా గుడ్డిగా నమ్మేసి షేర్ చేసే అమాయకులు కోకొల్లలుగా ఉన్నందున ఆ దుష్ప్రచారం వల్ల మన సమాజంపై, ఉమ్మడి నిర్ణయాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతోంది.

# విద్వేషం నుంచే టెర్రరిజం

**- సంజయ్ జోషి, అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఛైర్మన్, న్యూఢిల్లీ**

ఇవ్వాళ్టి రోజుల్లో అసత్య, తప్పుడు, వివక్షాపూరిత ప్రచారాలకు సామాజిక మాధ్యమం ప్రధాన వేదిక అయ్యింది. ఈ విధమైన తప్పుడు, విష ప్రచారం కేవలం భారతదేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్నది. శాస్త్రీయతను నాశనం చేసి అజ్ఞాన చీకట్ల కింద ప్రపంచాన్ని మగ్గేలా చేసే క్రమంలో సర్వత్రా మూక స్వభావాన్ని పెంచి పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అందమైన అబద్ధాలకు చారిత్రకతను అద్ది ప్రచారంలో పెడుతున్నారు. మొత్తంగా సామూహిక మానసిక రుగ్మతకు మొత్తం సమాజాన్ని గురి చేస్తున్నారు. ఇలాంటి మూకత్వాన్ని శాస్త్రీయ భావజాల సైద్ధాంతిక సంఘటిత నిర్మాణాలతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉన్నది.

అమెరికాలో జరిగిన ఎల్ పాసో కాల్పుల ఘటన తర్వాత సామాజిక మాధ్యమాల్లో జరిగిన ప్రచార తీరుతో ట్రంప్ కూడా కళ్లు తెరిచారు. ఆన్‌లైన్ టెర్రరిజం తీరు ఎరుకలోకి వచ్చింది. దీంతో అమెరికా శ్వేతసౌధం గూగుల్, ఫేస్‌బుక్, ట్విటర్ యాజమాన్యాలతో సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచార తీరుపై చర్చించింది. కాల్పుల ఘటనను తెలియపర్చటం కాకుండా దాన్ని భయానకంగా చిత్రీకరించటం, ప్రజల్లో భయభ్రాంతులు కలిగించటం లక్ష్యంగా సాగిన ప్రచార తీరుపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సామాజిక మాధ్యమాల్లో ప్రత్యక్షమవుతున్న విషయాలు, సమాచారంలో ఎంత వాస్తవం ఉందన్నది కాకుండా ప్రచారం జరుగుతున్న తీరు ప్రమాదకరంగా మారటాన్ని అదుపులో పెట్టడంపై ఆలోచించాలని సూచించింది. అమెరికాలో జరిగిన కాల్పుల ఘటనల విషయంలో అమెరికా సమాజంలో భయాందోళనలు పాదుకొనే విధంగా జరిగిన ప్రచారం పట్ల ఆగ్రహం వ్యక్తం చేసింది. అయితే దీనికి సామాజిక మాధ్యమాలను నిందిస్తే సరిపోదు. దీనికి సామాజికంగా ఉన్నతస్థానాల్లో ఉన్నవారూ, అధినేతలు, ప్రముఖ నాయకులు కూడా కారణం కావటం ఆలోచించాల్సిన విషయం. ఈ క్రమంలోనే తిరుగుబాటుదారుల సమాచారం, టెర్రరిస్టు గ్రూపుల సమాచారంతోపాటు ఆయా సమాజాల్లో నెలకొని ఉన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో జరుగుతున్న ప్రచారాలు కూడా సామాజిక మాధ్యమాల్లో ఎక్కువగా ఉంటున్నాయి. వీటన్నింటిలో అబద్ధ ప్రచారాలే పతాకస్థాయిలో ఉండటం గమనార్హం.




నీల్ ఆర్మ్‌స్ట్రాంగ్ చంద్రునిపై కాలుమోపిన జులై 21వ తేదీని అద్భుత విజయోత్సవంగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్న సందర్భంగానే.., ఇంగ్లండ్‌లో కొందరు 'చెస్టర్ ఫ్లాట్ ఎర్తర్స్' సమూహం పేరిట ప్రపంచంలోనే 'అతి పెద్ద అబద్ధం'గా హేళన చేస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ శతాబ్దంలోనే 'నాసా' చెప్పిన గొప్ప గాలివార్తగా వారు అభివర్ణించారు. ఈ ఫ్లాట్ ఎర్తర్స్ ఏదో మామూలు ఆకతాయి మూకలు కాదు. వారికి తమవైన వెబ్‌సైట్లు, బ్లాగులున్నాయి. యూ ట్యూబ్, ఫేస్‌బుక్కుల్లో వారి ప్రచార విషయాలు ప్రపంచవ్యాప్తంగా విస్తృతంగా ప్రచారమయ్యాయి.

ఈ నేపథ్యంలోనే మరో విషయం కూడా చెప్పుకోవాలి. గతేడాది అమెరికాలో 'లైవ్ సెన్స్' వారు విద్యార్థి యువకుల్లో ఓ అధ్యయనం చేశారు. వారి రిపోర్టు ప్రకారం.. అమెరికాలోని 18-24 ఏండ్ల వారు భూమి బల్లపరుపుగానే ఉన్నదని విశ్వసిస్తున్నారు. జనాభాలో 40 శాతానికిపైగా శాస్త్ర విజ్ఞానంగా చెలామణిలో ఉన్న జ్ఞాన విషయాలపై అనుమానాలు వ్యక్తం చేశారు. భూమి బల్లపరుపుగా ఉన్నదని నమ్మే ఫ్లాట్ ఎర్తర్స్ ప్రభావం అమెరికాలో గణనీయంగానే ఉన్నది. కానీ ఈ ఫ్లాట్ ఎర్తర్స్ అనే వారు సోషల్ మీడియా సృష్టికర్తలు ఎంతమాత్రం కాదు. వారు ఈ సమాజంలోని ప్రజాసమూహంలోని విశ్వాసాలకు ప్రతీకగా చెప్పుకోవచ్చు. అయితే ఇదొక అమెరికాకు సంబంధించిన విషయమే కాదు. ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రాంతాలు, దేశాల్లో ఈ విధమైనవారు ఎక్కువ మోతాదులోనే ఉన్నారు. నిరూపిత శాస్త్ర విజ్ఞాన విషయాల సత్యాలకన్నా తమ విశ్వాసాలకే పెద్దపీట వేస్తారు. ఈ క్రమంలోంచే భూమి గుండ్రంగా ఉందని, సూర్యుని చుట్టూ తిరుగుతున్నదని చెప్పిన గెలీలియోను క్యాథలిక్ చర్చి తిరస్కరించింది. గెలీలియోను సాంప్రదాయ విశ్వాసాల వ్యతిరేకిగా దూషించి శిక్షించింది. ఈ మధ్యనే దాదాపు 350 ఏండ్ల తర్వాత గెలీలియో విషయంలో తాము తప్పు చేశామని పోప్ ఒప్పుకున్నాడు. కానీ ఇప్పటికీ మత గ్రంథాలేవీ భూమి గుండ్రంగా ఉన్నదనే గెలీలియో ఆవిష్కరణను సత్యంగా పరిగణిస్తున్న స్థితి లేదు. శాస్త్ర విజ్ఞానాన్ని సామాజిక జీవన ఉపరితలాన్ని సంస్కరించుకోవటానికి పరికరంగా వినియోగించుకుంటున్నారు. శాస్త్ర విజ్ఞానంతో అవసరాలు, సౌకర్యాలు, సౌఖ్యాలు పొందటానికే ప్రాధాన్యమిస్తున్నారు తప్ప, శాస్త్రీయ జ్ఞానాన్ని ప్రాపంచిక అవగాహనకు వెలుగుదారిగా పరిగణించటం లేదు. సమాజాన్నీ, సామాజిక సమస్యలను శాస్త్రీయంగా అర్థం చేసుకోవటానికి సాహసించటం లేదు. మరోవైపు తమదైన మూఢ విశ్వాసాలు కేంద్రంగా సామాజిక సమూహాలను పోగు చేసుకోవటానికి సామాజిక మాధ్యమాలను వేదికగా వినియోగించుకుంటున్నారు. అంధ విశ్వాసాల గుడ్డి గుంపును పోగుచేసుకుంటున్నారు. మూర్ఖపు మందబలాన్ని పెంచుకొని తమదైన విద్వేష, వివక్షాపూరిత భావజాలాన్ని విస్తృతపరుస్తున్నారు.

సరిగ్గా ఈ పునాది మీదనే టెర్రర్ గ్రూపులు కూడా విస్తృతమవుతూ బలోపేతమవుతున్నాయి. అది తప్పుడు భావజాలమైనా ధైర్యంగా ఆయా సామాజిక సమూహాల్లో బలాన్ని పెంచుకుంటున్నాయి. ఈ క్రమంలోంచే సమాజంలో నెలకొన్న హింసాత్మక జుగుప్సాకర ధోరణి గురించి చెప్పుకోవాలి. సమాజంలో ఎక్కడైనా ఒకచోట ఎవరైనా భయానక

పరిస్థితుల్లో చావుబతుకుల్లో ఉండి కొనఊపిరితో కొట్టుమిట్టాడుతుంటే.., ఆ దృశ్యాన్ని చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో పెట్టడానికి చేస్తున్న ప్రయత్నం, ఆ బాధితున్ని సంరక్షించటంలో చూపటం లేదు. దీనికి ఎన్నెనా ఉదాహరణలు చెప్పుకోవచ్చు. కండ్ల ముందు మనిషి చనిపోతుంటే రక్షించటానికి బదులు అతని దుస్థితిని వీడియో చిత్రీకరించటంలో ఎదుటివారు మునిగిపోతున్న తీరు దిగ్భ్రాంతికరం, అమానవీయం. ఇదేవిధంగా అమెరికాలో 9/11 ఉగ్రదాడి తర్వాత జరిగిన సోషల్ మీడియా ప్రచారం అంతాఇంతా కాదు. ఇప్పుడు ప్రతి ఒక్కరికీ అందుబాటులోకి వచ్చిన స్మార్ట్‌ఫోన్ స్క్రీన్‌లో భయానకమంతా క్షణంలో ప్రపంచమంతా పాకిపోతున్నది.

ఈ మధ్యకాలంలో అమెరికాలో జరిగిన కాల్పులకు తెగబడినవారంతా తమ ఘనకార్యాన్ని సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సామాజిక మాధ్యమాల్లో ఉంచారు. ఆ క్రమంలో వారెందుకు ఆ ఘాతుకానికి పాల్పడుతున్నారో చెప్పుకున్నారు. వలసల మూలంగానే తమకు కష్టాలు వస్తున్నాయని, వలసలను నిర్మూలిస్తేనే తమకు విముక్తి అన్న రీతిలో ప్రచారానికి తెగబడుతున్నారు. అయితే ఇలాంటి విషపూరిత, వివక్షాపూరిత తప్పుడు ప్రచారాన్ని కూడా సామాజిక మాధ్యమాలు తమ టీఆర్‌పీ రేటింగ్స్ కోసం ప్రచారం చేస్తున్నాయి. మరోమాటలో చెప్పాలంటే అలాంటి వింత, విష ప్రచారాలకే పెద్దపీట వేస్తున్నాయి.

ఇవ్వాళ ప్రపంచవ్యాప్తంగా విద్వేషం, టెర్రరిజం కలగలసి ఉన్నాయి. ఒక సామాజిక సమూహాన్ని ద్వేషిస్తూ హింసాత్మక ఘటనలకు తెగబడటం ఎక్కువైపోయింది. టెర్రరిజం విద్వేషంతోనే పురుడు పోసుకుంటున్నది. క్రైస్ట్ చర్చి కాల్పులకు తెగబడిన ఆగంతకుడు.. వలసవాదులను తరిమికొట్టడమే తన లక్ష్యంగా చెప్పుకున్నాడు. ఆ విద్వేషంతోనే అమాయకుల ప్రాణాలు తీశాడు. ఎల్ పాసో కాల్పుల ఘటనకు కారకుడైన 21 ఏండ్ల ఆగంతకుడు కాల్పులకు తెగబడేముందు సోషల్ మీడియాలో 2300 పదాలతో కూడిన తన ప్రణాళికను 'పోస్ట్' చేశాడు. మనం ఎంతమందిని వలసవాదులను చంపితే అంతగా మన జీవితం సంతోషంగా ఉంటుందని చెప్పుకున్నాడు. ఇలా ఈ మధ్యకాలంలో వివిధ దేశాల్లో కాల్పులకు తెగబడిన ఆగంతకులంతా విద్వేషాన్ని నింపుకొని మనుషుల ప్రాణాలను తీసినవారే. దేశంలోనూ, ప్రపంచవ్యాప్తంగానూ సామాజిక హింసను పెంచి పోషించే విధంగా అశాస్త్రీయ, అనైతిక, విద్వేష భావాలతో మెజారిటీవాదం మొత్తం సమాజాన్ని హింసాత్మకం చేస్తున్నది. శాస్త్రీయతను నాశనం చేసి అజ్ఞాన చీకట్ల కింద ప్రపంచాన్ని మగ్గేలా చేసే క్రమంలో సర్వత్రా మూక స్వభావాన్ని పెంచి పోషిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే అందమైన అబద్ధాలకు చారిత్రకతను అద్ది ప్రచారంలో పెడుతున్నారు. మొత్తంగా సామూహిక మానసిక రుగ్మతకు మొత్తం సమాజాన్ని గురిచేస్తున్నారు. ఇలాంటి మూకత్వాన్ని శాస్త్రీయ భావజాల సైద్ధాంతిక సంఘటిత నిర్మాణాలతో ఎదుర్కోవాల్సిన అవసరం ఉన్నది. లేనట్లయితే అనాగరిక హింసాత్మక మూకత్వమే రాజ్యమేలి మానవీయతను హరించి వేస్తుంది.

**(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)** ■

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ని ఏర్పాటు చేయండి




చిలకలూరుపేటలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని లోక్‌సత్తా పార్టీ ఆంధ్రప్రదేశ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యుడు మాదాసు భానుప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించిన అనంతరం ఆయన పట్టణంలోని ట్రాఫిక్ సమస్యలు, రహదారి ప్రమాదాలపై డీజీపీకి రాసిన లేఖను విడుదల చేశారు. నూలు, పొగాకు వంటి పరిశ్రమల్లో పనిచేయటానికి నిత్యం పెద్దసంఖ్యలో కార్మికులు వస్తుండటం, జాతీయ రహదారి పట్టణానికి మధ్యలో ఉండటం, చుట్టుపక్కల మండలాలకు చెందిన ప్రజలు రోజువారీ పనుల నిమిత్తం వస్తుండటం వల్ల చిలకలూరిపేటలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉందని, తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని భానుప్రసాద్ అన్నారు. నివారించదగ్గ మరణాల బారిన పడ్డ వారి కుటుంబసభ్యుల బాధ వర్ణనాతీతమన్నారు. పట్టణంలో తక్షణం పూర్తిస్థాయి సిబ్బందితో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వేసిన స్పీడ్‌బ్రేకర్లను తొలగించి నిబంధనలకనుగుణంగా కొత్తవి.. రాత్రిపూట కూడా వాహనదారులు గుర్తించే విధంగా తెలుపు – నలుపు జీబ్రా గీతలతో వేయాలన్నారు. పాదచారులు సురక్షితంగా నడిచేందుకు ట్రాఫిక్ నియంత్రణ పద్ధతుల్ని అమలు చేయాలని, ఆధునీకరించిన ట్రాఫిక్ సిగ్నల్స్‌ని త్వరితగతిన ఏర్పాటు చేయాలని అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పాడైపోయి నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని పునరుద్ధరించాలన్నారు. జాతీయ రహదారితోపాటు సంబంధిత అన్ని విభాగాల అధికారులు కూడా ఈ చర్యల కోసం స్పందించాలన్నారు. లోక్‌సత్తా పార్టీ నేతలు మురికిపూడి ప్రసాద్, ఎస్. హరిప్రసాద్, డాక్టర్ టి. కృష్ణప్రసాద్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# అబద్ధాల్ని గుర్తించే విద్య కావాలిప్పుడు..

## - డాక్టర్ దేవరాజు మహారాజు, సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త

వాస్తవాలు గ్రహించాలన్న స్పృహ జనంలో ఉంటే తగిన మార్గాలున్నాయి. అయితే వాటిని వెతుక్కోవాల్సి ఉంటుంది. వెతుక్కోకపోతే సోషల్ మీడియా అబద్ధాల హోరులో కొట్టుకుపోతాం.

సోషల్ మీడియాలో తరచూ కనబడే కొన్ని ఫేక్ మెసేజ్‌ల ప్రభావంలో పడి యువత కొట్టుకుపోతోంది. కొంచెం ఇంగితజ్ఞానం ఉపయోగించి ఆలోచిస్తే నిజానిజాలు బయటపడతాయి. మనకు అందుతున్న సమాచారమంతా వాస్తవమైంది కాదన్నది ముందు గ్రహించుకోవాలి. ఎందుకంటే, ప్రభుత్వాధినేతలు కూడా వారి స్వప్రయోజనాల కోసం, పనిగట్టుకుని ఏకే 47తో కాల్పులు జరిపినట్లుగా అబద్ధాల్ని పౌరుల గుండెల్లో పేలుస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. ఒకవైపు రాజ్యాంగాన్ని ఖూనీ చేస్తూ మరోవైపు దాని గూర్చి మహోపన్యాసాలు ఇస్తున్నారు. విజ్ఞానం పెరిగితే ప్రశ్నలు తలెత్తుతాయి. ప్రశ్నల్ని ఎదుర్కొనే స్థయిర్యం ప్రభుత్వాలకు లేదు. అందుకే పేద విద్యార్థులకు విద్యను దూరం చేయాలనుకుంటాయి.




మరోవైపు కొందరు మత విమర్శను అసలు తట్టుకోలేకపోతున్నారు. అలాంటివారు చేసే ఆరోపణ సామాన్యంగా ఒకటి ఉంటుంది. “మీకు మా మతమే కనిపిస్తోందా, విమర్శించటానికి?” అని గింజుకుంటూ ఉంటారు. అసలు విషయమేమంటే లేని గొప్పతనాన్ని, కట్టుకథల్ని, పిట్టకథల్ని, పుకారు వార్తల్ని తమ తమ మతాలకు ఆపాదించి అవన్నీ నిజమని ప్రచారం చేసుకుంటున్నప్పుడు– అవి ఏ మతం గురించైనా సరే విమర్శను ఎదుర్కోక తప్పదు. అలాంటి కట్టుకథల్ని, అబద్ధపు దుష్ప్రచారాల్ని యువత అర్థం చేసుకుంటూ ఉండాలి. సహేతుకంగా తిప్పికొడుతూ ఉండాలి. ఎందుకంటే, ఎవరి మతం ఏదైనా, ఎవరి విశ్వాసాలు ఎలాంటివైనా మనమంతా మనుషులమన్నది మరచిపోకూడదు. మానవ వికాసంలోనే ఆధునిక వైజ్ఞానిక వికాసం జరుగుతూ వస్తోంది. మనం దానికి ప్రాధాన్యమివ్వాలి. మనిషి మనిషిగా సగౌరవంగా నిలబడగలిగినప్పుడే వివక్షలేవీ లేని మానవ సంబంధాలు సమాజంలో బలపడతాయి. విచారించదగ్గ విషయమేమంటే ఈ దేశంలో మానవీయ విలువల్ని మంటగలిపినవారే డబ్బులు వెదజల్లి అనైతికంగా అధికారం చేజిక్కించుకుంటున్నారు. ఈ విషయం యువత అర్థం చేసుకుని, విశ్లేషించుకుంటూ ఉండాలి. దానికి అడ్డుకట్ట వేయగలగాలి.

వైజ్ఞానిక పరిశోధనల గురించి తెలుసుకోవడం మంచిది. అది వీలుకానప్పుడు పురాణాల్ని హేతుబద్ధంగా విశ్లేషించిన రచయితల పుస్తకాలు చదివినా మనకు మన గురించి సరైన అవగాహన కలుగుతుంది. కవిరాజు త్రిపురనేని రామస్వామి, తాపీ ధర్మారావు, సి.వి, నార్ల వెంకటేశ్వరరావు లాంటి వారెందరో అలాంటి పుస్తకాలు రాశారు. అలాంటివారిలో మనం చెప్పుకోవాల్సిన మరో పేరు పెండ్యాల వేంకట సుబ్రమణ్య శాస్త్రి (1877–1950). మన ముందుతరం రచయిత. వీరి రచన ‘మహాభారత చరిత్రము’ సుమారు 85 ఏండ్ల పూర్వం వెలువడి, గొప్ప సంచలనం సృష్టించింది. మొదటి భారత రచన జరిగాక కాలక్రమంలో ఎన్నెన్ని మార్పులు జరిగాయో, ఎన్నెన్ని అంశాలు చేరుతూ వచ్చాయో పరిశీలించాలనుకునేవారు తప్పక చదవాల్సిన పుస్తకం. సమాజం మీద ఆధిపత్యం సంపాదించి, దాన్ని దుర్వినియోగం చేస్తూ అధిక సంఖ్యాకుల్ని ఎలా శాసించారో, ఎలా హింసించారో తెలుసుకోవాలంటే ఇలాంటి సాహిత్యం చాలా చాలా చదవాల్సి ఉంటుంది. ఉదాహరణకు పెండ్యాల సుబ్రమణ్య శాస్త్రి వివరించిన కొన్ని అంశాలు ఇలా ఉన్నాయి.

శ్రీకృష్ణుని అవతార పురుషునిగా, పాండవుల్ని సకల సద్గుణ సంపన్నులుగా చిత్రిస్తూ రాసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? విశ్లేషించుకుంటే, నిజాలు కొన్నయినా బయటపడతాయి. మొదట్లో కృష్ణావతారం తర్వాత కలికావతారం ఎందుకుంది? తర్వాత కాలంలో బుద్ధుణ్ణి దశావతారాల్లో చేర్చుకుని, కలికావతారాన్ని ఎందుకు చివరికి నెట్టారు? శ్రీకృష్ణుని యుగప్రవక్తగా కీర్తించిన భాగం అంతా ఎప్పుడు చేర్చబడింది వంటి ప్రశ్నలు సంధిస్తూ, పెండ్యాలవారు తన వివరాల్ని కూడా పొందుపరిచారు. బౌద్ధం భారతదేశంలోనూ, చుట్టుపక్కల దేశాల్లోనూ బాగా వ్యాపించి ఉన్న దశలో వైదిక రచయితలు

కావాలని పూనుకుని రాముణ్ణి, కృష్ణుణ్ణి అవతార పురుషులుగా చిత్రించారు. ఇదంతా 400 బి.సి.ఇ ప్రాంతంలో జరిగింది. ఆ విధంగా వైదిక మత పునరుద్ధరణ కొన్ని శతాబ్దాలపాటు జరుగుతూ వచ్చింది. ఒకవైపు రచనల్లో మార్పులు చేర్పులు చేసుకుంటూ మరోవైపు బౌద్ధ, జైన ఆరామాల్లో, ప్రార్థనామందిరాల్లో మార్పులు చేసుకుంటూ హైందవ మతాన్ని పునరుద్ధరించటం జరిగింది. నిజాలన్నీ ఒక్కటొక్కటిగా బయటపడుతున్నాయి. వ్యాసుడు 'జయం'- అని, వైశంపాయనుడు 'భారతం'- అని, సౌతి 'మహాభారతం' అనే పేర్లతో వేరు వేరు కథల్ని రచించారు. కానీ, కాలక్రమంలో ఆ ముగ్గురు రచించిన గ్రంథాలు కలిసిపోయి ఏది ఎవరు రాశారో తెలియకుండా పోయిందనటానికి ఆధారాలున్నాయన్నారాయన!

కృష్ణుడు బాల్యంలో పూతన, శకటాసురుడు వంటి రాక్షసులను వధించాడని ఉంది. కానీ, 'శుశ్రుతము' అనే వైద్య గ్రంథాన్ని బట్టి అవి పిల్లలకు వచ్చే రోగాల పేర్లని తెలుస్తోంది. గ్రంథకర్తలు ఆ వ్యాధుల్ని వ్యాధులుగా కాక, రాక్షసులుగా చిత్రించారు. పల్లెల్లో శిశువులకు రోగాలు సోకకుండా శందేరధ- అనే మంత్రాలు చదువుతూ జాతకర్మంలో బ్రాహ్మణులు హోమం చేస్తారు. తవుడు, ఊకలతో పొగవేస్తారు. కృష్ణుడనే కల్పిత దేవుడి పాత్ర, ఆయా రాక్షసుల్ని బాల్యంలో వధించాడని కథలు కథలుగా వర్ణించుకున్నారు. భారతంలో ద్రౌపతి ఐదుగురికి భార్య కావడంలో ఆశ్చర్యం లేదు. ఇప్పటికీ ఆ ఆచారం హిమాచల్‌ప్రదేశ్‌లోని కొన్ని ఆదిమ తెగలలో కనిపిస్తూ ఉంది. అలాంటి విషయాన్ని తీసుకుని రచయితలు భారతంలో ద్రౌపతికి ఐదుగురు భర్తలు అనే అంశం పొందుపరిచి ఉంటారు. ఏమైనా అది ఒక ఆదిమ అనాగరిక సంప్రదాయం. దాన్ని మహోన్నతమైన అంశంగా గుర్తించాల్సిన పనిలేదు. ఆ దశ నుంచి సమాజం చాలా ముందుకు వచ్చిన విషయం గమనించాలి. కౌరవులలో అసూయాద్వేషాలు ఉన్నమాట నిజమేకానీ, అందుకు ద్రౌపతి, పాండవులు, కృష్ణుడు చేసిన పనులు, అన్న మాటలు కౌరవుల మీద ఉత్ప్రేరకాలుగా పనిచేసి ఉంటాయి. ఈ విషయాల్ని కూడా పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది. ఇకపోతే సర్పయాగం అంటే పాములను చంపడం కాదు. మన నాగజాతి ప్రజల నిర్మూలన అని అర్థం చేసుకోవాలి. దక్షిణ భారతీయులంతా నాగ జాతీయులే. ఉత్తరం నుంచి వలస వచ్చిన జాతులు ఇక్కడి మూలవాసుల్ని నాశనం చేయడాన్ని నాగజాతి నిర్మూలన- అంటే సర్పయాగం అనే సంకేతంతో లిఖించుకున్నారన్నమాట! ద్రౌపతీ వస్త్రాపహరణ జరగలేదనటానికి ఆధారాలున్నాయంటారు పెండ్యాల వేంకట సుబ్రమణ్య శాస్త్రి. అంతేకాదు, దుర్వాసుడు తన వందలమంది పరివారంతో వనవాసంలో ఉన్న పాండవుల దగ్గరికి వచ్చినప్పుడు- ద్రౌపతి అక్షయపాత్రతో అందరికీ భోజనం పెట్టాలనుకుంటుంది. కానీ, దాని వల్ల పని జరగలేదు. మూల రచనలో ఆ ఘట్టం బలహీనంగా, అసందర్భంగా ఉందని ఆ భాగం ఎర్రన అనువదించకుండా వదిలేశారట.

ఇలాంటి విషయాలన్నీ పరిశోధించి రాసిన వేంకట సుబ్రమణ్యశాస్త్రి పుస్తకానికి ఏటుకూరి బలరామమూర్తి ముందుమాట రాశారు. కట్టమంచి రామలింగారెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్ లాంటివారు అభినందిస్తూ అందులో తమ అభిప్రాయాలను నమోదు చేశారు. ఈ గ్రంథాన్ని సమర్థిస్తూ, విమర్శిస్తూ అనేక పుస్తకాలు వెలువడ్డాయి. ఒకరకంగా ఇదొక సంచలనం. ఎందుకంటే ఈ గ్రంథం వివాదాస్పదమై 1929లో కోర్టు కెక్కింది. భారతం నాటి సామాజిక స్థితిగతులపై వేమన కూడా స్పందించాడు. దాన్ని బాగా అర్థం చేసుకుంటే.. అది ఈ కాలపు అహంభావులకూ వర్తిస్తుంది. విశాల హృదయంతో మానవత్వ స్ఫూర్తి గురించి ఆలోచించగలిగితే కండ్లు కూడా తెరిపిస్తుంది. మానవ జాతి అంతా మిశ్రమ సంతతేనని, అయితే అంతా ఒక్కటేనని నిరూపించిన ఆధునిక జన్యు పరిశోధనలు స్ఫురణకు వస్తాయి. పురాణాలలో కూడా లాజిక్ ఉంటుంది. అయితే అది ఈ అత్యాధునిక సమాజానికి సరిపడదు.

వాస్తవాలు గ్రహించాలన్న స్పృహ జనంలో ఉంటే తగిన పుస్తకాలు, సినిమాలు, ఇతర కళారూపాలు చాలా ఉన్నాయి. అయితే వాటిని వెతుక్కోవాల్సి ఉంటుంది. వెతుక్కోకపోతే సోషల్ మీడియా అబద్ధాల హోరులో కొట్టుకుపోతాం. ■

## జీవాయుధ ఉగ్రవాద నిరోధానికి చట్టాలు అవసరం

జీవాయుధ ఉగ్రవాదాన్ని (బయో-టెర్రరిజం) నిరోధించేందుకు ప్రభుత్వం చట్టాలను రూపొందించాల్సిన అవసరాన్ని వైద్య, ఆరోగ్య శాఖ పార్లమెంటరీ స్థాయీ సంఘం స్పష్టం చేసింది. ఇందుకోసం వివిధ దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యం అవసరమని పేర్కొంది. కొవిడ్-19 అనుభవాలు బయో టెర్రరిజంపై పాఠాన్ని నేర్పుతున్నాయని తెలిపింది. "బయో సెక్యూరిటీ కీలకాంశం. ఇందుకు తగిన విధానం అవసరం. జీవాయుధాల నిరోధం, ముందస్తు నివారణ చర్యలు, రక్షణ, తగిన స్పందన ఇందులో భాగం కావాలి. అంతర్జాతీయ ఒప్పందాల్లో క్రియాశీల భాగస్వామ్యంతో భారత్‌లో జీవాయుధాల నుంచి రక్షణ, భద్రతలకు తగిన వేదికలను బలోపేతం చేయాలి" అని స్థాయీ సంఘం నివేదిక సూచించింది.

## ఎన్నారైలకూ ఈ-పోస్టల్ బ్యాలెట్: ఈసీ ప్రతిపాదన

ప్రభుత్వోద్యోగులకు అందుబాటులో ఉన్న ఎలక్ట్రానిక్ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్)ను ప్రవాస భారతీయులకూ విస్తరించాలని ఎన్నికల సంఘం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదించింది. ఈ మేరకు న్యాయశాఖకు లేఖ రాసింది. త్వరలో జరగనున్న అసోం, పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి శాసనసభ ఎన్నికల్లో ఈటీపీబీఎస్ బ్యాలెట్ విధానాన్ని అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఈసీ తెలిపింది.

# జుగాడ్ ఓటర్ల ఉద్యమం

ప్లాట్ నం: బి- 64, రోడ్ నం. 10, హుడా కాలనీ,
సరూర్‌నగర్, హైదరాబాద్ - 500 035
ఈమెయిల్: mpstexer@gmail.com



ఎం. పార్థసారథి
(ఫౌండర్ ప్రెసిడెంట్)

## మనది ఏకైక ఓటర్ల జాతి!

సెప్టెంబరు 2020 జనబలంలో "జుగాడ్ ఓటర్ల ఉద్యమం" అనే ప్రకటనా వ్యాసాన్ని చదివి, "మనిషి స్వేచ్ఛాయుత మనుగడకు డబ్బుతో అవినాభావ సంబంధం ఉందని ఏకీభవించిన ఓటర్లకు" ధన్యవాదాలు.

మనదేశంలో 2598 రిజిస్టర్డ్ పొలిటికల్ పార్టీలుండగా, వాటిలో 8 నేషనల్ పార్టీలు, 52 స్టేట్ పార్టీలు మాత్రమే ఉన్నాయని జాతీయ ఎన్నికల సంఘం తెలిపింది. మిగిలిన 2538 పొలిటికల్ పార్టీలనూ దిక్కులేని అనాథపొలిటికల్ పార్టీల (గుర్తింపు లేని పొలిటికల్ పార్టీలు) జాబితాలో చేర్చింది. అయినాసరే, గుర్తింపు లేని పార్టీలకు చెందిన "ప్రతినిధులు" అనధికార హోదాలతో ప్రభుత్వ ఆఫీసుల చుట్టూ తిరుగుతూ తమ పనులు తాము చేసుకుంటారు. ఇది చాలదన్నట్టు, మరొక 32 లక్షల స్వచ్ఛంద సేవాసంస్థలూ, వాటి "అధ్యక్షులు" తోడయి ప్రజాసేవా-పరిశ్రమ దినదినాభివృద్ధి చెందింది. చట్టంలోని లొసుగులనాధారంగా, నీతీ-అవినీతికీ మధ్య విచక్షణకు తిలోదకాలిచ్చి ధనసంపాదనే ధ్యేయంగా నడిచే వ్యవస్థలు, ఏదయితేనేమి, ప్రతీ 500 జనాభాకీ ఒక స్వచ్ఛంద సంస్థ చొప్పున మన భారతదేశానికే ప్రపంచంలో అగ్ర తాంబూలం. (Prabhu Chawla 26-09-2020 Power & Politics, TNIE)

అలాగే, "వ్యవస్థ"గా వ్యవహరింపబడే ఏ 'ఉద్యమసంస్థ' అయినా 'పొలిటికల్ పార్టీ' అయినా ధనం అనే ఇంధనం లేనిదే ఒక అంగుళం కూడా ముందుకు నడవదన్న సంగతి కూడా "విజ్ఞత గల ఓటర్లందరూ" భేషజాలకు పోకుండా అంగీకరించాలి. ఈ ఉద్యమంలో కుంభకోణాలకు తావులేకుండా, అనుమతించబడిన ఖర్చులతో విరాళాల సేకరణ చట్టబద్ధంగా పారదర్శకంగా జరుగుతుంది.

"పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లోపించటం భారత ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న మరో పెద్ద సంక్షోభం. అందుకే రాజకీయ పార్టీలని వికేంద్రీకరించాలి. సంపన్న నిరంకుశ నేతలతో యాంత్రికంగా మారిన పార్టీలను ప్రజాస్వామికీకరణం చేయాలంటున్న మేధావులు", తమతమ వ్యక్తిగత ఎజెండాలను కాస్త పక్కనబెట్టి, తాము కూడా ఓటర్లమే నన్న సంగతి హుందాగా అంగీకరించి, జుగాడ్ కార్యకర్తలుగా జుగాడ్ ఓటర్ల ఉద్యమంలో కాలయాపన చేయకుండా కలిసిపనిచేయమని ఇదే ఆహ్వానం. "groups of independent thinkers గా అభివర్ణించబడ్డ దేశంలోని మూడు కోట్ల మంది ఓటర్లలో 50 శాతం మంది.. అవకాశమిస్తే దేశాన్ని నిజాయితీగా అభివృద్ధిపథంలో నడిపించగలరు" అని ఓటర్ల నమ్మకం.

పత్రికలూ-ప్రసార మాధ్యమాల పెద్దలూ, కుల-మత శ్రేష్ఠులూ, ప్రభుత్వోద్యోగులూ, న్యాయశాస్త్ర ప్రవీణులూ, వివిధ రంగాలకు చెందిన ప్రజ్ఞాశాలురెవరైనా నిజాలు మాట్లాడుకుందామనే లక్ష్యంతో, "సమాజశ్రేయస్సు నా వ్యక్తిగత విషయం కాదు - మనది జాతి కాదా? అని ఎవరికివారే నన్ను ప్రశ్నిస్తే", జుగాడ్ ఓటరుగా నా సమాధానం: మహాశయులారా, మనది ఓటర్ల జాతి. నూటికి 99 విషయాలలో మన మధ్య సహజసిద్ధమైన ఇష్టాయిష్టాలు వేర్వేరయినా, కేవలం సిద్ధాంత నిబద్ధత గల రాజకీయాన్ని సృష్టించగల సామర్థ్యం, అంతఃకరణశుద్ధి, అంతర్గత ప్రజాస్వామ్యంపై నమ్మకం ఉంటే చాలు. **నమ్మకంపై ఆధారపడిన పరస్పర సహకారం మన మౌలిక సిద్ధాంతం.**

**2021 నూతన సంవత్సర శుభాకాంక్షలతో, వ్యవస్థలో మార్పుకై,**
**అంతర్గత ప్రజాస్వామ్యంతో కూడిన వినూత్న పార్టీకి ఆత్మవిశ్వాసంతో, స్థిర సంకల్పంతో శ్రీకారం చుట్టండి!**

**Please contact: M.Parthasarathy, 9866416798 with (1) your MLA Constituency name (2) your name and gender (3) your age (4) your EC Voter ID (5) Contact. Cell No: (6) your email if any..**

**Advt.**

# ప్రజాస్వామ్యాన్ని కుదిపేసిన ఎన్నికలు

**దూర నక్షత్రాల కాంతులను అనుసరిస్తూ పురోగమించటం క్రియాశీల, గొప్ప ప్రజాస్వామ్యం లక్షణం. ఆ గమ్యాన్ని వదిలేసి గతంలోకి నడుస్తూ మిణుగురు పురుగుల చుట్టూ తిరగటం ప్రజాస్వామ్య క్షీణతకు సంకేతం. అమెరికా తాజా అధ్యక్ష ఎన్నికల అనుభవాలు మనకు చెబుతున్న పెద్ద పాఠం ఇది.**



2016 అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి హిల్లరీ క్లింటన్‌పై డొనాల్డ్ ట్రంప్ విజయం సాధించినప్పుడు 'లోక్‌సత్తా టైమ్స్' వ్యాఖ్యానం ఇది: "ఆమె గెలిచివుంటే.. 'హిల్లరీ క్లింటన్‌తోపాటు ఆమె ప్రత్యర్థి, రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ కూడా గెలిచినట్టే' అని చెప్పాల్సి వచ్చేది.."

అప్పుడు 'చెప్పాల్సి వచ్చేది' అన్న మాటల్ని ఇప్పుడు 2020లో డొనాల్డ్‌ట్రంప్ ఓడిపోయిన సందర్భంలో 'చెప్పాల్సి వస్తోంది'.

2008లో డెమొక్రటిక్ పార్టీ తరపున 'మార్పు' ఎజెండాతో వచ్చిన బరాక్ ఒబామా వరుసగా రెండుమార్లు ఎన్నికైనా ఆశించిన స్థాయిలో అమెరికాను పునరావిష్కరింప చేయలేకపోవటం, ఆయన తర్వాత అభ్యర్థిగా నిలబడిన హిల్లరీ క్లింటన్ విశ్వసనీయత ఆశించిన స్థాయిలో లేకపోవటం, దేశాధ్యక్ష పదవికి ఒక మహిళను ఎన్నుకోవటం పట్ల తగినంత సానుకూలత కొరవడటం వంటి కారణాలకు తోడు కొన్ని యాధృచ్ఛికాల వల్ల ట్రంప్ 2016లో గెలిచాడనుకున్నా.. ఈ నాలుగేళ్లలో 'ఓడినా గెలిచినట్టే' అనిపించుకోవటానికి మరింత ప్రజాదరణని ఆయన సొంతం చేసుకోవటం మాత్రం అప్పటి కంటే పెద్ద చర్చనీయాంశం.

వాస్తవానికి అమెరికాలో ఎవరిని ఎన్నుకోవాలి, సమస్యల్ని ఎలా పరిష్కరించుకోవాలి అన్నది అమెరికాలో ఉంటున్నవారి సమస్య. కానీ ప్రజాస్వామ్యానికి సంబంధించి, అంతర్జాతీయ సమస్యలకు సంబంధించి అమెరికా పరిణామాలు ఇతర ప్రపంచ దేశాలతోపాటు మన దేశానికీ కీలకం కాబట్టి.. తాజా అమెరికా అధ్యక్ష ఎన్నికలను చర్చించే ప్రయత్నమిది.

నిస్సందేహంగా ట్రంప్ ప్రజాస్వామ్య వ్యవస్థ పట్ల గౌరవంలేని వ్యక్తి. ఒక ఫెడరల్ దేశంగా దాదాపు 230 ఏళ్ల ప్రజాస్వామ్య చరిత్ర కలిగి, ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాలన్నిటికీ దిక్సూచి అయిన అమెరికా అలాంటి వ్యక్తిని ఎన్నుకోవటం, ఆయన పట్ల ఆదరణను కొనసాగించటం దిగ్భ్రాంతికరంగా అనిపిస్తున్నా.. అందులో దిగ్భ్రాంతి చెందాల్సిన అంశాల కన్నా గుర్తించాల్సిన వాస్తవాలు, దిద్దుకోవాల్సిన స్వీయతప్పిదాలే ఎక్కువ.

**ఈజ్ ఆఫ్ హ్యాపీ లివింగ్, సృజనాత్మక ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా అమెరికా నిర్మాణం**

వ్యాపారంలో ట్రంప్ ఎలాగైతే నిపుణుడో అలా వివిధ రంగాలకు చెందిన నిష్ణాతుల వలసలను ఆహ్వానించి వారు ఈజ్ ఆఫ్ హ్యాపీనెస్‌తో బతకటానికి, సృజనాత్మక ఆవిష్కరణలు చేయటానికి తగిన సమాజాన్ని ఒక పరంపరగా అమెరికా నిర్మించింది. స్వతంత్ర అమెరికా రాజ్యాంగం, పెంపొందించిన విలువలు అనేక దేశాలకు స్ఫూర్తినిచ్చాయి. బ్రిటన్‌లో కాకుండా మన జాతీయోద్యమ నేతల్లో అత్యధికులు అమెరికాలో చదువుకుని వచ్చినట్లయితే, మన దేశంలో ప్రజాస్వామిక వ్యవస్థల నిర్మాణంపై మరింత వినూత్నంగా ఆలోచించి ఉండేవారనే వ్యాఖ్య అతిశయోక్తి కాదు.

**దాతృత్వం, స్వేచ్ఛలతో అదుపు చేయలేని అసంతృప్తి**

అయితే అమెరికా రాజ్యాంగంలో ఎంత ఉదాత్తమైన మాటల్ని చెప్పినా.. అది నిర్మాణంలో తెల్లజాతీయుల ఆధిపత్యం, పురుషుల ఆధిపత్యం వంటి వివక్షలకు ఆస్కారమిచ్చే రీతిలోనే ఉంది. కాకపోతే అప్పటి నేతల్లో పలువురు ఆ లోపాల్ని అధిగమించే గొప్ప నాయకత్వాన్ని, త్యాగనిరతిని ప్రదర్శించి కాలక్రమంలో అమెరికాను ప్రజాస్వామ్యానికి దీపస్తంభంగా మలిచారు. ఆదర్శప్రాయ రాజ్యాంగాన్ని అందించటం, బానిసత్వ, వివక్షల నిర్మూలన వంటి కీలక ఘట్టాల్లో నిలబడి గొప్ప ప్రజాస్వామిక అమెరికా కోసం కృషి చేసిన, పోరాడినవారిలో ఎక్కువ శాతం తెల్లజాతీయులే. నాయకుల కృషికి శాస్త్ర పరిజ్ఞానం, టెక్నాలజీలో అద్భుత ఆవిష్కరణలు, వనరులు తోడవటంతో లభించిన ఆర్థిక, సామాజిక సంపదలు అమెరికాను వైరుధ్యాలు కనపడని స్వర్గధామంగా మార్చాయి.

కానీ ఎప్పుడైతే టెక్నాలజీలో కొత్త ఆలోచనలు లేకపోవటం, ఉత్పత్తులకు దిగుమతుల మీద ఆధారపడటం పెరిగిందో.. ఆదాయాలు తగ్గిపోయి, ఎదిగే అవకాశాల పట్ల, చివరకు అస్తిత్వం పట్ల సగటు శ్వేతజాతి అమెరికన్లలో అభద్రత పెరిగిపోయింది. 2016 నాటికి అది ప్రస్ఫుటంగా బయటపడింది. అమెరికాలో 1940లలో పుట్టినవారిలో 92% తమ తల్లిదండ్రుల కంటే ఎక్కువ సంపాదనాపరులుగా ఉండగా, 1980లో పుట్టినవారిలో కేవలం 50% మందికి మాత్రమే తల్లిదండ్రుల కంటే ఎక్కువ సంపదసృష్టి చేసే అవకాశాలున్నాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఆరోగ్య వ్యవస్థ పేరుతో అమెరికా అతి ఎక్కువ ఖర్చు పెడుతున్నప్పటికీ, ఇతర సంపన్న దేశాలతో పోలిస్తే అమెరికాలో సగటు ఆయుఃప్రమాణం తక్కువగా ఉంది. దాదాపు 3 కోట్ల మందికి వైద్యమే అందని పరిస్థితి ఉంది. మరోపక్క టెక్నాలజీలో నూతన ఆవిష్కరణలతో ప్రపంచాన్ని శాసించి భారీ ఉపాధి, ఆదాయాల్ని పొందే అవకాశాలు క్రమంగా క్షీణించి పోసాగాయి. కొత్త ఆలోచనలు, ఉత్పత్తుల స్థానంలో చైనా నుంచి దిగుమతుల మీదే ఆధారపడటం ఎక్కువైంది. ఇది సగటు అమెరికన్లలో తీవ్ర అసంతృప్తికి, వలస వచ్చిన ప్రతిభావంతుల పట్ల ద్వేష భావానికి దారితీసింది. స్వేచ్ఛా మార్కెట్ పట్ల ఆకర్షణ, ఉదారవాద సంస్కృతి ప్రభావం తగ్గనారంభించాయి. భవిష్యత్తు పట్ల భయం నుంచి అమెరికన్ సమాజంలోని అపరిష్కృతంగా దాగివున్న వైరుధ్యాలు బయటపడనారంభించాయి. సంపన్నులు, అందులోనూ ఎక్కువగా తెల్లజాతీయులు మాత్రమే అమెరికాను శాసించే పరిస్థితులు వేళ్లూనుకోవటం, ధనికులకు–ఇతరులకు మధ్య అంతరం తీవ్రతరమవటంతో సమాజంలో విభజన రేఖలు బలపడ్డాయి. కేవలం దాతృత్వం, స్వేచ్ఛ మాత్రమే ఈ సమస్యను పరిష్కరించలేని స్థాయికి సమస్య చేరుకుంది.

**అంతరాలుంటే ప్రజాస్వామ్యం మనజాలదు**

తీవ్ర ఆర్థిక అంతరాలు ఉంటే ప్రజాస్వామ్యం మనజాలదని వేల ఏళ్ల క్రితం నుంచి రాజనీతిజ్ఞులు, తత్వవేత్తలు చెబుతూనే ఉన్నారు. సామాజిక సమానత్వంపై వక్కాణింపునిస్తూ, సామాజిక, ఆర్థిక సమానత్వం లేకుండా రాజకీయ సమానత్వం మనలేదని ప్రజాస్వామ్య భారత రాజ్యాంగం ఆమోదం పొందిన సమయంలో రాజ్యాంగ నిర్మాత డా॥ అంబేద్కర్ కూడా పార్లమెంటులో విస్పష్టంగా పేర్కొన్నారు. "స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం ఈ మూడూ ఒకదాంతో ఒకటి విడదీయరానివి. వీటిలో ఏ ఒక్కదానిని తొలగించినా ప్రజాస్వామ్యానికి అర్థమే లేకుండా పోతుంది. సమానత్వం లేని స్వేచ్ఛ.. చాలామంది మీద కొందరి ఆధిపత్యాన్ని నెలకొల్పుతుంది. స్వేచ్ఛ లేని సమానత్వం వ్యక్తిగత చొరవను చంపేస్తుంది. సోదరభావం లేని స్వేచ్ఛ, సమానత్వం సహజంగా ఉండవు. వాటిని బలవంతంగా రుద్దాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. 'అంతస్తులవారీగా అసమానత్వం' అనే సిద్ధాంతం మీద రూపొందించిన సమాజం భారత్‌లో ఉంది. అనేకమంది అత్యంత పేదరికంలో ఉంటే, కొద్దిమంది మాత్రం సిరిసంపదల్లో తులతూగుతున్న వ్యవస్థ ఇది. 26 జనవరి 1950 నుంచి వైరుధ్యాలున్న జీవితంలోకి మనం అడుగుపెట్టబోతున్నాం. రాజకీయరంగంలో మన మధ్య సమానత్వం ఉంటుంది. సామాజిక, ఆర్థిక రంగాల్లో మాత్రం అసమానత్వం కొనసాగుతుంది. అంటే, రాజకీయాల్లో ఒక మనిషికి ఒక ఓటు, ఒక ఓటుకు ఒక్కటే విలువ అనే సూత్రాన్ని మనం పాటించబోతున్నాం. కానీ సామాజిక, ఆర్థిక జీవితాల్లో మాత్రం ఒక మనిషికి ఒక్కటే విలువ అనే సూత్రాన్ని నిరాకరించనున్నాం. ఈ వైరుధ్యాల జీవితాన్ని మనం ఎన్నాళ్లు కొనసాగిస్తాం? సామాజిక, ఆర్థిక రంగాల్లో సమానత్వాన్ని ఎంతకాలంపాటు నిరాకరిస్తాం? దీర్ఘకాలంపాటు ఇలాగే నిరాకరించుకుంటూ వెళ్తే, మన రాజకీయ ప్రజాస్వామ్యానికి ముప్పు తప్పదు. ఈ వైరుధ్యాన్ని వీలైనంత త్వరగా తప్పనిసరిగా మనం తొలగించాలి. ఇది జరగకపోతే అసమానత్వం కారణంగా నష్టపోయేవాళ్లంతా కలిసి.. రాజ్యాంగసభ ఎంతో కష్టపడి నిర్మించిన రాజకీయ ప్రజాస్వామ్య సౌధాన్ని బద్దలు కొడతారు. కొంతమందికి ఈ మాటలు నచ్చకపోవచ్చు. కానీ ఈ దేశంలో రాజకీయాధికారం ఎంతోకాలంగా అతికొద్దిమంది గుత్తాధిపత్యంగా ఉందని, ఆ అతికొద్దిమందిని అత్యధిక సంఖ్యాకులు నెత్తిన పెట్టుకొని భారం మోయటమేకాదు, బలి కూడా అవుతున్నారని చెప్పటం తప్పుకాదు. ఈ గుత్తాధిపత్యం అనేకమందికి తమ జీవితాల్ని మెరుగుపరుచుకునే అవకాశాన్ని నిరాకరించటమే కాదు.. జీవిత పరమార్థం నుంచే వారిని దూరం చేసింది. పాలితులుగా ఉండీఉండీ వీరు విసుగెత్తిపోయారు. తమనుతాము పాలించుకోవడం కోసం ఆతృతతో ఉన్నారు. తీవ్రమైన అణచివేతకు గురయిన ప్రజల్లోని ఈ స్వీయచైతన్యం వర్గపోరుకు దారితీయకుండా చూడాలి. లేదంటే, చట్టసభ నిట్టనిలువునా చీలిపోతుంది. దానివల్ల జరిగేది వినాశనమే. అబ్రహాం లింకన్ చెప్పినట్లుగా, చీలిపోయి తనకు వ్యతిరేకంగా తానే నిలబడిన సభ ఎంతోకాలం ఉనికిలో ఉండలేదు. కాబట్టి, అణచివేతకు గురయిన అత్యధిక ప్రజల ఆకాంక్షలను సాకారం చేయటానికి ఎంతత్వరగా అవకాశం కల్పిస్తే.. ఆ అతికొద్దిమందికి అంత మంచిది. దేశానికి అంతమంచిది.

స్వాతంత్ర్యం కొనసాగింపునకు అంతమంచిది. దేశంలోని ప్రజాస్వామ్యానికి అంత మంచిది. జీవితానికి సంబంధించిన అన్ని రంగాలలో సమానత్వాన్ని, సోదరభావాన్ని నెలకొల్పటం ద్వారా మాత్రమే ఇది సాధ్యమవుతుంది. అందువల్లే దీనికి నేను అంతగా ప్రాధాన్యమిచ్చాను" అని అంబేద్కర్ ఆనాడు స్పష్టం చేశారు. స్వేచ్ఛా మార్కెట్లు ప్రజల మధ్య అంతరాన్ని పెంచుతున్నాయని థామస్ పికెట్టీ లాంటి ఆధునిక ఆర్థిక నిపుణులు హెచ్చరింపులు చేస్తూనే ఉన్నారు. ఈ రకమైన ఆర్థిక అసమానతలు అమెరికాలో ఆదాయం తగ్గేటప్పటికి కుదిపేస్తున్నాయి. సామాజిక అసమానతల్ని రెచ్చగొడుతూ విభజనల్ని, ప్రజల మధ్య అగాధాన్ని పెంచుతున్నాయి.

**ట్రంప్ ఉపయోగించుకున్నారు**

అమెరికాను గందరగోళ పరుస్తున్న వైరుధ్యాల్ని గతంలోలా సరిదిద్దే నాయకత్వం కొరవడింది. వైఫల్యాన్ని ఒబామా గుర్తించినా సరిదిద్ద లేకపోయారు. పాలనాకాలం చివరి దశకొచ్చేసరికి ఆయన దాదాపు పట్టుకోల్పోయారు. నామమాత్రంగా పదవిలో కొనసాగారు. ఈ పరిస్థితుల్ని 2016 ఎన్నికలకు ట్రంప్ వ్యాపార జీనియస్‌లా సోషల్ మీడియా సాయంతో ఉపయోగించుకున్నారు.

**రాజకీయ పార్టీల ఎజెండాలో ప్రత్యామ్నాయం కొరవడటం ట్రంప్‌కి కలిసివచ్చింది**

విజయవంతమైన ప్రజాస్వామ్యానికి ఉండాల్సిన కీలక లక్షణం రాజకీయ పార్టీల ఎజెండాలో ప్రత్యామ్నాయం ఉండటం. డెమోక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య విధానాల్లో, రాజకీయ సంస్కృతిలో ఆ తేడా గత కొన్నేళ్లుగా నామమాత్రమైంది. దొందూదొందే అని రెండు ప్రధాన పార్టీల గురించి అనుకుంటున్న ఉదాసీన పరిస్థితుల్లో రాజకీయేతర నేపథ్యం ఉన్న ట్రంప్‌లాంటి విజయవంతమైన వ్యాపారవేత్త సమస్యలను పరిష్కరిస్తారనే ఆశ పలువురు అమెరికన్ ఓటర్లలో కలిగింది. ఇలాంటి పరిస్థితుల్లో తరతరాల ప్రజాస్వామ్య విలువలు, నైతికత వంటివి ఒక పరిధి దాటి ఎక్కువ ప్రభావం చూపలేవు. 'నీ సమస్యకు వాడెవడో కారణం', 'నీకు లాభం కలగాలంటే వాడికి నష్టం కలగాలి' అని ఒకరి మీద ఒకరిని ఉసి గొల్పి ఓట్లు కొల్లగొట్టటం చాలా తేలిగ్గా జరుగుతుంది. అధికారమే అన్నిటినీ మించిన విలువ అనుకునే సంపన్నుడికి ఇదో పెద్ద అవకాశం. ట్రంప్‌కి ఆ అవకాశం లభించింది. ఆయన ప్రయోగించిన ఫార్ములా అమెరికాకు కొత్తేమోగానీ, మన దేశానికి కొత్తేమీ కాదు. ఓ పక్కన పెట్టుబడిదారులకు రాయితీలిస్తూ, మరోపక్క డబ్బున్నవారు, అవకాశాలు అందుకుంటున్నవారి మీద ద్వేషాన్ని పెంచుతూ పేద, దిగువ మధ్యతరగతికి తాత్కాలిక తాయిలాల్ని పంచటం అనే మన నేతల ఫార్ములానే ట్రంప్ కొంత అమెరికా లెవెల్‌కి మెరుగుపరిచి 'మేకింగ్ అమెరికా గ్రేట్ ఎగైన్' నినాదంతో జనాకర్షక జాతీయవాదంగా అమలు పరిచాడు. అక్కడితో ఆగకుండా, జనాకర్షక జాతీయవాదంలో వర్ణాన్ని, మతాన్ని కూడా మిళితం చేశాడు.

**వర్ణం, మతం కలగలిపిన జనాకర్షక జాతీయవాదం సగటు అమెరికన్లకు నచ్చింది**

2016లో అధ్యక్షుడిగా గెలిచాక రకరకాల పేర్లతో వలసల్ని ఆపి స్థానికంగా తక్కువ నైపుణ్యమున్న శ్వేతజాతీయులకు ఉద్యోగావకాశాల్ని ట్రంప్ మెరుగుపరిచారు. వాణిజ్య ఆంక్షలతో ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా కనిపించేలా చేశారు. యుద్ధాలు చేయకుండానే ఆయుధాలు సహా ఇతరత్రా వ్యాపారాల్ని చేశారు. ఇది గణనీయ శాతం సాధారణ అమెరికన్ ఓటర్లకు నచ్చింది.

**సోషలిస్టు నియంత కన్నా పెట్టుబడిదారీ నిరంకుశ నేత మిన్న**

శత్రువును బూచిగా చూపిస్తూ సమానత్వం పేరుతో ప్రజలకు ఉచితాల్ని పందేరం చేసే సోషలిస్టు నియంతలకూ ట్రంప్‌లాంటి పెట్టుబడిదారీ నిరంకుశ నేతకూ మౌలికంగా ఏమీ తేడా లేదు. పేదరిక పరిస్థితులు, కఠిన నియంత్రణల మధ్య సోషలిస్టు భావజాల నియంత ఇచ్చే రాయితీలకన్నా, వ్యక్తి స్వేచ్ఛ, సంపన్నత గల ఆర్థిక వ్యవస్థలో నిరంకుశ నాయకుడు ఇచ్చే తాయిలాలు, ఆంక్షల ద్వారా రక్షణపూరిత ఉపాధి అవకాశాలు మిన్న అని సగటు అమెరికన్లు భావించారు. రాజకీయ, పాలనా వైఫల్యాల వల్ల ఈ రకమైన యాచక ప్రవృత్తి ఇప్పుడు ప్రపంచంలోని పలుచోట్ల రాజ్యమేలుతూ మితవాద నాయకులకు అవకాశాలనిస్తోంది. భారతదేశం కూడా ఇందుకు మినహాయింపు కాదు. బలంగా కనపడటం, ఉచితంగా పంచటం, రక్షణపూరిత అవకాశాలు కల్పించటం గొప్ప నాయకుడికి, పాలనకు నిదర్శనాలుగా నిలుస్తున్నాయి. మన దేశంలోనైతే కుటుంబ వ్యవస్థలో కూడా ఇప్పటికీ ఇదే రకమైన ధోరణి కొనసాగుతూ మహిళల్ని గృహహింస, లింగవివక్షల్లో బందీల్ని చేస్తోంది. ఎన్నో ఏళ్ల క్రితం బెర్ట్రండ్ రస్సెల్ భారతీయ మహిళల గురించి ఒక వ్యాఖ్య చేశారు.. 'భారతీయ యువతులకు/మహిళలకు వివాహం అనేది ఒక జీవనోపాధి' అని. అణచివేత ఉన్నా కూడా కనీసావసరాలకు, ఎంతోకొంత ఆస్తి వంటి వాటికి గ్యారంటీ ఉండటం, బానిసత్వాన్ని కూడా ఆస్వాదించగలిగే స్థాయి ఆడంబరాలు, వినోదాల్లో స్వేచ్ఛ ఉండటం వంటి కారణాల వల్ల మహిళలు ఇంటికే పరిమితం కావటం, ఎదిగే అవకాశాలు లేకపోవటాల్ని వైఫల్యంగా భావించటం లేదు. చట్టబద్ధపాలన అంతంత మాత్రంగా ఉండటం, పురుషాధిక్య ధోరణులు, తల్లిదండ్రుల తీరు కూడా ఇందుకు దోహదం చేస్తున్నాయి. విద్యావకాశాలు పెరుగుతుండటం వల్ల గతంలో కంటే ఇప్పుడు అలా భావించే మహిళల సంఖ్య తగ్గుతుందన్నది వాస్తవమే అయినా, బానిసలా సుఖపడటం కంటే కష్టపడి ఎదగాలని, ఉనికిని చాటుకోవాలని ఆలోచించే యువతులు ఎక్కువవుతున్నా.. ఇప్పటికీ ఇంట్లో కట్టుబాటులో ఆనందాన్ని పొందే మహిళల సంఖ్య తక్కువేమీ కాదు. ట్రంప్‌కి వ్యక్తిత్వపరమైన లోపాలు, విచక్షణారహిత ప్రవర్తన మరీ తీవ్రంగా ఉన్నాయి తప్పితే, మిగిలినవాటిల్లో ఆయనేమీ మన నేతలకంటే తక్కువ కాదు. సాపేక్షంగా అమెరికాలో సగటు ప్రజలేమీ సగటు భారతీయుల కంటే ఎక్కువా కాదు. దీంతో 2020లో ఆయన తిరిగి అమెరికా అధ్యక్షుడవటానికి రంగం సిద్ధమైంది. అమెరికా సంప్రదాయం కూడా రెండోసారి ట్రంప్ ఎన్నికవటానికి అవకాశం కల్పిస్తోంది. కానీ కొవిడ్-19 ఆయనకు తీవ్ర నష్టం కలిగించింది.

**ట్రంప్ విజయావకాశాల్ని దెబ్బతీసిన కొవిడ్/ఆరోగ్య సంక్షోభం**

కరోనా వైరస్‌ను ఎదుర్కోవటంలో ట్రంప్ ఘోరంగా విఫలమవటం అమెరికాకే కాకుండా ప్రపంచానికి కూడా నష్టం చేసింది. అమెరికాయే గనక కరోనా విషయంలో ముందుగా మేలుకొని జాగ్రత్తలు తీసుకుని ఉంటే, భారత్ సహా చాల దేశాలు వైరస్‌ను ముందుగానే అలర్టయి కట్టడి చేయగలిగి ఉండేవి. చైనాలో ఊహాన్ నుంచి స్పష్టమైన సమాచారం వచ్చినా ట్రంప్

పట్టించుకోలేదు, నిపుణుల సలహాలను పాటించలేదు, ఫౌచిలాంటి శాస్త్రవేత్తల్ని కూడా మూర్ఖులు అని నిందించారు. వైట్‌హౌస్‌లో అంటువ్యాధుల విభాగాన్ని రద్దు చేసినంత తేలిగ్గా కరోనా విషయంలో కూడా చెలామణి అవుతానని భావించిన ట్రంప్‌కి ఉన్నకొద్దీ పరిస్థితి జటిలం కాసాగింది. ట్రంప్‌లోని నాయకత్వ డొల్లతనాన్ని, వీరత్వం వెనక విఫలత్వాన్ని కరోనా బట్టబయలు చేసింది. ఈ ఎన్నికల్లో కరోనా మృతులు ఎక్కువ ఉన్న రాష్ట్రాల్లో కూడా ట్రంప్‌కు మెజారిటీ వచ్చినా, మొత్తంగా ప్రచారంలో ఆ వైఫల్యం ఆయనకు పెద్ద నష్టం చేసింది. ప్రపంచవ్యాప్తంగా కూడా కరోనా అధికారంలో ఉన్నవారి ప్రజాదరణ మీద ప్రభావం చూపింది. మన దేశంలో బీహార్, పలు ఇతర రాష్ట్రాల్లో పాలకుల తీరు మీద తీవ్ర అసంతృప్తి ప్రబలింది. తెలంగాణలో కేసీఆర్‌కు ఇప్పటికీ తిరుగులేకపోయినా ఆయన కరిష్మాను మాత్రం కరోనా బాగానే కరిగించింది. రాష్ట్రాల్లో ఎన్నికలు కాకుండా జాతీయ స్థాయి ఎన్నికలైతే ప్రధాని నరేంద్ర మోదీ మీద కూడా ఆ అసంతృప్తి జ్వాలలు బీహార్‌లో కంటే ఎక్కువగా ప్రసరించి ఉండేవేమో. దగ్గర్లో లోక్‌సభ ఎన్నికలు లేకపోవటం, సరైన ప్రతిపక్షం లేకపోవటం ఆయనకు ప్రస్తుతానికి ఊరట. కరోనాను చక్కగా హ్యాండిల్ చేసిన న్యూజిలాండ్ ప్రధానమంత్రి జెసిండా ఆర్డెర్న్ ప్రజల అభిమానాన్ని చూరగొని తిరుగులేని మెజారిటీతో తిరిగి ఎన్నికయ్యారు. కరోనాయే లేకుంటే చాలామంది విమర్శకులకు దీటైన జవాబిస్తూ ట్రంప్ ఎన్నికల్లో గెలిచి ఉండేవారనటానికి గట్టి ఆధారాలున్నాయి. కరోనా విషయంలో ప్రచారాన్ని మేనేజ్ చేయలేకపోవటం తనకు నష్టం చేసిందని ట్రంప్ కూడా వాపోయారని వినికిడి.

ఆర్థిక అసమానతల్ని సరిదిద్దలేకపోయినా, ఆర్థిక పరిస్థితుల్ని మెరుగుపరిచిన ట్రంప్.. కరోనా బయటపెట్టిన ఆరోగ్య రంగ సంక్షోభం ధాటికి దెబ్బతిన్నారు. విద్యా అంతరం, ఆరోగ్య అంతరాలను సరిదిద్దకుండా ఆర్థిక, సామాజిక అంతరాలను సరిదిద్దటం సాధ్యంకాదని తెలిసినా ఒబామా అందుకు తగిన సంస్కరణల్ని తేలేకపోయారు. ఒబామా ఉనికే ఉండకూడదన్నట్లు.. ఆరోగ్య రంగంలో ఒబామా తెచ్చిన కొంత మెరుగైన సంస్కరణని కూడా నాశనం చేసేలా ట్రంప్ వ్యవహరించారు. దీంతో కొవిడ్ కాలంలో ఆరోగ్య సంక్షోభం తీవ్రతరమై ముఖ్యంగా తక్కువ ఆదాయం ఉండే నల్లజాతీయులు ఎక్కువ మూల్యం చెల్లించారు. అమెరికాలో ఉన్న అసమానతల్ని కొవిడ్ తీవ్రతరం చేసింది.

**ఉమ్మడి ప్రయోజనాలు కొరవడితే ప్రజాస్వామ్యం మూకస్వామ్యమవుతుంది**

ప్రజాస్వామ్యానికి కేవలం రాజ్యాంగ పద్ధతులు, స్వేచ్ఛాయుత ఎన్నికలు, భావ ప్రకటనా స్వేచ్ఛ చాలవు. సామాజిక, ఆర్థిక అసమానతల్ని అధిగమించేరీతిలో క్రియాశీల ప్రజాస్వామ్య పద్ధతులు, సంస్కృతి రూపుదిద్దుకుంటేనే, అన్ని వర్గాల ప్రజల్నీ భాగస్వాముల్ని చేసేలా చిట్టచివరి పౌరుడు కూడా కేంద్రంగా ఉండేలా పాలన ఉంటేనే సమ్మిళితమై ప్రజాస్వామ్యం వికసించి స్వయందిద్దుబాట్లతో సుస్థిరంగా మనుగడ సాగించగలుగుతుంది. విభజన పెరుగుతున్న కొద్దీ ప్రజాస్వామ్యం బలహీనపడుతుంది. ప్రజలు ఎవరికివారు సమూహాలుగా విడిపోయి సొంత ఎజెండాను, పరస్పర విరుద్ధ కార్యాచరణను ఏర్పరుచుకోవటం మొదలుపెడితే ప్రజాస్వామ్యం వేళ్లూనుకోలేదు.. ఉమ్మడి లక్ష్యాలు దూరమై ప్రజల్లో పరస్పర అపనమ్మకం, విద్వేషాలు పెరుగుతాయి, ప్రజల ఆకాంక్షలు అణచివేతకు గురవుతూ ఆర్థిక అంతరాలు, సామాజిక అశాంతి పెరుగుతుంటాయి. ఉమ్మడి అవసరాలు, ప్రయోజనాల కోసం పనిచేయటం ఆవశ్యకతను ప్రజలు ఎంత ఎక్కువగా గుర్తిస్తే ప్రజాస్వామ్య వ్యవస్థ అంత బలోపేతమవుతుంది. ఓట్ల కోసం వ్యక్తి సుఖానికి–ఉమ్మడి హితానికి మధ్య ఘర్షణ తీసుకొచ్చే తప్పుడు రాజకీయాన్నే మన రాజకీయ నాయకుల తరహాలో ట్రంప్ ప్రోత్సహించాడు. అయితే అది మరీ శృతి మించి ఎప్పుడు ఏం చేస్తాడో, ఎవరితో ఎంత చౌకబారుగా ప్రవర్తిస్తాడో, విధాన నిర్ణయాల్ని ఏ రకంగా మార్చేస్తాడో తెలియని స్థితి ఏర్పడటంతో ట్రంప్‌తో ముప్పు అని అమెరికాలోని ప్రజాస్వామ్యవాదులు, నూతన ఆర్థిక రంగాల వ్యాపారవేత్తలు గుర్తించారు. అందుకే డబ్ల్యూహెచ్‌వో, డబ్ల్యూటీవో, పర్యావరణ పరిరక్షణ కోసం ప్యారిస్ ఒప్పందం వంటి అంతర్జాతీయ సంస్థలు, ఒడంబడికల నుంచి అసంబద్ధంగా వైదొలగటం, అవకాశాలు, ఆదాయాల్ని పెంచే పర్యావరణహిత ఇంధనం వంటి భవిష్యత్ ఆర్థిక రంగాలను నిర్లక్ష్యం చేయటం, శాస్త్రజ్ఞులను కించపరచటం వంటి ధోరణులను తీవ్రంగా పరిగణించి ట్రంప్‌ను గద్దె దించాలని గట్టిగా సంకల్పించారు.

**యువత ట్రంప్‌కు వ్యతిరేకంగా మోహరించారు**

విద్యావంతులైన యువ శ్వేతజాతీయులు కూడా ఇదే తీరుగా ట్రంప్‌కి వ్యతిరేకంగా ఓటు వేశారు. అమెరికా ఎన్నికలంటే సాధారణంగా ఆ దేశంలో ఆసక్తి తక్కువ. ప్రపంచానికి ఆసక్తి ఎక్కువ. కానీ ప్రజాస్వామ్యం, శాస్త్రీయ దృక్పథం, గౌరవప్రదమైన బహిరంగ చర్చ ప్రమాణాలు, పర్యావరణ పరిరక్షణ, సంప్రదాయేతర ఆర్థిక రంగాల అభివృద్ధి వంటి అంశాలు సవాళ్లుగా నిలవటంతో 2020 ఎన్నికల్లో అమెరికాలో ఓటర్లు వెల్లువెత్తారు. ఈ క్రమంలోనే ట్రంప్ ప్రత్యర్థి, డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ వయసు 77 ఏళ్లయినా యువతకు ఆయన ప్రతినిధి కాగలిగారు. ఇప్పటికిప్పుడు నాకేంటి లాభం అనే లావాదేవీల (ట్రాన్సాక్షనల్) ధోరణి తప్ప పెద్ద సమస్యల్ని పరిష్కరించలేని, ముందుచూపులేని ట్రంప్ విధానాలు, భీతిల్లజేసే మితిమీరిన ఊహాతీత వ్యవహారశైలి (అన్‌ప్రెడిక్టబిలిటీ), అసభ్యత మిగతా ప్రపంచ దేశాలకు, అంతర్జాతీయ సంస్థలకు కూడా తలనొప్పిగా మారింది. దాంతో ప్రపంచ దేశాల్లో కూడా నాయకులు కాకపోయినా ఎక్కువమంది ప్రజలు ట్రంప్ ఓటమిని కోరుకున్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన దాదాపు ఏడాది తర్వాత 'ప్యూ' సంస్థ 37 దేశాల్లో

## బైడెన్ రికార్డు

అమెరికా 46వ అధ్యక్షుడిగా ఎన్నికైన డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ అత్యధిక పాప్యులర్ ఓట్లు పొందిన నేతగా రికార్డు సృష్టించారు. ఆయనకు 8 కోట్ల పైచిలుకు ఓట్లు లభించాయి (ఇంకా కౌంటింగ్ అధికారికంగా పూర్తికాలేదు). బైడెన్ ప్రత్యర్థిగా రిపబ్లికన్ పార్టీ తరపున పోటీ చేసిన డొనాల్డ్ ట్రంప్‌కకూడా పాప్యులర్ ఓట్లలో రెండో స్థానంలో నిలిచిన అభ్యర్థిగా రికార్డు సొంతం చేసుకున్నారు. ట్రంప్‌కు 7 కోట్ల పైన ఓట్లు లభించాయి. అమెరికాలో ఇంత వరకూ గెలిచిన అభ్యర్థులెవరికీ 7 కోట్ల ఓట్లు రాలేదు. ఓట్ల సంఖ్య పెరగటంతోపాటు ఎక్కువమంది పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవటం కారణంగా అధికంగా పోలింగ్ జరిగింది.

## అసత్యాల ట్రంప్

'వాషింగ్టన్ పోస్ట్' సమాచారం ప్రకారం అధ్యక్ష పదవిలో 2020 జులై నాటికి ట్రంప్ గత మూడున్నర సంవత్సరాలలో 20,000 అసత్యాలాడారు, లేక తప్పుదారి పట్టించే ప్రకటనలు చేశారు. వీటిలో దాదాపు వెయ్యి, ఒక్క కొవిడ్-19కు సంబంధించినవే. మొత్తంలో మొదటి పదివేల అసత్యాలు ఆయన అధికారానికి వచ్చిన తొలి 827 రోజుల లోనివే. ఆ పత్రిక కథనం ప్రకారం తదుపరి పదివేల అసత్యాలు ఆడదానికి ట్రంప్‌కు పట్టింది కేవలం 440 రోజులే. తన అభిశంసన ప్రక్రియ సందర్భంలో దాదాపు 1200 అసత్య ప్రకటనలు చేశారు.

అధ్యయనం చేయగా రష్యా, ఇజ్రాయిల్‌లో మాత్రమే అమెరికా నాయకత్వంపై గతంతో పోలిస్తే ఎక్కువ నమ్మకం కనిపించింది. భారతీయుల్లో నమ్మకం 18 పాయింట్లు తగ్గింది. ఈ అధ్యయనంలో పాల్గొన్న భారతీయుల్లో 40శాతం మంది ట్రంప్‌పై విశ్వాసం వ్యక్తం చేశారని, బరాక్ ఒబామా అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఈ విలువ 58శాతంగా ఉండేదని నివేదిక పేర్కొంది. లాటిన్ అమెరికాలో 14శాతం మంది, ఐరోపాలో 18శాతం మంది మాత్రమే ట్రంప్ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేశారు. ఆ అపనమ్మకం ఆ తర్వాత కూడా అలాగే కొనసాగింది. 2020 అధ్యక్ష ఎన్నికల్లో తొలుత ట్రంప్, బైడెన్ పోరాటాన్ని కుస్తీ పోటీలా ఉత్కంఠతో చూసిన భారతీయులు కూడా ఆ తర్వాత ట్రంపిజానికి, ప్రజాస్వామ్యానికి మధ్య పోరుగా కూడా.. బీహార్ అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ ఉత్సుకతతో వీక్షించారు.

**గర్వించదగ్గ సమాధానాన్ని మాత్రం అమెరికా ఇవ్వలేకపోయింది**

కానీ మొత్తంగా చూస్తే.. 'ఒక దేశంగా మనం ఏమిటి, దేనికోసం మనం నిలబడ్డాం, ఎలాంటి దేశంగా మనం ఉండాలనుకుంటున్నాం' అని జో బైడెన్ ఎన్నికల సమయంలో అడిగిన ప్రశ్నలకు ప్రజాస్వామ్యానికి దీపస్తంభంలాంటి అమెరికా గర్వించదగ్గ సమాధానాన్ని ఇవ్వలేకపోయింది. ట్రంప్ దారుణమైన అధ్యక్షుడు, ఆయనకు ఓటు వేయటం సిగ్గుచేటు అని వాదించేవారితో సరిసమానంగా ట్రంప్‌ను హీరోగా భావించేవారు కూడా తయారయ్యారు. ట్రంప్‌ను 2016 ఎన్నికల్లో సమర్థించిన పాత వ్యాపార రంగాల పెట్టుబడిదారులు, సగటు శ్వేతజాతి ఓటర్లు 2020 ఎన్నికల్లో కూడా సమర్థించారు. లోక్‌సత్తా పార్టీ మౌలిక ఎజెండాకు, రాజకీయ సంస్కృతికి విరుద్ధంగా వ్యవహరిస్తే సొంత పార్టీ అని కూడా చూడకుండా ఓడించమని తాను ప్రచారం చేస్తానని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ కొన్ని సందర్భాలలో పార్టీ అభ్యర్థులను హెచ్చరించారు. లోక్‌సత్తా వారి కంటే మెరుగైన అభ్యర్థులుంటే నిరభ్యంతరంగా ఓటు వేసుకోండని ప్రజలకు కూడా పిలుపునిచ్చారు. కానీ రిపబ్లికన్ పార్టీ విధానాలతో పెద్దగా సంబంధం లేకుండా ట్రంప్ వ్యవహరిస్తున్నా, ఓ అభ్యర్థిగా ప్రజాస్వామ్య వ్యతిరేకి అయినా, ట్రంప్ ధోరణి తమకు కూడా వెగటు కలిగిస్తున్నా రిపబ్లికన్ ఓటర్లలో ఎక్కువమంది రెండు ప్రధాన పార్టీల వ్యవస్థరీత్యా పార్టీ కోసమో, స్థానిక ప్రజాప్రతినిధుల కోసమో ఆయనకే మద్దతిచ్చారనుకోవాలి. రికార్డు స్థాయిలో 7 కోట్లకు పైగా ఓట్లను ఆయన సొంతం చేసుకున్నారు. జనాకర్షక, వివక్షాపూరిత జాతీయవాదాన్నే దేశభక్తిగా, మెరుగైన రాజకీయంగా భ్రమింప చేస్తూ రిపబ్లికన్ పార్టీ బేస్‌ను విస్తరించి మరీ కొత్త ఓటర్లను కూడా ట్రంప్ ఆకర్షించగలిగారు. ఆయన పనితీరు, వ్యవహారశైలి, సమాజంలో పెరుగుతున్న విభజన తెలిసిన తర్వాత వేసిన ఓట్లు ఇవి అనేది ఎంతమాత్రం విస్మరించకూడని అంశం. సోషల్ మీడియాలో ప్రాథమికంగా ఉండే దుందుడుకు సైకాలజీ కూడా ఆయనకు నష్టం కంటే లాభం ఎక్కువ చేసింది.

**అమెరికా ఇల్లును చక్కదిద్దుకోవటం ప్రపంచ దేశాలకు అవసరం**

తన భర్త మాట్లాడే తీరు తనకు నచ్చకపోవచ్చుని, కానీ ఆయనో ఫైటరని, అమెరికాను ఘనమైన దేశంగా మార్చేందుకు ఫైట్ చేస్తున్నందుకు ఆయనకు ఓటు వేయాలని మెలానియా ట్రంప్ ఎన్నికల సమయంలో విజ్ఞప్తి చేశారు. కేవలం మాట్లాడేతీరుకే లోపం పరిమితమైతే అమెరికా, ప్రపంచంలోని ప్రజాస్వామ్యవాదులు, యువత మరీ అంత ఎక్కువగా కదిలిపోయేవారు కాదు. ట్రంప్ చేస్తున్న విద్వేష రాజకీయాలు, ప్రపంచీకరణను దెబ్బతీసే విధానాలు, ఓట్ల కోసం పర్యావరణహిత కొత్త ఆర్థిక వ్యవస్థను ఫణంగా పెట్టి పాత ఆర్థిక రంగాలను ప్రోత్సహించటం, పుంఖానుపుంఖాలుగా అబద్ధాలాడటం, విధానపరమైన వైఖరులు అడ్డంగా రద్దుచేయటం, మార్చుకోవటం, రాజ్యాంగ వ్యవస్థలను, శాస్త్ర సాంకేతిక పరిశోధనలను దెబ్బతీయటం, ఆరోగ్య రంగాన్ని

# ప్రపంచం నమ్మకలేమితో బాధపడుతోంది

## ప్యారిస్ ఒప్పందం పరిణామాల నేపథ్యంలో ఐరాస వ్యాఖ్య

"ప్రపంచం నమ్మకలేమితో బాధపడుతోంది".. మానవ హక్కుల మండలి, ఐరాస ఒప్పందాలయిన ప్యారిస్ వాతావరణ మార్పుల ఒప్పందం వంటి వాటి నుంచి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యంత్రాంగం వైదొలిగిన సమయంలో ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరెస్ అన్న మాటలు! దేశాల మధ్య సహకారం కష్టమైపోతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు అభద్రతా భావంతో ఉన్నారని, క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్నట్టు భావిస్తున్నారని గుటెరెస్ వ్యాఖ్యానించారు. నమ్మకం చెదిరిపోయే పరిస్థితి ఏర్పడిందని, జాతీయ సంస్థలతోపాటు అంతర్జాతీయ పరిపాలన పైనా నమ్మకం పోతోందని అన్నారు. ఐరాస భద్రతా మండలిలో విభజన స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఆయా దేశాల్లో రాజకీయ వ్యవస్థలపై ప్రజలు విశ్వాసం కోల్పోతున్నారని చెప్పారు. చీలికలు పెరిగిపోతున్నాయన్నారు. "ప్రపంచంలో అనుసంధానత ఎక్కువగా ఉంది, అయినా సమాజాల్లో చీలికలు పెరిగిపోతున్నాయి. ఒక పక్క సవాళ్లు విస్తరిస్తుంటే ప్రజలు గిరిగీసుకు పోతున్నారు. వివిధ ప్రభుత్వాల మధ్య సహకారం పెరగాల్సిన సమయంలో తగ్గిపోతోంది" అని గుటెరెస్ ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం నడుచుకునే వ్యవస్థ కోసం మళ్లీ మనం కట్టుబడాలన్నారు. అందుకు ఐక్యరాజ్యసమితి ప్రధాన భూమిక పోషించాలన్నారు. ప్రజల ఆకాంక్షలు, అవసరాలను నెరవేర్చేలా ఐరాసను మరింత ప్రభావవంతంగా తీర్చిదిద్దేందుకు, సంస్కరించేందుకు కట్టుబడాలని పిలుపునిచ్చారు.

నాశనం చేయటం, బహిరంగ చర్చలను దుమ్మెత్తిపోసే కార్యక్రమాలుగా మార్చటం, పన్నుల వ్యవస్థను సంపన్నులకు అనుకూలంగా మార్చటం, వంశపారంపర్య రాజకీయాల్ని ప్రోత్సహించటం వంటి వన్నీ ప్రజాస్వామ్యానికి పెద్ద ప్రమాదం. శాంతియుతంగా అధికార బదిలీ అనే ప్రాథమిక ప్రజాసామ్య సూత్రాన్నే తిరస్కరిస్తూ ఎన్నికల్లో ఓడినా అధికారాన్ని వదులుకోనని ట్రంప్ చేసిన వీరంగం.. నగరాల్లో హింస, లూటీలు జరుగుతాయోమోనని షాపులకు చెక్కలడ్డం పెట్టుకోవటం, అభిమానుల బాహాబాహీ వంటివి చూశాకైనా మెలానియాకు ఈ ప్రమాదం తీవ్రత కొంత అర్థమై ఉంటుంది. ఇతర దేశాలకు ప్రజాతంత్ర పాఠాలు చెప్పే అమెరికాను శకునం చెప్పే బల్లి కుడితిలో పడ్డం చందంగా తయారు చేసిన ట్రంప్‌ను గనక ఓడించకుండా ఉంటే, ఆ ధోరణులన్నీ ట్రంప్‌లాంటి నేతలున్న దేశాలకు, రాష్ట్రాలకు శాపంగా మారతాయి, పలు దేశాల్లో ప్రజాస్వామికంగా ఎన్నికైన నాయకులను ఇంకా నిరంకుశులుగా మారుస్తుంది. అక్కడి ప్రజల్లో కూడా నిర్లిప్తత ప్రబలే అవకాశముంది. ఇంకోవైపు చైనా లాంటి దేశాల నియంతృత్వ, ఆక్రమణ ధోరణుల్ని నిలువరించటం, పర్యావరణహితంగా ప్రపంచాన్ని మలచే ఆర్థిక వ్యవస్థలను పెంపొందించటం కోసం అమెరికా నాయకత్వం ప్రపంచానికి ఈవేళ ఎంతో అవసరం. అత్యుత్తమ ఆలోచనల్ని, పద్ధతుల్ని, ఆవిష్కరణల్ని పంచుకోకుండా ఎవరికివారు తలుపులు మూసుకుని కూర్చోవటం ఏ దేశానికీ శ్రేయస్కరం కాదు. చుట్టుపక్కల ప్రజాస్వామికేతర పాలనలు పెరిగిపోతుంటూ చూస్తూ ఊరుకోవటం ప్రజాస్వామిక దేశాల్ని, సమాజాల్ని కూడా రాజకీయంగా, ఆర్థికంగా బలహీనపరుస్తుంది. రెండో ప్రపంచ యుద్ధంలో అమెరికా నాకెందుకులే అని ఊరుకుంటే చుట్టూ నియంతృత్వ శక్తులు పాతుకుపోయి మానవజాతి మనుగడనే ప్రశ్నార్థకం చేసేవి. వాతావరణ కాలుష్యం అనేది ప్రపంచ సమస్య. కాలుష్యాన్ని తయారుచేయటంలో అమెరికా పాత్ర ఎంత ఎక్కువుందనే విషయాన్ని అలా ఉంచితే.. ప్యారిస్ ఒప్పందం నుంచి వైదొలగటం వల్ల ప్రపంచ దేశాలతో పాటు అమెరికా కూడా నష్టపోతుంది. అందుకే ట్రంప్ ఓటమి అనివార్యంగా అవసరం. అమెరికా తన ఇల్లును చక్కదిద్దుకుంటేనే ప్రపంచ దేశాలకు సాయం చేయగలుగుతుంది.

**ప్రజాస్వామ్య ఆకాంక్షలకు ప్రతినిధులుగా నిలిచిన జో బైడెన్, కమలా హారిస్**

ట్రంప్ గెలుపోటములు ఈ ఎన్నికల్లో పెద్ద అంశం కావటంతో ఓటర్లు దాదాపు 120 ఏళ్ల చరిత్రలో ఎన్నడూలేని స్థాయిలో (సుమారు 66.9%) వెల్లువెత్తారనటం వాస్తవమే అయినా, ఆయన ప్రత్యర్థులుగా గెలిచిన డెమోక్రాటిక్ పార్టీ నేతల ట్రాక్ రికార్డు, పోరాటాల ప్రాధాన్యతను కూడా తక్కువ చేయలేం. ఒడిదుడుకులు తీవ్రతరమై ప్రజాస్వామ్యాన్ని కుదిపేస్తున్న పరిస్థితుల్లో వీరు అనుభవం, ప్రజాస్వామిక పద్ధతులు, బహిరంగ చర్చ ప్రమాణాలు, లింగ, జాతి, వర్ణ సమ్మిశ్రితత్వాలకు సంకేతాలుగా ఎన్నికల బరిలో నిలిచారు. డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి కమలా హారిస్ అమెరికా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికైన తొలి మహిళ, తొలి నల్లజాతి, ఆసియా, భారతీయ అమెరికన్. అమెరికాలో ఒక పార్టీలోపల అభ్యర్థుల ఎంపికకే ప్రైమరీలు జరుపుతారు. ఇందులో పలువురు పోటీ పడతారు. అభ్యర్థిగా ఒకరు ఎన్నికయ్యాక అప్పటి వరకు ఆ అభ్యర్థిని విధానపరంగా విమర్శించిన పార్టీ సహచర పోటీదారులు ఆ అభ్యర్థికి మద్దతుదారులుగా మారతారు. భావాల సంఘర్షణ చివరికి మెరుగైన విధానాలు, నాయకత్వం ఉన్న ఐక్య అమెరికాకు ఎలా దారితీయాలో పార్టీల్లో ప్రాథమిక

## భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

'అబ్ కీ బార్ ట్రంప్ సర్కార్' అని భారత ప్రధాని నరేంద్ర మోదీ భుజాన వేసుకోవాల్సినంత కాదు గానీ.. భారతదేశ పరంగా చూస్తే సైనిక, ఆర్థిక అవసరాలరీత్యా బైడెన్ కంటే ట్రంప్ సర్కార్‌తోనే తక్షణ లాభం ఎక్కువని అంచనా. కానీ ప్రజాస్వామ్య పరంగా, సంప్రదాయేతర ఆర్థిక వ్యవస్థ వంటి అంశాల పరంగా దీర్ఘకాలంలో బైడెన్ బెటర్. ఇతర రిపబ్లికన్ అధ్యక్షులు చేసినట్లు ట్రంప్ పెద్దగా యుద్ధాల జోలికిపోనప్పటికీ, అమెరికన్ సేనల ఉపసంహరణకే మొగ్గు చూపినప్పటికీ ఆఫ్ఘనిస్థాన్, సిరియా వంటి చోట్ల కొత్త కుంపట్లు రగలించాడు. నియంతృత్వ చైనాతో కయ్యాలకు దిగినప్పటికీ తనలాగా అప్రజాస్వామిక నేతలున్న టర్కీ, ఉత్తర కొరియా వంటి దేశాలతో సత్సంబంధాలు నెరపారు. బహ్రెయిన్, సూడాన్, యూఏఈ, ఇజ్రాయెల్‌ల మధ్య శాంతి ఒప్పందం వంటి చెప్పుకోదగిన విజయాల్ని సాధించారు. ట్రంప్ పట్ల అమెరికన్ ఓటర్లలో వ్యతిరేకతకు విదేశీ వ్యవహారాలకన్నా ఆంతరంగిక సమస్యల ప్రభావమే ఎక్కువ. అందువల్ల విదేశాంగ అంశాల్లో కొన్ని పునరాలోచనలున్నా ట్రంప్‌కి మరీ భిన్నంగా బైడెన్ వ్యవహరించే అవకాశాలు తక్కువని నిపుణులు అంటున్నారు. అంతర్గత కారణాలరీత్యా ఇంకా కరకుగా వ్యవహరించినా ఆశ్చర్యపోనక్కర్లేదని కొన్ని అంచనాలు వెలువడుతున్నాయి. అయితే ట్రంప్ ఓటమి ఖరారయ్యాక ఇరాన్ చుట్టూ జరిగిన పరిణామాలు బైడెన్‌కు కొత్త సవాళ్లు సృష్టించే అవకాశముంది. ఈ నేపథ్యంలో భారతదేశం సంచలనాలు, తొందరపాటుతనం లేకుండా అమెరికా కొత్త అధ్యక్షుడి బృందంతో వ్యూహాత్మకంగా వ్యవహరించి లబ్ధి పొందే ప్రయత్నం చేయాలి. భారతదేశ పాత్ర లేకుండా చైనాను అదుపు చేయటం అమెరికాకు కూడా సాధ్యం కాదు. ఈ అవకాశాన్ని భారత్ ఉపయోగించుకోవాలి. ఇరాన్ అణుఒప్పందంపై పునస్సమీక్ష వంటి ప్రాథమ్యాల మార్పుని సదవకాశాలుగా మలచుకోవాలి.

స్థాయి నుంచి ఏర్పాట్లు ఉన్నాయి. తన పార్టీలో ఈ ప్రక్రియను ట్రంప్ బలహీనపరిచినా, డెమోక్రాటిక్ పార్టీ తరపున దీన్ని ఆచరించి చూపారు అధ్యక్షుడు జో బైడెన్. కమలా హారిస్ తనపై తీవ్రంగా విమర్శలు గుప్పించినా ఆమెను ఉపాధ్యక్ష అభ్యర్థిగా ఎంచుకునే సహనాన్ని, పరిణతిని ప్రదర్శించారు.

అధ్యక్షుడిగా ఎన్నికయ్యాక బైడెన్ స్పందిస్తూ, "డెమోక్రాట్లు, రిపబ్లికన్లు పరస్పరం సహకరించుకోకపోవడానికి కారణాలు మన నియంత్రణలో లేనివేమీ కాదు. ఉద్రిక్తతలకు దూరంగా ఉందాం. మనం శత్రువులం కాదు. అమెరికన్లం" అన్నారు. అమెరికా ఉపాధ్యక్ష పదవికి ఎన్నికైన తొలి మహిళ, ఆఫ్రికన్ అమెరికన్, భారతీయ అమెరికన్ కమలా హారిస్ మాట్లాడుతూ, తాను తొలి ఉపాధ్యక్షురాలు అయినప్పటికీ తుది ఉపాధ్యక్షురాలు కాదన్నారు. ప్రజలు ఆశ, ఐక్యత, హుందాతనం, శాస్త్ర విజ్ఞానం, సత్యాలను కోరుకున్నారన్నారు. అమెరికా ఆత్మకు ఏర్పడిన గాయాల్ని మాన్పాల్ని ఉందని వారన్నారు.

**అమెరికా ఆత్మను హీల్ చేయాలంటే క్లాసికల్ లిబరల్ విధానాల్ని అమలు చేయాలి**

ట్రంప్ వెదజల్లిన దుష్ప్రభావాన్ని తగ్గించటం మాత్రమే అమెరికా ఆత్మను హీల్ చేయలేదు. అమెరికా ప్రజాస్వామ్యానికి, ఆవిష్కరణలకు, అవకాశాలకు సంకేతంగా అమెరికా నిలవాలంటే ప్రజల మధ్య అంతరాల్ని తగ్గిస్తూ అందరి భాగస్వామ్యాన్ని పెంచే సమ్మిళిత ప్రజాస్వామ్యాన్ని సాధించాలి. అమెరికాలో ఉదారవాదం పేరుతో నయా ఉదారవాదాన్ని ఎలా డంప్ చేశారో గుర్తించాలి. నిజమైన ఉదారవాదం (క్లాసికల్ లిబరలిజం)లో లోక్‌సత్తా చెప్పే ఎజెండా.. ప్రజలందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, సత్వర న్యాయం, పౌరుని చుట్టూ పాలన తదితరాలు ఉంటాయి. కానీ నయా ఉదారవాదంలో కొందరికే నాణ్యమైన విద్య, ఆరోగ్యం ఉంటాయి.. చట్టబద్ధపాలన, న్యాయంలో వివక్షలు ఉంటాయి.. ఆర్థిక అంతరాలు విపరీతంగా పెరుగుతూ జీవన భద్రత తగ్గుతుంటుంది.. మోసపుచ్చి, రెచ్చగొట్టి నియంత్రించే, ఆమోదం పొందే ధోరణులుంటాయి. అందుకే కేవలం ఉదారవాద విలువల గురించి ఉపన్యాసాలకు పరిమితం కాకుండా.. నూతన అధ్యక్షుడి బృందం తమ పార్టీ నేత బెర్నీ శాండర్స్ గట్టిగా ప్రతిపాదించిన నాణ్యమైన ఆరోగ్యం, విద్య, జీవన భద్రత అందరికీ అందుబాటులోకి తేవాలి. ఉపాధి అవకాశాలతో కూడిన పర్యావరణహిత ఇంధన వ్యవస్థను నిర్మించి సగటు అమెరికన్లలో భరోసా కల్పించాలి. రాబోయే కాలంలో నిరుద్యోగ భృతికి పన్ను విధించాలన్న బిల్‌గేట్స్ సూచన ఉపాధి కల్పన రంగంలోని సవాళ్లను హెచ్చరించేదని విస్మరించకూడదు. ట్రంపబిక్లన్ల అవరోధాలను అధిగమించి అమెరికా భవిష్యత్తుకు కూడా భరోసానిచ్చే పరస్పర సహకార, బహుముఖీన ప్రపంచ వ్యవస్థ నిర్మాణానికి ప్రాధాన్యతనివ్వాలి. ఈ దిశగా నూతన అధ్యక్షుడు సానుకూలంగా స్పందించటం మంచి పరిణామం.

**ఉదారవాద సంస్కరణలు భారత ప్రజాస్వామ్యానికి మరింత అవసరం**

ఈ క్లాసికల్ లిబరల్ ఎజెండా విషయంలో డొల్లతనం మన దేశంలో మరింత ఎక్కువగా ఉంది. ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ చెప్పినట్లు భవిష్యత్తు పట్ల అమెరికాలో ఉన్నంత అభద్రత ప్రస్తుతానికి భారతదేశంలో లేదు. గత తరం కంటే మనం మెరుగ్గా ఉన్నామన్న అంచనా, మన కంటే మన భవిష్యత్ తరాలు మెరుగ్గా ఉంటాయన్న ధీమా మనలో ఎక్కువమందిలో ఉన్నాయి. కానీ ప్రజల ఆకాంక్షలకు తగ్గ అవకాశాల్ని అందించకుండా ఎల్లవేళలా తాయిలాలు, కులం, మతం,

## 2024లోనూ ప్రభావం చూపే అవకాశం

ఒక పార్టీ లేదా నాయకుడు ఎన్నికల్లో గెలిచినా, ఓడిపోయినా దీర్ఘకాలిక మనుగడ ఉండాలంటే పర్సెప్షనల్ ఓట్ బేస్ ఉండాలి. ఆ పార్టీని, నాయకుడిని గురించిన ఆలోచన రాగానే ఒక భావం స్ఫురణకు రావాలి. ఆ భావానికి అసంకల్పితంగా మద్దతు పలికేవారు గణనీయ సంఖ్యలో ఉండాలి. రిపబ్లికన్ పార్టీ పునాది మీద అలాంటి ఓట్ బేస్‌ను ట్రంప్ తయారు చేసుకున్నారు. 2024 ఎన్నికల్లో కూడా ఆ బేస్ ప్రభావం చూపించే అవకాశాలు ఎక్కువే ఉన్నాయి.

ప్రాంతం వంటి ఆటవిక ఉద్వేగాంశాల చుట్టూ వారిని మభ్యపెట్టలేరు. యువజనాభాఎక్కువున్న భారత్ ప్రజాస్వామ్య బలహీనతల్ని సరిదిద్దుకోకపోతే, అమెరికాకు ఎదురైన పరిస్థితి భారత్‌కు కూడా ఎదురవుతుంది. మరింత ప్రమాదకరంగా ఎదురవుతుంది. మన దేశానికి ఉన్న సంక్లిష్ట బహుళత్వం ప్రజాస్వామ్యాన్ని పెట్టనికోటలా రక్షిస్తున్నప్పటికీ, ఒక దశ దాటితే అదే బహుళత్వం విచ్ఛిన్నానికి కూడా దారితీస్తుంది. అందుకే మన దేశ ఆత్మకు ఏర్పడిన గాయాల్ని కూడా ఎంతో మాన్పాల్సి ఉంది. భారతదేశం ఆత్మను ఆవిష్కరించిన నేత మహాత్మాగాంధీ. అప్పటి వరకు ముక్కముక్కలుగా ఉన్న భారతదేశాన్ని ఏకం చేసి మనందరం భారతీయులం అనే భావనను కలిగించిన ఘనత గాంధీదే. భారతదేశం ఏర్పడటానికి వేల సంవత్సరాల ముందు నుంచి కూడా మన దేశంలోని పలు ప్రాంతాల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లింది. స్థానిక పాలన సాగింది. కానీ ఎంతో వైవిధ్యం, విశాలత కలిగిన ఒక దేశంగా మనకు ప్రజాస్వామ్యం అనుభవం లేకపోవటం వల్ల మూలాలు బలంగా ఉన్నా కూడా ప్రజాస్వామ్య పరిణితిని సాధించలేక తడబడుతున్నాం. అమెరికాలో ఫెడరల్ వ్యవస్థ బలంగా ఉండటం, అధికారాల విభజన సక్రమంగా ఉండటం వంటి కారణాల వల్ల ట్రంప్ తాకిడిని తట్టుకుని కూడా తేరుకోగలిగిందిగానీ, మన దేశంలో అలాంటి వ్యవస్థీకృత బలాలు తక్కువ. అందుకే మన దేశం అమెరికా నుంచి ప్రజాస్వామ్యం, సాంకేతికతలు, అధికారాల విభజన ఉన్న వ్యవస్థల్ని నేర్చుకుంటూనే, అక్కడున్న లోపాలు మన వద్ద తలెత్తకుండా చూసుకోవాలి. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, ఉపాధి అవకాశాలు, చట్టబద్ధపాలన, అవినీతిలేని ప్రభుత్వ సేవల్ని అందుబాటులోకి తేవాలి. గాంధీజీ ఆశించినట్లు చిట్టచివరి పౌరునికి కూడా తన జీవితం మీద తనకు సాధికారత ఉండేలా అధికారాల్ని వికేంద్రీకరించి పాలనలో భాగస్వాముల్ని చేయాలి. దేశభక్తికి, జాతీయవాదానికి ఇదీ అర్థమని తెలియజెప్పాలి. ఉమ్మడి ప్రయోజనాల దిశగా ప్రజలు

## ప్రజాస్వామ్యంపై అంతర్జాతీయ సదస్సు

ప్రజాస్వామ్యం ఒక్కోసారి వికారంగా అనిపిస్తుందని, కానీ కొన్నిసార్లు ఓపికతో ఉండటం చాలా అవసరమని, ఆ సహనం కారణంగానే అమెరికా పాలనా వ్యవస్థ ప్రపంచమంతా ఈర్ష్య పడేలా మనగలుగుతోందన్న బైడెన్.. 2021లో ప్రజాస్వామ్యంపై అంతర్జాతీయ సదస్సు నిర్వహించే అవకాశముందని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో నియంతృత్వ పోకడలు పెరిగిపోవటం, అవినీతి, ఎన్నికల భద్రత, మానవ హక్కులను విస్తృత పరచటం మొదలైన అంశాలను ఇందులో చర్చిస్తారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించటంలో ప్రయివేటు రంగం పాత్ర, వాక్‌స్వాతంత్ర్యం తదితర వ్యవహారాల్లో టెక్నాలజీ సంస్థలు, సామాజిక మాధ్యమాలు వ్యవహరించాల్సిన తీరుపైనా సదస్సులు నిర్వహిస్తారని సమాచారం.

సంఘటితంగా పనిచేసే పద్ధతుల్ని అమలు చేయాలి. పర్యావరణహిత ఆర్థికశక్తిగా భారతదేశాన్ని నిర్మించాలి. అమెరికా వలస వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రతిభకు తగిన ఆదరణను అందించాలి. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఈసారి 14 బిలియన్ డాలర్ల మేర ఖర్చయినట్లు చెబుతున్నారు. మన దేశం పేద దేశమయినప్పటికీ ఎన్నికల వ్యయంలో అమెరికాను మించిపోతోంది. ఎన్నికల విరాళాల సేకరణకు సంబంధించి 2003లో డా॥ జేపీ చొరవతో వచ్చిన చట్టం అమెరికాకాసమస్యను పరిష్కరించగలుగుతుంది. కానీ మన దేశంలో డబ్బు రాజకీయాన్ని అదుపు చేయటానికి ఆ చట్టాన్ని మరింత పటిష్టపరచటంతోపాటు ప్రత్యక్ష ఎన్నిక, దామాషా పద్ధతి వంటి ఎన్నికల సంస్కరణల్ని కూడా తీసుకురావాల్సి ఉంది. చైనా ఆధిపత్యాన్ని, విస్తరణను కట్టడి చేస్తూ సమున్నత దేశంగా భారత్ ఎదగాలంటే మరింత అభివృద్ధి, మరింత ప్రజాస్వామ్యమే మార్గాలు.

అమెరికా, బ్రిటన్, కెనడా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జపాన్, స్విట్జర్లాండ్, నార్వే, ఫిన్లాండ్, స్వీడన్ తదితర దేశాలలోని అత్యుత్తమ పద్ధతుల్ని భారత్ తన దేశ పరిస్థితులకనుగుణంగా మలచుకుంటుండాలి. మన నుంచి ఇతర ప్రజాస్వామిక దేశాలు నేర్చుకోవాల్సిన అంశాల జాబితాను విస్తరించుకుంటుండాలి. దూర నక్షత్రాల కాంతులను అనుసరిస్తూ పురోగమించటం క్రియాశీల, గొప్ప ప్రజాస్వామ్యం లక్షణం. ఆ గమ్యాన్ని వదిలేసి గతంలోకి నడుస్తూ మిణుగురు పురుగుల చుట్టూ తిరుగుతుంటే ప్రజాస్వామ్యం క్షీణించటం మొదలుపెడుతుంది. అమెరికా తాజా అధ్యక్ష ఎన్నికల అనుభవాలు మనకు చెబుతున్న పెద్ద పాఠం ఇది. ■

# ప్రపంచాన్ని కుదుటపరిచేందుకు అమెరికా కొత్త అధ్యక్షుడు తేవాల్సిన మూడు మార్పులు

**డా॥ జయప్రకాష్ నారాయణ్**

అంతర్జాతీయ వాణిజ్యంలో నిబంధనల ప్రకారం నడుచుకునే వ్యవస్థ, విదేశీ సంబంధాల్లో నిలకడ, ప్రస్తుత ఆయిల్ ఎకానమీ స్థానంలో సౌర విద్యుత్, బ్యాటరీ టెక్నాలజీ, గ్లోబల్ వార్మింగ్ నిరోధానికి ఇతర పద్ధతులు.. ఈ మూడు మార్పులనూ అమెరికా నూతన అధ్యక్షుడు జో బైడెన్ తేవాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు.






అమెరికా ఎన్నికల ఫలితాల్లో అధ్యక్షుడిగా డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థి జో బైడెన్ గెలుపు స్పష్టమయ్యాక జేపీ వెబ్ మీడియాతో మాట్లాడారు. కొన్ని ముఖ్యాంశాలు స్థూలంగా..

2020 అమెరికా అధ్యక్ష ఎన్నికల్ని ప్రపంచమంతా ఎందుకు మరింతగా పట్టించుకుందీ అంటే.. అవి కురుక్షేత్ర యుద్ధంలాగా జరిగి సరదాగా ఉండటంతోపాటు ఆ ఎన్నికల ప్రభావం ప్రపంచమంతా ఈసారి కొంత ఎక్కువగా ఉంటుందనుకోవటం.

నిజానికి అమెరికా అధ్యక్షుడి ప్రభావం అమెరికా మీద కంటే ప్రపంచం మీద ఎక్కువ. అమెరికాలో అధ్యక్షుడికి బోలెడంత ప్రచారం ఉంటుందిగానీ ఆయనిష్టం వచ్చినట్లు చేయలేడు. మన ప్రధానమంత్రిలాగా కాదు. మన ప్రధాని పార్లమెంటుని శాసించగలడు.. మెజారిటీ ఉంటుంది కాబట్టి. అమెరికాలో అట్లా కాదు. పార్లమెంటు ఆయన మాట వినదు. ఆయన పార్టీలో కూడా ఆయన మాట వినరు. వేరే పార్టీ అయితే అసలు వినరు. కాబట్టి అమెరికాలో అధికారాల విభజన ఉన్నది. కానీ అమెరికా ప్రపంచం మొత్తం మీద చాలా ప్రభావాన్ని చూపెట్టగలదు. మూడు అంశాలు తీసుకోండి ఉదాహరణకి.

డొనాల్డ్ ట్రంప్ వచ్చేదాకా.. అంతర్జాతీయ వాణిజ్యం, స్వేచ్ఛగా కొనుగోలు అమ్మకాలు న్యాయంగా కొన్ని నిబంధనల ప్రకారం జరిగినట్లయితే అందరికీ లాభం కలిగిస్తుందనే ప్రచారం జరిగింది. Recardo's theory of comparitive advantage అంటాం. మన లాంటి దేశాలు అంతర్జాతీయ వాణిజ్యాన్ని మొదట్లో వ్యతిరేకించినా.. కాలక్రమేణా లాభం అని అర్థం చేసుకున్నాం. మన వస్తువులు ఉత్పత్తి చేసి అమ్మకపోతే, వాళ్ల నాణ్యమైన వస్తువులు మనం కొనకపోతే, మనకు నాణ్యత పెరగదు, మనకు టెక్నాలజీ రాదు, మనకు డాలర్లు రావు, మన ఆదాయాలు పెరగవు. కాబట్టి అందరికీ లాభదాయకంగా ఉంటుంది స్వేచ్ఛా వాణిజ్యముంటే అని మనకు అర్థమైంది. చైనాకు అర్థమైంది. మనకంటే బాగా అర్థమైంది. వాళ్లంతా మనకు నచ్చచెప్పారు. ట్రంప్ రాగానే ఏమన్నాడూ.. అంతర్జాతీయ వాణిజ్యాన్ని తీసిపారేస్తానన్నాడు. నిబంధనల్ని తుంగలోకి తొక్కాడు. కొత్త అధ్యక్షుడు మళ్లీ ఆ నిబంధనల్ని తీసుకురావాలి. Rule based system అంటాం. రెండోది, అంతర్జాతీయ సంబంధాల్లో కొంత నిలకడ, predictability అంటాం.. అది ఉండాలి. రేపొద్దున ఏం జరుగుతుందన్నది అంచనా ఉండాలి. కొంత పద్ధతి ఉండాలి. పుర్రెకి ఏ బుద్ధి పుడితే అది కాకూడదు. రాజుకి బుర్రలో ఏది బుద్ధి పుడితే అది ఇష్టమొచ్చినట్లు చేశాడనుకోండి.. చాలా విచిత్రమైన పాలన అవుతుంది. అలాకాకుండా అమెరికా అంటే మనందరం ఆశించేదేంటి.. ప్రజాస్వామ్యానికి అనుకూలంగా ఉండటం, నియంతలను కొంత అదుపు చేసే ప్రయత్నం, స్వేచ్ఛా వాణిజ్యం, రాజ్యాంగబద్ధమైన పాలన, మానవ హక్కులు, తర్వాత మంచి సంబంధాలున్నటువంటి దేశాలతో ఆ సంబంధాలను గౌరవప్రదంగా కొనసాగించటం, మా ఇంటికొస్తే మాకేం తెస్తావ్, మీ ఇంటికొస్తే మాకేమిస్తావ్ అని కాకుండా అవసరార్థం ఇచ్చిపుచ్చుకునే ధోరణి.. ఇవన్నీ ఉంటాయని ఊహిస్తాం. అమెరికా చాలావరకు ఇవి పాటించింది. కొన్ని పొరపాట్లు చేసినా కూడా. ట్రంప్ వచ్చి గతం నుంచి నాకు ఎంత మిత్రత్వం ఉన్నా, ఎంత మైత్రీ సంబంధం ఉన్నా, ఎంత ప్రగాఢమైన సంబంధాలున్నా సరే, ప్రతిదీ ట్రాన్సాక్షనల్..ఈపూట నాకేమిస్తావో చెప్పు అని ఒక వ్యాపారంలా మార్చేశాడు. ఉదాహరణకి మన దేశం నుంచి వాళ్లు హైడ్రాక్సీ క్లోరోక్విన్ తీసుకోవాలని అనుకున్నారు. కొవిడ్‌కి అది మందు అనేది వాస్తవం కాకపోయినా మందే అని చెప్పి ట్రంప్ గారే బోలెడంత ప్రచారం చేశాడు. అబద్ధపు ప్రచారమది. సరే, చాలా అబద్ధాలు చెప్పాడాయన. మనకనవసరం అది. మనకు మంచిదే. మనం అమ్ముకుంటే మనకు వ్యాపారం వస్తుంది కదా. మన పరిశ్రమలు బాగుపడతాయి. మనవాళ్లకి ఉపాధి వస్తుంది.. ఆ

సమయంలో మనవాళ్లు ఒక మాటన్నారు. అది సరైన మాట. హైడ్రాక్సీ క్లోరోక్విన్ గనక నిజంగా కొవిడ్ చికిత్సలో పనికొచ్చేదైతే ముందు మా సమాజ అవసరాలు చూసుకుని ఆపైన మీకు పంపిస్తామన్నారు. ఏ దేశమైనా చూడవలసింది అదే కదా. నరేంద్ర మోదీ గారిని ఎన్నుకున్నది మన దేశ ప్రయోజనాలను కాపాడటానికే కదా. మీకు తప్పకుండా చేస్తాను, కానీ మా సంగతి కూడా చూసుకుంటామని ఒక మాటన్నాడాయన. వెంటనే ట్రంప్ ఏం చెప్పాలీ.. సరే, నేను అర్థం చేసుకుంటానుగానీ, కొంచెం ఎక్కువ ఉత్పత్తి చేయండి, ఆపబోకండి అనాలి. కానీ అలా అనలా. అంతుతేలుస్తా, ఆంక్షలు విధిస్తా అన్నాడు. ఈ తెంపరితనం, నిలకడలేనటువంటి విదేశాంగ విధానం వల్ల మిత్రుడికి, శత్రువుకి తేడా ఉండదు. ఆ తర్వాత నియంతలతోనేమో కావలించుకుంటుండటం. రష్యాలో పుతిన్‌ని, ఉత్తర కొరియాలో ఆ కిమ్ జోంగ్‌ను, ఇతర నియంతల్ని. వాళ్లందర్నీ కావలించుకుంటూ ప్రజాస్వామ్య దేశాలతో, ఇతర దేశాలతోనేమో చాలా విపరీత ప్రవర్తనతో వ్యవహరించటం. ఈ పోకడలు మంచివి కావు. మూడోది, ప్రపంచమంతా కూడా వచ్చేతరం ఏం భయపడుతోందీ.. గ్లోబల్ వార్మింగ్! ప్రస్తుత ఆయిల్ ఎకానమీ స్థానంలో సౌర విద్యుత్, బ్యాటరీ టెక్నాలజీ, గ్లోబల్ వార్మింగ్ నిరోధానికి ఇతర పద్ధతులు.. వీటి కోసం సవాళ్లను ప్రపంచమంతా ఏకోన్ముఖంగా ఎదుర్కోకపోతే, దానికి అమెరికాలాంటి కీలకమైన దేశం, ఆర్థికంగా పెద్ద దేశం, ప్రపంచమంతా గౌరవించే దేశం ముందుండి నడిపించకపోతే ప్రపంచ సమాజం, మానవాళి మొత్తం నష్టపోతుంది. మనకిష్టమున్నా లేకున్నా కూడా చాలా విషయాల్లో దేశాల సరిహద్దులు చెరిగిపోయాయి. ఆ లెక్కలో.. వాడి సమస్యలతో నాకు ఇబ్బంది లేదు అనే పరిస్థితి లేదు. అవి మానవాళి మొత్తానికీ సమస్యలుగా పరిణమించాయి. అలాంటప్పుడు నాకనవసరం, అసలు గ్లోబల్ వార్మింగ్ లేదు, ఆయిల్‌నే కొనసాగిస్తా, నాకసలు సౌర విద్యుత్ అక్కర్లేదు, ఈ బ్యాటరీ టెక్నాలజీ అక్కర్లేదు, అవన్నీ పిచ్చిమాటలు, ఎందుకవన్నీ?.. వాటి వల్ల మా ఊళ్లో కొన్ని ఓట్లు పోతాయి నాకు.. ప్రపంచమంతా నాశనమైతేకానీ, నాకు ప్యారిస్ ఒప్పందం అక్కర్లేదు.. కొవిడ్ వ్యాధి వస్తే ప్రపంచానికి నేను బాధ్యత తీసుకోను, డబ్ల్యూహెచ్ఓ నాకిష్టం లేదు, వాడి మొహం నాకు నచ్చదు, వాడ్ని తీసిపారేస్తున్నాను నేను, నేను ఇక్కడ్నుంచి బైటికొచ్చేస్తున్నాను.. ట్రంప్ ధోరణిలోని ఇవన్నీ చాలా ప్రమాదకరమైనవి. గ్లోబల్ వార్మింగ్‌గానీ, ప్రపంచం మొత్తం ఆరోగ్యాన్ని కాపాడటంగానీ ప్రపంచంలో కీలకమైన దేశాలు వాటి కోసం సమష్టిగా నాయకత్వ బాధ్యత తీసుకోవాలి. ఈ మూడు మార్పులూ కొత్త అధ్యక్షుడు తీసుకురావాలి. ఇందులో కొత్తవేం లేవు. గతంలో అమెరికా చేసినవే. మళ్లీ వాటిని ప్రాధాన్యతతో తీసుకొస్తే ప్రపంచమంతా కుదుటపడుతుంది. అమెరికా అధ్యక్షుడు ఎవరన్నది మన భవిష్యత్తుని శాసించే పెద్ద అంశం. మామూలు పరిస్థితుల్లో ఇంతలా ఉండదు. ఎందుకంటే అధ్యక్షుడుగా ఎవరున్నా కూడా కొన్ని విషయాల్లో ప్రపంచంలో ఏకాభిప్రాయం ఉంది. కానీ ట్రంప్ వచ్చాక ఆయన విపరీత పోకడల వల్ల అమెరికా అధ్యక్షుడు ఇట్లా కూడా ప్రవర్తించవచ్చు అని మనకు అర్థమైంది.

**ఎన్నికల లెక్కింపులో ఆలస్యం**

అమెరికా అధ్యక్ష ఎన్నికల లెక్కింపులో ఆలస్యాన్ని విమర్శించే ముందు మనం మూడు విషయాలు అర్థం చేసుకోవాలి. ఒకటి, అమెరికాలో ఒక్కరిని మాత్రమే ఎన్నుకోవటంలా. రాష్ట్రపతి, చాలా రాష్ట్రాల్లో గవర్నర్, మూడోవంతు సీట్లలో సెనెటర్లు, దిగువ సభ (ప్రతినిధుల సభ – కాంగ్రెస్) సభ్యులు, స్థానిక ప్రభుత్వ మేయర్, లెఫ్టినెంట్ గవర్నర్.. ఇలా కొన్ని రాష్ట్రాల్లోనైతే 28 మందికి ఓటేయాలి. ఒక ఓటు కాదు 28 ఓట్లు. మనదేశంలో అట్లా కాదు. ఒక పార్టీ, ఆ పార్టీకి సింబల్, అలాంటి పార్టీల మధ్య పోటీలో ఇదా సింబల్, అదా సింబల్, వేర్వేరుగా తీసేసి లెక్కెయ్యటం. అంతే. అక్కడట్లా కాదు. ఇక్కడొక పార్టీకి వేస్తే, అక్కడ ఇంకో పార్టీకి వేయొచ్చు. అందుకే చాలాచోట్ల ట్రంప్‌కి ఎక్కువ ఓట్లు వచ్చిన చోట ఆయన పార్టీకి ఎక్కువ రాకపోవచ్చు. ట్రంప్ ఓడిపోయిన చోట ఆయన పార్టీకి చెందిన ఇంకో ప్రతినిధి గెలవచ్చు. ఎందుకంటే, ఓటర్లు.. అది వేరు, ఇది వేరు, ఆ పదవికి వేసే ఓటు వేరు, ఈ పదవికి వేసే ఓటు వేరు అనే రీతిలో భావించవచ్చు. అందుకే అన్ని ఓట్లు కూడా లెక్కించాలి. రెండు, అమెరికాలో ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్ర చట్టం, మన జిల్లాల్లాంటి కౌంటీల్లో కూడా ఏ కౌంటీకి ఆ కౌంటీ ఎన్నికల పద్ధతి. కౌంటీవాడు రాష్ట్రం మాట వినడు, రాష్ట్రం జాతీయస్థాయి మాట వినదు, జాతీయస్థాయిలో ఒక చట్టం లేదు. జాతీయస్థాయిలో ఒక రాజ్యాంగ సంస్థ లేదు. ఆ సంస్థ వీళ్లకేమీ చెప్పదు. ఎవడి మాట ఎవడూ వినడు. ఎవడి పని వాళ్లే చేస్తారు. మా ఊళ్లో చట్టం ఇది, మా జిల్లాలో చట్టం ఇది, మా రాష్ట్రంలో చట్టం ఇది, ఆ చట్టం ప్రకారం మేం చేస్తాం అంటారు. కాబట్టి సహజంగానే దూరం నుంచి మనకు చాలా గందరగోళం కన్పిస్తుంది. ఒకో రాష్ట్రంలో ఒకో తీరు ఉంటుంది కాబట్టి. 50 రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. ఒక దాంట్లోనే జరగలా. మూడోది, ఇప్పుడు ఎన్నికైన నేపథ్యం ఏమిటి? కొవిడ్. కొవిడ్ నేపథ్యంలో ప్రజల్ని కాపాడుకోవాలంటూ ఎన్నో జాగ్రత్తల్ని తీసుకున్నారు. దాంతో 15 కోట్ల ఓట్ల పైచిలుకు ఓట్లలో ముందస్తుగానే పదిన్నర కోట్ల ఓట్లు పడినాయి అంటున్నారు. దాన్లో దాదాపు 6.4 కోట్ల ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా పడినాయి. పోస్టల్ బ్యాలెట్ అంటే మన దేశంలోలా కాదు అక్కడ. ప్రొవిజనల్ బ్యాలెట్ అంటారు. ప్రతి బ్యాలెట్‌కీ బార్‌కోడ్ ఉంటుంది. అమెరికాలో పదిహేనున్నర ఓట్లకీ ప్రతిదానికీ బార్‌కోడ్ ఉంటుంది. ఏ బ్యాలెట్ ఎవరు వేశారో తెలుస్తుంది. ఆ బ్యాలెట్ కంప్యూటర్‌లో పెడతారు. వెరిఫై చేస్తారు. కరెక్టా కాదా అని. ఆ తర్వాత ఐడెంటిటీ ప్రూఫ్ ఉందా లేదా అని చూస్తారు. అది లేకపోతే ఫోన్ చేస్తారు. ఐడెంటిటీ ప్రూఫ్ లేదు రండి అని. ఎందుకంటే ప్రతి ఓటునీ కాపాడాలి, ప్రతి వ్యక్తికీ గౌరవాన్నివ్వాలి. అంతేగానీ, నువ్వు సరిగా దరఖాస్తు నింపలేదు కాబట్టి నీ ఓటు పోయింది అనరక్కడ. ఇవన్నీ జరగాలంటే చాలా పారదర్శకంగా ఉండాలి. మనలాగా అధికారులు చేసేది కాదక్కడ. ఎన్నికైనవారు చేస్తారక్కడ. లేకపోతే పార్టీల కార్యకర్తలే వలంటీర్లుగా

వచ్చి చేస్తారు. కాబట్టి పారదర్శకంగా, సమష్టిగా చేయాలి. నేను ఎన్నికలను ఎన్నోసార్లు నిర్వహించాను అధికారికంగా. అక్కడ అధికారి కూర్చుని రిజెక్టెడ్, యాక్సెప్టెడ్ అని చెప్పేస్తారు. ఎవరూ కాదనరు. కాకపోతే నిజాయతీగా చేస్తారు. అమెరికాలో అట్లా కాదు. ఒక్క ఓటు కోసం ఇన్ని చూడాలంటే మరి ఎంత సంక్లిష్టం! బోలెడంత టైం పడుతుంది. అందుకని చాలా వేగంగా చేశారనటంకంటే, సరిగ్గా చేశారా లేదా, నిష్పాక్షికంగా చేశారా లేదా, నిజాయతీగా చేశారా లేదా అన్నది ముఖ్యం. 50 రాష్ట్రాల్లో కూడా వివిధ పార్టీల వాళ్లున్నారు, అక్రమాలు జరిగాయనటం నిజం కాదు. ట్రంప్ పార్టీకి చెందిన గవర్నర్లు, ఆయన పార్టీ ప్రభుత్వం ఉన్నచోట్ల ఆయన ఓడిపోయాడు. వాళ్లేమన్నా కావాలని ఆయన్ని ఓడిస్తున్నారా? కాదు. పక్షపాతం ఎవరూ చూపెట్టటంలా. అలాంటి పద్ధతి, నిష్పాక్షికమైన ప్రక్రియ, పారదర్శకమైన ప్రక్రియ ఉన్నాయి. కచ్చితంగా మన దేశంలో ఎన్నికల సంఘం ఉదాత్తమైనది, మన దేశంలో, మనం ఉన్న పరిస్థితుల్లో మనకిట్లా ఎన్నికల సంఘం ఏర్పాటు చేసి రాజ్యాంగబద్ధంగా బాధ్యతలు, అధికారాలు ఇవ్వకపోయినట్లయితే ఈ దేశంలో ఎన్నికలు గందరగోళం అయిపోయేవి. కానీ వాళ్లకి 400 ఏళ్లపాటు అనుభవం ఉన్నది, ఒక ఫెడరల్ ప్రభుత్వంగా, దేశంగా ఏర్పాటైన 230 ఏళ్ల అనుభవం ఉంది. కాబట్టి వాళ్లు ఇంత సంక్లిష్టతని జీర్ణించుకోగలరు.

**రెండోసారీ ట్రంప్‌కి ఆదరణ**

రాజకీయంగా మౌలికమైన మార్పులు సమాజంలో వస్తున్నాయి, విపరీత ధోరణులు వస్తున్నాయంటే.. అది కేవలం రాజకీయం వల్ల, ఒక మనిషి వల్ల వచ్చేది కాదు. దాని వెనక ఆర్థిక, సామాజిక కారణాలున్నాయి. అమెరికా అత్యంత సంపన్నమైన దేశం, వందేళ్లపాటు ప్రపంచంలో సైన్స్ అండ్ టెక్నాలజీని శాసించిన దేశం. మనం ఇవాళ వాడే ప్రతి వస్తువూ మొదట అమెరికా నుంచే వచ్చింది. టెలిఫోన్, టీవీ, ఎయిర్ కండిషనర్, రిఫ్రిజిరేటర్, వాషింగ్ మెషీన్, లైట్లు, పంఖాలు అన్నీ అక్కడ్నుంచే మనకు వచ్చాయి చాలావరకు. అలాంటి దేశంలో మొట్టమొదటిసారిగా ఇప్పటి తరానికి మా తల్లిదండ్రుల కాలం కంటే మాకు ఆదాయాలు తక్కువుంటాయి, మాకంటే మా పిల్లలకు ఇంకా ఆదాయాలు తక్కువుంటాయని భయం పట్టుకుంది. మనం ఎంత పేదదేశమైనా కూడా మా తల్లిదండ్రుల కంటే మేం హాయిగా ఉన్నామని మనలో ప్రతి ఒక్కళ్లూ చెప్పగలరు. మన కంటే మన పిల్లలు బాగుంటారని భరోసా ఇవ్వగలం మనం. పేదదేశమైనా. వాళ్ల స్థాయితో మనకసలు పోలికలేదు కానీ.. ఇవాళ కంటే రేపు బాగుంటుందనే నమ్మకం మన వద్ద ఉంది. అమెరికాలో ఆ నమ్మకం పోయింది. ముఖ్యంగా ఫ్యాక్టరీల్లో పనులు చేస్తున్న పెద్దగా చదువుకోని తెల్లజాతివారిలో ఆ భయం పట్టుకుంది. రెండోది, తెల్లజాతి వాళ్ల నమ్మకం ఏమిటంటే, మా పూర్వీకులు వలస వచ్చారు, దేశ నిర్మాణం మేం చేశాం, గొప్ప దేశాన్ని మేం నిర్మించాం అని. అలాంటి తెల్లజాతి వాళ్లు క్రమక్రమంగా మిగతావాళ్లతో సమానమైపోయి రేపొద్దున ఇంకో 20 ఏళ్లలో

## మన బలాల నుంచి స్ఫూర్తిని పొందుదాం .. ప్రజాస్వామ్యంలోని లోపాల్ని సంస్కరించుకుందాం

"అమెరికాలో అధ్యక్ష ఎన్నికల ఫలితాల్ని వక్రీకరించే పచ్చి నైతిక దిగజారుడుతనాన్ని చూశాక మన దేశ ప్రజాస్వామ్యానికున్న సానుకూలతలు, బలాలు ఊరటనిస్తాయి. బలమైన, స్వతంత్ర ప్రతిపత్తి గల ఎన్నికల సంఘం, ఒక్కసారి ఎన్నికల్ని నోటిఫై చేశాక కోర్టులు నియంత్రణ పాటించటం, రాజకీయ పార్టీలు, మీడియా, ప్రజలు విజ్ఞతతో ఎన్నికల ఫలితాల్ని ఆమోదించటం మనకు స్థిరత్వాన్నిస్తున్నాయి. మన ప్రజాస్వామ్యంలో ఎన్నో లోపాలున్న మాట వాస్తవం. మన దేశ రాజకీయాల్ని, పాలనను సంస్కరించుకోవటానికి మనం ఎంతో చేయాల్సి ఉంది. బలహీనతల్ని అధిగమించేందుకు ఎంతో శ్రమించాల్సి ఉంది. అదేసమయంలో మన బలాల నుంచి ఆత్మవిశ్వాసాన్ని కూడా ప్రోది చేసుకుంటుండాలి. ప్రజాస్వామ్యం ప్రజల కోసం పనిచేసేలా చేయటం నిస్సందేహంగా చాలా కష్టమైన పని. అమెరికాలో విభజనని, గందరగోళాన్ని చూసి ప్రజల్లో చాలామంది నియంతృత్వ ప్రభుత్వం, వేగంగా ఆర్థికవృద్ధి అనే చైనా నమూనా వైపు మొగ్గు చూపే అవకాశముంది. కానీ వారి వాదన తప్పు. సరైన రీతిలో నిర్మించుకున్న ప్రజాస్వామ్యమే మనందరి విజయానికీ పునాది. మనం ఎంచుకున్న వ్యవస్థలు, పద్ధతులే ఫలితాల్ని నిర్ణయిస్తాయి. ప్రజాస్వామ్యం అంటే 'ఓటింగ్ – షౌటింగ్'లకు మించినది"

**- డా॥ జేపీ**

మైనారిటీకి వచ్చే అవకాశం ఉంది. ఈ రెండూ తీవ్రమైన అభద్రతకి దారి తీసినై. దాన్ని ఇవ్వాళ ట్రంప్ లాంటి నాయకుడు ఉపయోగించుకున్నారు. మనుషుల మధ్య విభేదాలను రెచ్చగొట్టి, నలుపు–తెలుపు తేడా చూపెట్టి, కారణాలు కొన్ని నిజమైనవి, కొన్ని అబద్ధమైనవి బూచిగా చూపెట్టి, సులభమైన పరిష్కారాలున్నాయని చెప్పి నమ్మించి, కొన్ని సందర్భాల్లో అధికారం కోసం అబద్ధాలాడి ఆకట్టుకోగలిగాడు. దాంతో సమాజంలో మంచి చెడు, లాభనష్టాల గురించి లోతైన ఆలోచన కంటే ఒక ట్రైబలిజం, మనవాడా, పరాయివాడా అన్న పరిస్థితి వచ్చింది. దేశంలో జాతిని ఏకం చేయటం కాకుండా, మన, పరాయి అనే విభజన తెచ్చి అందులో ఆయనొక వర్గం తీసుకొని మళ్లించుకుని వారి కోసం పనిచేసే మనిషిగా తయారయ్యాడు. కాబట్టి వాళ్లు ఆయన కోసం ప్రాణం ఇచ్చేవారుగా తయారయ్యారు. ప్రజాస్వామ్యంలో ఎప్పుడూ అది ప్రమాదకరం. మనం అభిప్రాయ భేదాలున్నప్పుడు అందరినీ కలుపుకుపోనట్లయితే ఆ జాతి ప్రమాదంలో పడుతుంది". ■

# సాంద్ర డే ఓ కానర్ స్ఫూర్తి

- ఎ. అన్నపూర్ణ, కాలిఫోర్నియా

అమెరికాలో మహిళకు మొదటి రోజులలో అంతగా గుర్తింపు లేదు. జెండర్ వివక్ష చాలా దేశాల్లోలా కొనసాగుతూ ఉండేది. అయితే కొందరు మహిళలు స్వయంకృషితో తమ గుర్తింపునకు బాటలు వేసుకోవడం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో విద్య, రాజకీయాలు, ఉద్యోగ రంగాలలో క్రమంగా నిలదొక్కుకోవడం విశేషంగా చెప్పుకోవాలి. దేశ రక్షణ రంగంలోను, అంతరిక్ష యాత్రలోనూ, అనేక కష్టతరమైన రంగాలలోనూ ధైర్యసాహసాలకు పేరు తెచ్చుకుంటూ వివక్షను చెరిపి వేసే ప్రయత్నం చేయటం అభినందనీయం. అలాంటి సాహసుల్లో ఒకరు 'సాంద్ర డే ఓ కానర్'. అగ్రరాజ్యం అమెరికా అత్యున్నత న్యాయస్థానానికి జడ్జిగా ఎంపికైన ఆ తొలి మహిళ గురించే మనం మాట్లాడుకోబోతున్నది. అద్భుతమైన వ్యక్తిత్వంగల మహిళ సాంద్ర డే ఓ కానర్. అమెరికా సుప్రీంకోర్టులో మొట్టమొదటి మహిళా న్యాయమూర్తి (అసోసియేట్ జస్టిస్). ఈమె టెక్సాస్ రాష్ట్రంలో 1930లో జన్మించారు. ప్రతిష్ఠాత్మక స్టాన్‌ఫోర్డ్ లా స్కూల్లో విద్యనభ్యసించారు. (పంతొమ్మిది వందల యాభైలో) చదువు పూర్తయిన తర్వాత తన సహాధ్యాయుడు అయిన జాన్ జాయ్ ఓ కానర్‌ను తల్లిదండ్రుల అంగీకారంతో వివాహం చేసుకున్నారు.



అయితే ఆ రోజుల్లో స్త్రీ పురుష వివక్ష కారణంగా జీతాలు చెల్లించాల్సిన ఉద్యోగాలలో మహిళను నియమించేవారు కాదు. కాలిఫోర్నియా రాష్ట్రం శాన్ మాటియో అనే ఊళ్లో కార్యాలయంలో ఆమెకంటూ ఒక రూము లేకుండా కుర్చీ లేకుండా సెక్రటరీతోపాటు పక్కనే సీటు పంచుకుని ఆమె తన ప్రాక్టీసును మొదలుపెట్టారు. కొన్ని నెలల తర్వాత చాలా తక్కువ డబ్బులిచ్చేవారు. ఆ తర్వాత సాంద్ర భర్త ఆర్మీ అధికారిగా జర్మనీ వెళ్లినప్పుడు భర్తతోపాటు వెళ్లారు. అక్కడ సివిలియన్ అటార్నీగా ఆర్మీ క్వార్టర్ మాస్టర్ కార్పొరేషన్‌లో చేరారు. మూడు సంవత్సరాలు పనిచేశాక స్వదేశం అరిజోన రాష్ట్రానికి తిరిగొచ్చి మారికోప కౌంటీలో జీవనం సాగించారు. అయిదు సంవత్సరాలపాటు లాయర్‌గా ప్రాక్టీసు చేస్తూనే రాజకీయ పార్టీ సంస్థలకు వాలంటీరుగా ప్రచారం చేశారు. అప్పటి అరిజోన రాష్ట్ర సెనేటర్ బారీ ఎం గోల్డ్‌వాటర్ తరపున ప్రచారం చేశారు. 1965 నుంచి 1969 వరకు అరిజోనకు అసిస్టెంట్ అటార్నీ జనరల్‌గా పనిచేశారు. 1969లో అరిజోన సెనెట్‌లో ఖాళీ అయిన స్థానానికి సాంద్ర డేను గవర్నర్ నియమించారు. ఆ మరుసటి సంవత్సరం ఎన్నికల్లో ఆ సీటును ఆమె గెలుచుకున్నారు. 1973 నాటికి ఓ రాష్ట్రానికి మెజారిటీ లీడర్‌గా ఉన్న మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. సంప్రదింపులు, సామరస్య పద్ధతుల్లో మధ్యేమార్గ పరిష్కారకర్తగా ఆమె పేరొందారు. రెండు సార్లు పూర్తి పదవీకాలం పనిచేశాక సెనెట్‌కు గుడ్‌బై చెప్పారు. 1974లో మరికోప కౌంటీ సుపీరియర్ కోర్టుకు ఎన్నికై 1979లో అరిజోన స్టేట్ కోర్ట్ ఆఫ్ అప్పీల్స్‌కు పదోన్నతి పొందారు. 1981లో దేశాధ్యక్షుడు రొనాల్డ్ రీగన్ ఆమెను సుప్రీంకోర్టుకు నియమించారు. పంతొమ్మిది వందల ఎనభై ఒకటి నుంచి రెండువేల ఆరులో రిటైరయ్యే వరకు అసోసియేట్ జస్టిస్ ఆఫ్ ది యూఎస్ సుప్రీంకోర్టుగా పనిచేశారు. సుప్రీంకోర్టులో తొమ్మిదిమంది జడ్జీలు ఉంటారు. వీరిలో సాంద్ర ఒక్కరే మహిళ. న్యూయార్క్ టైమ్స్ వార్తాపత్రిక అప్పట్లో ఎడిటోరియల్ రాస్తూ, "అమెరికా సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా నియమితులైన తొమ్మిదిమంది పురుషులు (నైన్ మెన్).."అని పేర్కొంది. సాంద్ర పేరును ఒక మహిళగా చెప్పలేదు.

అది చదివిన సాంద్ర వెంటనే లేఖ రాసింది. "ఆ తొమ్మిదిమందిలో ఏకైక మహిళగా నేనున్నాను. నా పేరు సాంద్ర డే ఓ కానర్".

ఆ విధంగా తన గుర్తింపు కోసం రెస్పాండ్ కావాల్సి వచ్చింది.

కేవలం యాభై సంవత్సరాల వయసుకే సుప్రీంకోర్టు జస్టిస్‌గా నామినేట్ అయిన ఆమె తొలి సంవత్సరంలోనే ప్రజల నుంచి అరవైవేల లేఖలు అందుకోవటం ఎవరికీ లభించని అరుదైన ప్రత్యేకతగా చెప్పవచ్చు. చరిత్రలోనే వేరెవరికీ ఈ గౌరవం దక్కలేదు. మహిళగా ఆమె అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు, అధిగమించారు. లక్షలాది స్త్రీలకూ కోర్టు పరిసరాల్లో రెస్టురూములు లేకపోవటం వంటి పలు సమస్యల్ని పరిష్కరిస్తూ తన వృత్తిని కొనసాగించారు. బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు 'ది మోస్ట్ పవర్‌ఫుల్ ఉమన్' అని పత్రికలో అభినందనలు అందుకున్నారు.

పంతొమ్మిది వందల ఎనభై ఎనిమిదిలో ఆమె ప్రాణాంతక క్యాన్సర్ బారిన పడినప్పటికీ కోలుకున్నారు. కెరియర్‌లో సాంద్ర లెక్కలేనన్ని అవార్డులు సాధించారు. రెండువేల తొమ్మిదిలో ప్రెసిడెంట్ ఒబామా ఆమెకు 'మెడల్ ఆఫ్ ఫ్రీడమ్' అవార్డును అందచేశారు.

సాంద్రకు టెన్నిస్, గోల్ఫ్ క్రీడల పట్ల విశేష అనుభవం ఉంది. హంటింగ్ హాబీ. ఇరవై ఏళ్ల పాటు అల్జీమర్స్ వ్యాధి బారిన పడి మరణించిన భర్తను గమనించిన ఆమె వ్యాధుల పట్ల అవగాహన పెంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఉండేవారు. సాంద్ర పదవీ విరమణ చేసినప్పటికీ మహిళలకు ఉచిత న్యాయ సలహాలు ఇచ్చేవారు. వచ్చే మార్చి నెలకి ఆమెకు 90 నిండుతాయి. భారతదేశంలో కొన్ని విషయాలలో విదేశాలను అనుకరిస్తారు. కానీ యాభై ఏళ్ల మహిళను వృద్ధురాలని, శారీరకంగా బలహీనురాలని తక్కువ చేసి మాట్లాడతారు. రిటైర్డ్, మాజీ అని ఏదో లోపమన్నట్టుగా మాట్లాడతారు. వయసుతో సంబంధం లేకుండా తమ కోసం, సమాజం కోసం పనిచేస్తూ సంపూర్ణ జీవితాల్ని గడిపినవారు సాంద్ర డే ఓ కానర్‌లా మనకు చరిత్రలో కనిపిస్తారు. మన చుట్టూ కూడా కొందరుంటారు. ఈవేళైతే వయసుతో సంబంధంలేని యుగం. మేధస్సు, సాంకేతికత ఉంటే వృద్ధాప్యాన్ని వెనక్కినెట్టి క్రియాశీలంగా ఉండే అవకాశాల యుగం. ఇంకా నిష్క్రియామయ పాత ఆలోచనలు చేసేవారు శ్రీశ్రీ చెప్పినట్లు 'పుట్టుకతో వృద్ధులు'. ■

# కొవిడ్ జాగ్రత్తలు పాటిస్తూనే లోక్‌సత్తా కార్యకలాపాలు కొనసాగించండి

కొవిడ్ పట్ల జాగ్రత్తలు పాటిస్తూనే లోక్‌సత్తా పార్టీ కార్యకలాపాల్ని కొనసాగించాలని, గ్రామస్థాయి నుంచి పార్టీని పటిష్టం చేసేందుకు బాధ్యులు, కార్యకర్తలు ముందుకు రావాలని పార్టీ రాష్ట్ర సలహాసంఘం కన్వీనర్ కటారి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. లోక్‌సత్తా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు తుమ్మనపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన హైదరాబాద్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో కటారి దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మండల, పట్టణ, నగర కమిటీలు వేసి డా॥ జేపీ సూచనల మేరకు నగరాల్లో పౌర సేవలు మెరుగుపరుస్తూ స్వీయపాలన, స్వయంపాలన సాధించేందుకు కార్యక్రమాల్ని ముమ్మరం చేస్తామని తుమ్మనపల్లి అన్నారు. సమావేశంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్, కార్యదర్శి సుధీర్‌రెడ్డి, నాంపల్లి వెంకటేష్, అప్పన్నగారి శ్యామ్ సాయి, బొట్ల వికాస్ తదితర నేతలు పాల్గొన్నారు. అంతకుముందు తుమ్మనపల్లి శ్రీనివాస్ లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర నూతన కమిటీల్ని ప్రకటించి నియామక పత్రాల్ని అందజేశారు. ఐటీ విభాగం కన్వీనర్‌గా అప్పన్నగారి శ్యామ్ సాయి. మహిళాసత్తా కన్వీనర్‌గా మద్ది లత, లీగల్ సెల్ కన్వీనర్‌గా గాడిపల్లి ప్రభాకర్‌రెడ్డి, విద్యార్థిసత్తా రాష్ట్ర కన్వీనర్‌గా బొట్ల వికాస్‌లు నియమితులయ్యారు.







## పరీక్షలు త్వరితగతిన నిర్వహించండి

శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ విద్యార్థులకు చివరి సంవత్సరం ఆరవ సెమిస్టర్ పరీక్షలు త్వరితగతిన నిర్వహించాలని విద్యార్థిసత్తా నేతలు వైస్ ఛాన్సలర్‌ను కలిసి విజ్ఞాపన పత్రం అందచేశారు. దీనికి వీసీ సానుకూలంగా స్పందించారని, లోక్‌సత్తా భావజాలానికనుగుణంగా నాణ్యమైన విద్య లక్ష్యంగా విద్యార్థుల సమస్యల మీద పనిచేస్తామని విద్యార్థిసత్తా రాష్ట్ర కో కన్వీనర్ సనత్ జయసూర్య అన్నారు. కుంట హరీష్, ఎన్.ప్రవీణ్, ఆర్.సాయికిరణ్, బి.మనోజ్, ఎం.శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎజెండా ప్రాతిపదికన ఎవరితోనైనా కలిసి పనిచేస్తాం

అందరికీ ఉచితంగా మంచి ప్రమాణాల ఆరోగ్యం, నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు, లాభసాటి వ్యవసాయం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, ప్రభుత్వ కార్యాలయాల్లో హక్కుగా పౌరసేవలు తదితర పరిష్కారాల ప్రాతిపదికన ఏ పార్టీతోనైనా కలిసి పనిచేసేందుకు సిద్ధమని లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నందిపేట రవీందర్ అన్నారు. 'రాష్ట్ర భవిష్యత్తు-ప్రజల ఎజెండా'పై సామాజిక నేత నారగోని అధ్యక్షతన హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎజెండా బలంగా ఉంటే, కలిసి పనిచేస్తే చిన్న పార్టీలు కూడా పెద్ద మార్పును తీసుకురావచ్చన్నారు.



(గత సంచిక తరువాయి)

# ఎన్నికల నిఘా ఉద్యమం - ఉమ్మడి వేదికలు

## (లోక్‌సత్తా రాజకీయ ఉద్యమ సంస్థ 23 సంవత్సరాల ప్రస్థానం)

- బండారు రామ్మోహనరావు, 98660 74027

ఒక సంవత్సరం పాటు పెట్రోల్ బంకుల్లో మోసాలపై ఉద్యమం సాగింది. ప్రజలకు అందించిన ఆయుధాన్ని వారే ఉపయోగించేలా చేయాలన్నది లోక్‌సత్తా విధానం. ఈలోపు 1999లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు వచ్చాయి. లోక్‌సత్తా లాంటి రాజకీయ ప్రజాఉద్యమాలకు ఇక చెప్పేదేముంది. వెంటనే దానికి తగ్గట్లు ఉద్యమాలను డిజైన్ చేసింది. అప్పటిదాకా ఒక స్వచ్ఛంద సంస్థ అంటే.. రాజకీయాల జోలికి పోకుండా కేవలం మూఢనమ్మకాల మీద, సామాజిక దురాచారాల మీద పోరాడే సంస్థలు, కొన్ని రకాల సేవలను అందించే సంస్థలు మాత్రమే. ఆ అభిప్రాయాన్ని మార్చివేసి రాజకీయాలను మార్చటం కూడా ఒక ఉద్యమమే అని మొట్టమొదటిసారి లోక్‌సత్తా నినదించింది. పార్టీలకు అతీత ఉద్యమ సంస్థగా ఎన్నికల రంగంలోకి పరోక్షంగా దిగింది. భారతదేశంలో మొట్ట మొదటిసారి అభ్యర్థులతో ఉమ్మడి వేదికను నిర్వహించింది. "ఎన్నికల నిఘా" అనే పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించింది. ఎన్నికల నిఘా సభ్యులుగా ఏమి చేయవచ్చు, ఏమి చేయకూడదు తదితర విషయాలను పుస్తకంలో స్పష్టంగా పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి వేదిక నిర్వహించడానికి అవసరమైన సూచనలు సలహాలతో మరొక పుస్తకాన్ని కూడా వెలువరించింది. రాజకీయ పార్టీలకు అతీతంగా సంఘాల్లోని పెద్దలు, వివిధ రంగాల్లోని ప్రముఖులను కూడగట్టి ఈ ఉమ్మడి వేదికలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించింది. అసెంబ్లీ ఎన్నికలలో నామినేషన్ ఉపసంహరణ నుంచి కేవలం 14 రోజులు మాత్రమే అభ్యర్థుల ప్రచారానికి ఉంటుంది. అందులో పోలింగ్ కన్నా ముందు రెండు రోజులు తీసివేస్తే ఇక మిగిలింది పన్నెండు రోజులే. ఆ పన్నెండు రోజులలోనే.. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు చెందిన 100 మందికిపైగా అసెంబ్లీ అభ్యర్థులను ఉమ్మడి వేదికలను లోక్‌సత్తా నిర్వహించింది. తమకు ఎందుకు ఓటు వేయాలి అన్న విషయాన్ని వివరిస్తూ ప్రజలను ఉమ్మడి వేదిక ద్వారా వారంతా అభ్యర్థించారు. తాము అధికారంలోకి వస్తే ప్రజలకు ఏమి చేస్తామో చెప్పటానికి రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఆ వేదికలు చాలా చక్కగా ఉపయోగపడ్డాయి. ఊరూరా తిరిగి కృత్రిమ ప్రచారం చేయటానికి బదులు ఒకే చోట విజ్ఞులైన ఓటర్లను కూడగట్టి వారి ముందు తమ పార్టీ ఎజెండా, వ్యక్తిగత ప్రణాళిక కూడా చెప్పుకోవటానికి అభ్యర్థులకు అవకాశం ఇచ్చిన లోక్‌సత్తా ఉద్యమ సంస్థకి రాజకీయ పార్టీలతోపాటు మీడియా సంస్థలు కూడా సహకరించాయి. మీడియాకి కూడా ఇది ఒక కొత్త ప్రయోగం. అప్పటి దాకా వారి మీద వీరు, వీరి మీద వారు ఆరోపణలు చేసుకుంటే రాసిన పత్రికలు.. చాలా హుందాగా, మర్యాదగా నిర్మాణాత్మక విమర్శలు చేసుకుంటూ, ప్రజలకు ఏం చేస్తామో అభ్యర్థులు వివరించిన ఉమ్మడి వేదికలను ప్రముఖంగా ఆదరించాయి. విస్తృత ప్రచారం కల్పించాయి. మొత్తంగా ఈ ప్రయోగం చాలా సక్సెస్ అయి ఒక ఒరవడి దిద్దింది.





**నేరచరితులు వెల్లడి**

అలాగే నేరచరితుల జాబితా ప్రకటించే చర్య కూడా సాహసోపేతమైనది. అప్పటిదాకా మనకు ఇష్టం ఉన్నా లేకున్నా ముక్కు మూసుకుని ఓటు వేయాల్సి వచ్చేది. కండబలం, డబ్బు, మద్యంతో కూడిన ఎన్నికలను చూశాము. అలాగే ఎంతోమంది నేరచరితులు ఎన్నికల్లో అభ్యర్థులుగా పోటీ చేస్తున్నా నోరు మెదపకుండా వారికి ఓటేసిన సందర్భాలు అనేకం. కానీ అన్ని సాంప్రదాయ పార్టీలలోని నేరచరితులను గుర్తించి వారిని ప్రకటించటం దేశంలో మొట్టమొదటిసారి లోక్‌సత్తా ఉద్యమసంస్థకే సాధ్యమైంది. ఇది ఏదో అల్లాటప్పాగా చేసింది కాదు. శాస్త్రీయంగా, చట్టబద్ధంగా, పకడ్బందీగా వివరాలను సేకరించి, విశ్లేషించి చేసినది. ఇందుకు మీడియావారితోపాటు అధికారికంగా, అనధికారికంగా పలువురు సహకరించారు.

పోలీస్ స్టేషన్ల రికార్డులతో మొదలుపెట్టి కోర్టులు ఇచ్చిన తీర్పులను, అలాగే కోర్టుల్లో నలుగుతున్న కేసులను సేకరించి బయటపెట్టిన మొట్టమొదటి బహిరంగ చర్య అది. ఆనాడు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో 45 మంది నేరచరితులు పోటీ చేస్తున్నారని సాక్ష్యాధారాలతో లోక్‌సత్తా ప్రకటించటం తెలుగునాటే కాకుండా దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అందులో ఒక్కరు కూడా తాము నేరచరితులము కాదని, తమ పేరును ఎందుకు ప్రకటించారని లోక్‌సత్తాను ప్రశ్నించలేదు. కేసుల వివరాలు సహా పూర్తి రికార్డులతో వారి నేరచరిత్ర సమాచారాన్ని లోక్‌సత్తా పత్రికలకు విడుదల చేసింది. దాన్ని ఎవరూ ఛాలెంజ్ చేయలేదుగానీ.. ఇంకా కొంతమంది మిగిలిపోయారు, ఆ నేరచరితుల పేర్లను కూడా ప్రకటిస్తే బాగుండేదనే సూచన వచ్చింది. అలాంటి వారి వివరాలను సాక్ష్యాధారాలతో ఇస్తే తప్పక ప్రకటిస్తామని లోక్‌సత్తా వారికి తెలియజేసింది. లోక్‌సత్తా చేసిన ఈ సాహసోపేత ప్రయత్నాన్నే సాక్ష్యంగా చూపుతూ ఏడీఆర్ అనే సంస్థ సుప్రీంకోర్టులో పిల్ వేసింది. ఆ తర్వాత అందులో లోక్‌సత్తా కూడా ఇంప్లీడ్ అవటం, విధిగా నేరచరితులకవివరాల వెల్లడికి చట్టం చేసేలా రాష్ట్రపతి అబ్దుల్ కలాం సాయంతో జేపీ పోరాడటం, చివరికి సుప్రీంకోర్టు తీర్పుతో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ వివరాల్ని వెల్లడించాలనే చట్టనిబంధన రావటం జరిగింది.

**ఈనాటి 'నోటా' గురించి నాటి బ్యాలెట్ పేపర్ల కాలంలో..**

వివిధ రాజకీయ పార్టీల నుంచి పోటీ చేస్తున్న అభ్యర్థులు తమకు నచ్చటం లేదని, అలాంటి వారికి ఓటు వేయటం ఇష్టం లేక తాము పోలింగ్ బూత్‌లకు దూరంగా ఉంటున్నామని చెప్పేవారి సంఖ్య మన దేశంలో తక్కువేమీ కాదు. బ్యాలెట్ పేపర్లు ఎక్కువగా ఉపయోగించిన అప్పటి కాలంలో, ఎవరైనా అలా ఓటు వేయకపోతే దొంగ ఓట్లు వేస్తుండేవారు. ఈ నేపథ్యంలో లోక్‌సత్తా ఒక పరిష్కార మార్గాన్ని ప్రతిపాదించింది. అదేమిటంటే, పోలింగ్ బూత్‌కైతే వెళ్లండి, అభ్యర్థులు ఎవరూ నచ్చకపోతే ఆ బ్యాలెట్ పేపర్ మీద ఎవరికీ వేయకుండా పెన్ను లేదా పెన్సిల్‌తో ఇన్‌టూ గుర్తు పెట్టమని చెప్పింది. అభ్యర్థులు నచ్చలేదని మీరు పోలింగ్ బూత్‌లకు వెళ్లకపోతే మీ ఓటును మీ బదులు వేరొకరు వేసే అవకాశముండటంతోపాటు.. ఓటు హక్కును వినియోగించకపోతే ప్రభుత్వాలను విమర్శించే ప్రజాస్వామిక హక్కు ఉండదని నచ్చచెప్పింది. దొంగ ఓట్లను అరికట్టటానికి, ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టటానికి లోక్‌సత్తా ఇచ్చిన ఈ పిలుపునకు కూడా ప్రజానీకం పెద్దఎత్తున స్పందించారు. అయితే ఒక పరిధి దాటి 'నోటా'ను పరిష్కారంగా భావించకూడదని, వయోజనులందరూ ఉత్సాహంతో ఓటింగ్‌లో పాల్గొనేందుకు నిర్దిష్ట సంస్కరణలు తీసుకురావాలన్నది లోక్‌సత్తా విధానం.

**తప్పుల తడకగా ఓటర్ల జాబితా సర్వే - పరిష్కారం చూపిన లోక్‌సత్తా**

ఇక మరొక ఎన్నికల సంస్కరణను కూడా లోక్‌సత్తా ప్రతిపాదించింది. ఆనాడు ఓటర్ల జాబితా తప్పులతడకగా ఉండటం, దొంగ ఓట్లకు కావలసినన్ని లొసుగులుండటం, అర్హులైనవారికి ఓటు వేసే అవకాశం లేకపోవటం వంటి వన్నీ క్షేత్రస్థాయి సర్వే చేసి గణాంకాలతో సహా ప్రకటించింది. ప్రతి జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాల్ని చేపట్టింది. దీనివల్ల పట్టణ ప్రాంతాల్లో ఓటర్ల జాబితాల్లో తప్పులు 40 నుంచి 15.9శాతానికి, గ్రామ ప్రాంతాలలో 15 నుంచి 5శాతానికి తగ్గాయి. లోక్‌సత్తా చేసిన ప్రయత్నాన్నే నమూనాగా తీసుకుని ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ఎన్నికల జాబితాల్లో తప్పుల సవరణను తరచూ నిర్వహించాల్సిన కార్యక్రమంగా రూపొందించింది. ఓటర్ల జాబితాలలో ప్రజలు తేలిగ్గా తమ పేర్లను నమోదు చేసుకునేందుకు, అవసరమైన మార్పులు చేసేందుకునేందుకు నిరంతరం అందుబాటులో ఉండేందుకు పోస్టాఫీసులలో ఓటర్ల జాబితాల ఏర్పాటుకు లోక్‌సత్తా ఎన్నో ఏళ్లుగా చేసిన ప్రయత్నాలు 2008లో కొంతమేర ఫలించాయి. ప్రజలు విదేశాల్లో ఉన్నా కూడా ఎప్పుడు కోరుకుంటే అప్పుడు ఓటర్లుగా నమోదయ్యేందుకు ఏర్పాట్లు వచ్చేస్తున్నాయంటే అది లోక్‌సత్తా సుదీర్ఘ కృషి ఫలితమే.

**క్రియాశీల పౌరుల ఉద్యమమే జనశిక్షణ - కళాజాత**

సమాజంలో ఉన్న సామాన్య పౌరులను విషయ పరిజ్ఞానంతో సంఘటితంగా కృషి చేసే క్రియాశీల పౌరులుగా తయారు చేయటానికి రతన్ టాటా ట్రస్ట్‌తో కలసి "జనశిక్షణ" పేరుతో కార్యక్రమాన్ని లోక్‌సత్తా ప్రారంభించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సుమారు లక్షా పాతిక వేల మంది క్రియాశీల పౌరులకు వెయ్యి గ్రామాలకు పైగా తిరిగి శిక్షణనివ్వడం జరిగింది. దీనిలో భాగంగానే 'కళాజాత' కార్యక్రమాన్ని నిర్వహించి రాష్ట్రంలోని సుమారు 500 మండలాలలో ప్రజాకళాకారుల ప్రదర్శనల్ని నిర్వహించారు.

ప్రజాస్వామ్య సంస్కరణల్లో భాగమైన ఎన్నికల సంస్కరణలు, న్యాయ, పోలీసు సంస్కరణలు, అవినీతికి వ్యతిరేకంగా పారదర్శక, జవాబుదారీ పాలనకకోసం, విద్య, ఆరోగ్య రంగాలకు ప్రభుత్వమే బాధ్యత తీసుకుని విధానాల్లో మార్పు తీసుకురావటం కోసం ఉద్యమాలు, కార్యక్రమాలు నూతన రాజకీయ సంస్కృతితో చేస్తూ తెలుగునాట క్రమంగా సంస్థాపరంగా లోక్‌సత్తా బలపడింది. జిల్లాలవారీ సంఘాలను విస్తృతం చేసి రాష్ట్రంలో ప్రతి మండలానికీ సంఘం ఉండేలా ఏర్పాటు చేసింది. రాజకీయ సంస్థల్లో తాను కోరుతున్న అంతర్గత ప్రజాస్వామ్యాన్ని లోక్‌సత్తాలో ఎన్నికల ప్రక్రియ ద్వారానే చేసి చూపింది. ప్రజాస్వామ్యయుతంగా లోక్‌సత్తా ఉద్యమ సంస్థ శాఖలకు 2002లో ఎన్నికలు నిర్వహించింది. మొదట గ్రామ, ఆ తర్వాత పట్టణ, తర్వాత జిల్లా, రాష్ట్ర విభాగాలకు వరుసగా ఎన్నికలను జరిపింది. నూతన ఒరవడితో ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది. సంస్థాగత నిర్మాణం తర్వాత ప్రజాస్వామ్య సంస్కరణల ఉద్యమ కార్యక్రమాల్ని ఉధృతం చేసింది.

**(ఇంకా ఉంది)**

'ప్రజాస్వామ్యంలో న్యాయం'

# సాదాబైనామా కోర్టులో ఎందుకు చెల్లుబాటు కాదు?

-పి.వి గోపాలకృష్ణ, అడ్వొకేట్



సాదాబైనామా కోర్టులో చెల్లుబాటుకాదగిన పత్రమే. వాస్తవాలను రుజువు చెయ్యడానికి కావలసిన అన్ని లక్షణాలు ఉంటే అటువంటి సాదాబైనామాను సాక్ష్యంగా కోర్టులు ఒప్పుకోక పోవడం అసమంజసం. కానీ ప్రభుత్వానికి డబ్బు చెల్లించ కపోడంతో అన్న ఒక్క కారణం వల్ల గత నూట ఇరవై ఏళ్లలో కోర్టు కేసుల్లో ఆస్తిహక్కులను కాపాడుకోలేని జీవితాలు ఎన్నో!

నిన్నటిదాకా కోర్టులు పనికిమాలినదిగా కొట్టిపారేసే ఒక కాయితం ప్రభుత్వానికి డబ్బు చెల్లించినంత మాత్రాన హఠాత్తుగా వాస్తవాలను రుజువు చెయ్యగలిగిన పవిత్రమైన సాక్ష్యంగా మారిపోతోంది. ఇటువంటి పరిస్థితికి కోర్టులు ఇన్నేళ్లుగా దోహదం చెయ్యడం విషాదం.

సత్యశోధన, నిజనిర్ధారణే ధ్యేయంగా పనిచేయవలసిన మన కోర్టులు ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చే ఇతర పన్ను వసూలు శాఖలుగా మారిపోయింది. నిజనిరూపణే ప్రథమ, ప్రధాన ధ్యేయంగా కోర్టులు పనిచేస్తే "సత్యమేవ జయతే" అన్న సూక్తిని ఆచరణలో పెట్టినట్టవుతుంది. ఆ ప్రాతిపదిక మీదే కోర్టులు పనిచేస్తూ ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదేమో! వందల ఏళ్లనాటి బ్రిటీష్ చట్టాలని అమలుచేసినదాని ఫలితం ఇది. బ్రిటీషు వారి నుంచి వారసత్వంగా తెచ్చుకున్న ఇండియన్ స్టాంప్ ఆక్ట్‌లోని సెక్షన్ 33, 35లను గుడ్డిగా అమలు చెయ్యడంతో సాదాబైనామా ఒక పనికిమాలిన కాయితంగా మారిపోయింది. సత్యమేవ జయతే, ధర్మో రక్షతి రక్షితః అన్నవి కేవలం పసలేని మాటలుగా మిగిలిపోయేయి. ప్రభుత్వానికి డబ్బు చెల్లించినప్పుడే సత్యమేవ జయతే, ధర్మో రక్షతి రక్షితః అని కోర్టులు కూడా అనుకోవడం దారుణం. ఆ రెండు సెక్షన్‌లను చట్టపరిధి నుంచి తప్పించడమే తక్షణ కర్తవ్యం.

అలాకాని పక్షంలో కోర్టులు తీర్పునివ్వడానికి ప్రతిబంధకంగా ఉన్న అటువంటి స్టాంపు డ్యూటీ కట్టిన తరవాతే ఆ తీర్పు అమలయే విధంగా చట్ట సవరణ చేయడ హర్షణీయం.

1977లో లా కమిషన్ ప్రభుత్వానికి అందజేసిన 67వ రిపోర్ట్‌లో స్టాంప్ ఆక్ట్‌లోని కొన్ని సెక్షన్‌లకు సంబంధించి కొన్ని సూచనలను చేసినా కోర్టు ప్రాధమ్యం దృష్ట్యా, నిజనిర్ధారణ సత్యనిరూపణే కోర్టుల పరమావధిగా సాదాబైనామాలని గాని సరైన స్టాంపు డ్యూటీ కట్టని మరియే ఇతర పత్రాలని సాక్ష్యాధారాలుగా గుర్తించే విధంగా ఆ సూచనలు లేవు.

సత్యశోధన, సత్యాన్వేషణ, సత్యపరిరక్షణ కోర్టుల పరమధ్యేయం కావాలే తప్ప ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే పన్ను వసూళ్ల సంస్థ కాకూడదు. సత్యం జయించాలి. సత్యమేవ జయతే.

https://www.latestlaws.com/library/law-commission-of-india-reports/

# లోక్‌సత్తా విధానాలు, కార్యాచరణతోనే పేదరిక నిర్మూలన, సుపరిపాలన



హైదరాబాద్‌లో వరద బాధితులందరికీ ఆర్థిక సహాయం అందించాలని లోక్‌సత్తా పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గం అధ్యక్షుడు చిటికెన వంశీప్రసాద్ డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇళ్లు నీటమునిగినవారిలో ఎక్కువమంది అర్హులకు ఇంకా సాయం అందలేదన్నారు. ఇళ్లులేని పేదలనైతే ప్రభుత్వం అసలు పట్టించుకోలేదన్నారు. లోక్‌సత్తా పార్టీ ఆధ్వర్యంలో అల్లాపూర్ డివిజన్ పర్వతనగర్‌లో పేదలకు లోక్‌సత్తా ఎన్నారై విభాగం పీపుల్ ఫర్ లోక్‌సత్తా (పీఎఫ్‌ఎల్) సహకారంతో నిత్యావసరాల కిట్‌లను అందించారు. సంక్షేమం పేరుతో తాత్కాలిక తాయిలాలనిస్తూ పేదరికాన్ని శాశ్వతంగా కొనసాగిస్తున్న సాంప్రదాయ పార్టీల తీరుకు విరుద్ధంగా లోక్‌సత్తా ఎజెండా, కార్యాచరణ ఎప్పుడూ పేదల పక్షాన ఉంటుందని వంశీప్రసాద్ అన్నారు. డబ్బు, మద్యం, ప్రలోభ పథకాలకు మోసపోకుండా ఓటును సద్వినియోగం చేసుకుంటేనే పేదరిక నిర్మూలన, రోజువారీ సమస్యలు లేని పాలన సాధ్యమవుతాయన్నారు.

# కరోనా నుంచి కాపాడుకునేందుకు కరదీపిక




సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ (ఎస్‌హెచ్‌వో) ద్వారా సామాన్య ప్రజలకు అందుబాటులో వైద్య సేవలందించే డాక్టర్‌గా తాతా సేవకుమార్ గుంటూరు, చుట్టుపక్కల చాలామందికి పరిచితులు. కేవలం తక్కువ ధరలకే వ్యాధి నిర్ధారణ పరీక్షలు, మందులు, ఉచిత వైద్య సలహాల్ని అందించటమే కాకుండా.. వ్యాధుల నివారణ, నియంత్రణకు సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచేందుకు కూడా ఆయన కృషి చేస్తుంటారు. ఇందుకోసం వైద్య, ఆరోగ్య, విద్య, సామాజిక అంశాలపై పత్రికల్లో వ్యాసాలు రాయటం, కరపత్రాలు, పుస్తకాలు ప్రచురించటం, శిబిరాల్ని నిర్వహించటం, సమావేశాలు, ఇతర కార్యక్రమాల్లో పాల్గొనటం దాదాపు రెండున్నర దశాబ్దాలుగా చేస్తున్నారు. ఒకరకంగా చెప్పాలంటే, వైద్య ఆరోగ్య రంగంలో ప్రభుత్వ విధానాల వైఫల్యాల నుంచి ప్రజలకు వీలైనంత ఉపశమనం కలిగిస్తున్నారు.

1992లో ఎయిడ్స్ వ్యాధి పట్ల భయాందోళనలతో మన సమాజం వణికిపోతున్నప్పుడు ప్రజల్లో అవగాహన పెంచేందుకు పుస్తకాన్ని వెలువరించినట్లు, ఇప్పుడు కరోనా (కొవిడ్-19)పై కూడా స్పష్టత కలిగించేందుకు సేవకుమార్ ఓ పుస్తకాన్ని వెలువరించారు. 'కరోనా వైరస్: ముందు జాగ్రత్తలే.. మందు-వ్యాక్సిన్' పేరుతో సంక్షిప్త సమాచారంతో వారు వెలువరించిన ఈ పుస్తకంలో.. ప్రజలు తగిన జాగ్రత్తలతో ఎలా కరోనా బారిన పడకుండా సురక్షితంగా రోజువారీ వృత్తి, వ్యాపారాలను చేసుకోవచ్చో సులభంగా అర్థమయ్యేలా వివరించారు.

కొవిడ్ అతి వేగంగా వ్యాపించే వైరస్ అయినప్పటికీ, దీనివల్ల ప్రాణహాని తక్కువ. దీని జన్యుపటం కూడా అంత సంక్లిష్టమైనది కాదు. వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు, ఇతరత్రా వ్యాధులున్నవారు, మరీ చిన్న పిల్లలను బయట తిరగనీయకుండా చేస్తూ, మిగిలినవారు మాస్క్ ధరించి, శుభ్రతను, కొంత భౌతిక దూరాన్ని పాటిస్తే చాలు.. చాలా మేర ఈ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. ఇంత చేసినా ఒకవేళ ఇన్ఫెక్షన్ సోకితే నష్టమేమీ ఉండదు. వ్యాధి లక్షణాలు కనిపించినా బెంబేలెత్తాల్సిన పన్లేదు. నిర్ధారణ పరీక్ష చేయించుకుని, వైద్యుల సూచనల మేరకు మందులు వాడితే దాదాపు 80-90 శాతం మందికి ఇంట్లోనే నయమైపోతుంది. కానీ మన దేశంలో, తెలుగు రాష్ట్రాల్లోనూ సమస్య ఎక్కడ వచ్చిందంటే.. ప్రజల్లో కరోనాపై అవగాహన పెంచి, వారు ఎలా వ్యవహరించాలో చెప్పాల్సిన ప్రభుత్వం ఆర్భాటాలకు పోయి గందరగోళానికి గురై చివరికి చేతులెత్తేసింది. కేంద్రీకృత నిర్ణయాలు, కఠిన లాక్‌డౌన్‌తో కాలాన్ని వృథా చేసింది, కోట్లాదిమంది రెక్కాడితేగానీ డొక్కాడని వారి జీవనోపాధిని, రోజువారీ వ్యాపారాల్ని, కార్యకలాపాల్ని దెబ్బతీసింది. కరోనాయేతర వ్యాధులతో, ఆరోగ్య సమస్యలతో బాధపడేవారికి అసలు వైద్యమే అందుబాటులో లేకుండా పోయి ప్రత్యక్ష నరకం అనుభవించారు. కరోనాతో మరణించినవారి కంటే ఇతర వ్యాధులతో మరణించినవారి సంఖ్య వందరెట్లు అధికమని అంచనా. కరోనాపై ఏ రకంగా వ్యవహరించాలో టీవీలు, పత్రికల ద్వారా ప్రజలకు నిరంతరం చెబుతుండటంతోపాటు.. వందలాది డాక్టర్లు, వేలాది ఆరోగ్య కార్యకర్తలతో ఒక సమగ్ర కాల్ సెంటర్‌ని ఏర్పాటు చేసి ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేకుండా వైద్య ఆరోగ్య సేవల సహాయాన్ని అందించే ఏర్పాటు చేయమని లోక్‌సత్తా జేపీ వంటి వారు సూచించినా ప్రభుత్వం అరకొరగానే పట్టించుకుంది.

ప్రభుత్వంలోని వారు ఈ పనిని నిర్లక్ష్యం చేసినా.. తమ పరిధిలో డాక్టర్ సేవకుమార్‌లాంటి వారు చేస్తున్నారు.

కరోనా అనుమానితులు, బాధితులకు అందుబాటులో సేవల్ని అందించటంతోపాటు.. వైరస్‌పై ముందు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన పెంచేందుకు సేవకుమార్ ఈ పుస్తకాన్ని అందించారు. ఈ పుస్తకంలో 'వైరస్ పుట్టు పూర్వోత్తరాల నుంచి లక్షణాలు, నిర్ధారణ పరీక్షలు, చికిత్స, క్వారంటైన్ – ఐసోలేషన్, ఆరోగ్యసేతు యాప్, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు జాగ్రత్తలు, వ్యాధినిరోధక శక్తిని పెంచుకునేందుకు ఆహారం, పెంపుడు జంతువుల విషయంలో జాగ్రత్తలు, కరోనా వల్ల తలెత్తే మానసిక సమస్యలు, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత, మనం మార్చుకోవాల్సిన అలవాట్లు..' తదితర అంశాలను శాస్త్రీయంగా క్లుప్తంగా వివరించారు. పైస్థాయిలో ప్రభుత్వాల ఆర్భాటాలకన్నా స్థానికంగా ఎక్కడికక్కడ ఇలాంటి ప్రయత్నాల వల్లే కరోనాను తక్కువ ఖర్చుతో, ప్రజలకు తక్కువ నష్టంతో కట్టడి చేయగలం.

కొవిడ్ వ్యాధి రాకున్నా నిశ్శబ్దంగా ఇన్ఫెక్షన్ సోకుతున్నవారి సంఖ్య వివిధ కారణాల వల్ల మన సమాజంలో పెరుగుతుండటం, వ్యాక్సిన్లు వస్తుండటం వల్ల.. మరో రెండు మూడు నెలల్లో కరోనా విస్తరణ అదుపులోకి వచ్చే అవకాశముంది. కానీ ఈలోగా, ఆ తర్వాతా కొన్నిచోట్ల మళ్లీ వ్యాధి వ్యాప్తి కనిపించినా కూడా కొవిడ్ బారిన పడి ప్రాణాల మీదకు తెచ్చుకోకుండా ఉండేందుకు సేవకుమార్ గారి పుస్తకంలోని సూచనలు ఎంతగానో ఉపయోగపడతాయి.

డాక్టర్ జి.బాబురావు విషయ పరిజ్ఞాన సంపాదకులుగా, వై.ఆర్.కె ప్రసాద్ భాషాపర మాధ్యమ సంపాదకులుగా, డాక్టర్ టి.సేవకుమార్ రచించి, ప్రచురించిన 'కరోనా వైరస్: ముందు జాగ్రత్తలే... మందు – వ్యాక్సిన్' పుస్తకం వెల: రూ. 60/-. ప్రతులకు: ఎస్.హెచ్.వో క్లినిక్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర్, 2/1 బ్రాడీపేట్, గుంటూరు, ధర్మ క్లినిక్ అండ్ డయాగ్నోస్టిక్ సెంటర్, ఓల్డ్ క్లబ్ రోడ్, 2వ లైను, రామిరెడ్డి తోట, కొత్తపేట, గుంటూరు. ఫోన్: 98483 91212, 0863 2332465. ఎస్‌హెచ్‌వో గ్రూప్ ఆఫ్ సర్వీసెస్ అందిస్తున్న వివిధ సేవల్ని ప్రజలు వినియోగించుకోవాలని పుస్తక రచయిత కోరుతున్నారు. ■

# ఆశాకిరణాలుగా వెబినార్లు

## (నైపుణ్య శిక్షణకు నయా వేదిక)

– ఎం. చంద్రశేఖర్, హైదరాబాద్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ ఎంటర్‌ప్రైజ్‌లో సహాయ ఆచార్యులు

ఏ సంస్థకైనా మానవ వనరులే అసలైన మూలధనం. సిబ్బంది ఎటువంటి నైపుణ్యాలు కలిగి ఉన్నారు, వాటిలో ఏ మేరకు అభివృద్ధి సాధించారనే అంశాలు ఆయా సంస్థల వ్యాపార ప్రగతికి పునాదిగా నిలుస్తాయి. ఇవాళ కరోనా మహమ్మారి తెచ్చిపెట్టిన అనిశ్చిత, అస్థిమిత, అస్పష్ట, జటిల పరిస్థితుల్లో జీవనం సాగించాలంటే కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండాలి. పనికిరాని పాత విషయాలను వదిలివేయాలి. నేర్చిన అంశాల్లో విలువైనవాటిని మళ్లీ కొత్తగా అభ్యసించాలి. ఈ కొవిడ్ రోజుల్లో ప్రతి దినం ఏదో ఒక కొత్త అంశాన్ని నేర్చుకుంటూ ఉంటేనే ముందుకు సాగగలుగుతాం. కొవిడ్ ముందునాళ్లలో విరివిగా కనిపించిన హోటళ్లు, ట్యాక్సీలు నేడు కష్టకాలం ఎదుర్కొంటున్నాయి. వాటికి సంబంధించిన ఆన్‌లైన్ వ్యాపారాలూ సజావుగా లేవు. అయితే, ఇతర రకాల వ్యాపారాలు ఆన్‌లైన్‌కు మళ్లుతున్నాయి. కొత్త తరహా అంకురాలు రంగప్రవేశం చేస్తున్నాయి. కృత్రిమ మేధ, బ్లాక్ చెయిన్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వంటి కొత్త సాంకేతికతలు వ్యాపార నిర్వహణ రీతులను మార్చేస్తున్నాయి. నూతన సైబర్ వ్యాపార లోకంలో కొత్త అంశాలను నేర్చుకునేవారు, ఉన్న నైపుణ్యాలకు మెరుగుపెట్టుకునేవారు మాత్రమే విజేతలుగా నిలుస్తారు. అందుకు వెబినార్లు (అంతర్జాల గోష్ఠులు) తోడ్పడుతున్నాయి. వెబినార్ల చలవతో అగ్రశ్రేణి మేధావులు, నైపుణ్య శిక్షకుల నుంచి కొత్త సంగతులు నేర్చుకోవడానికి ఇక దూరప్రాంతాలకు పయనించనక్కర్లేదు, భారీ ఫీజులు చెల్లించనక్కర్లేదు. ఆ ఉద్దండులు తమ అమూల్య సమయాన్ని ఇంతకుముందు కొద్దిమందికి మాత్రమే కేటాయించగలిగేవారు. వెబినార్ల సాయంతో నేడు వందలు, వేలమంది నేర్చుకునే అవకాశం ఏర్పడింది. వివిధ రంగాల్లోని వ్యక్తులు అంతర్జాలం సాయంతో వర్చువల్ భేటీలు నిర్వహించగలుగుతున్నారు. మౌలిక వసతులు, పెట్టుబడి విపణులు, ఆర్థిక వ్యవహారాలపై నేడు విరివిగా వెబినార్లు జరుగుతున్నాయి.



అనేక ముఖ్యమైన సమకాలీన వ్యవహారాలపై హార్వర్డ్, వార్టన్ వంటి జగద్విఖ్యాత విశ్వవిద్యాలయాలు వారం వారం ఉచిత వెబినార్లు నిర్వహిస్తున్నాయి. నగరాల్లో ఉండే విద్యావేత్తలు, అధ్యయనకారులు, వృత్తి నిపుణులు వెబినార్లలో బోధించే సంగతులను చిన్న పట్టణాల్లోని విద్యార్థులు, యువతీయువకులు, ఉద్యోగులు కూడా ఆలకించగలుగుతున్నారు. ప్రసిద్ధ బిజినెస్ స్కూల్స్, మియామీ, వార్టన్ విశ్వవిద్యాలయాలు లైవ్‌లో ఉచితంగా నిర్వహిస్తున్న పరిశోధనాపరమైన వెబినార్లు ప్రపంచమంతటా వేలమందికి అందుబాటులో ఉంటున్నాయి. విదేశాల్లో జరిగే ఇటువంటి గోష్ఠులకు సామాన్యులు మామూలు రోజుల్లోనే హాజరు కాలేరు. వీసా సమస్యలు, ఆర్థికపరమైన ఇబ్బందులు దీనికి కారణం. ఇక ఈ కొవిడ్ కాలంలో ఆర్థిక స్తోమత ఉన్నవారు కూడా విదేశాలకు వెళ్లడానికి జంకుతున్నారు. అన్ని వర్గాలవారు ఇంటి నుంచి, ఆఫీసు నుంచి కాలు కదపకుండానే విశ్వవిఖ్యాత సంస్థల వెబినార్లలో పాల్గొన గలుగుతున్నారు. అశోకా విశ్వవిద్యాలయం నాలుగు రోజుల పాటు నిర్వహించిన వర్చువల్ సమావేశానికి హార్వర్డ్, ప్రిన్స్‌టన్ విశ్వవిద్యాలయాల నుంచి, బెంగళూరు, కోల్‌కతా ఐఐఎంల నుంచి ప్రముఖ విద్యావేత్తలు వచ్చారు. ఆన్‌లైన్ విద్య, కొత్త సాంకేతికతల ఆలంబన, నాయకత్వ సవాళ్లు, మానవ మూలధనాన్ని సమర్థంగా వినియోగించడం వంటి కీలకాంశాలపై వారు చెప్పిన విలువైన సంగతులను ప్రపంచవ్యాప్తంగా ఎందరెందరో ఉచితంగా అంతర్జాలంలో విన్నారు. 'ది ఇండ్ యూఎస్ ఎంట్రప్రెనార్స్ (టీఐఈ)' హైదరాబాద్, ఢిల్లీ, ముంబయిలలో నిర్వహించిన వెబినార్లు వ్యాపార వ్యవస్థాపకులకు, మేనేజర్లు, ఎంఎస్ఎంఈలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్ (పీడబ్ల్యూసీ) కన్సల్టెంట్లతో కలిసి అంకుర సంస్థల వ్యవస్థాపకుల కోసం టీఐఈ వెబినార్లు నిర్వహిస్తోంది.

అంకురాలు, ఎంఎస్ఎంఈలు, ఆర్థిక విపణులు, వినోద రంగాలపై కొవిడ్ ప్రభావం గురించి టెడెక్స్ వెబినార్లు విలువైన అంశాలను వెల్లడిస్తున్నాయి. న్యూయార్క్ విశ్వవిద్యాలయానికి చెందిన అశ్వత్థ దామోదరన్ భారతీయ పెట్టుబడి మార్కెట్లపై ఇటీవల నిర్వహించిన వెబినార్ ఎన్నో అమూల్యమైన విషయాలను అందించింది. మేధావులు, ప్రతిష్ఠాత్మక సంస్థలు నిర్వహిస్తున్న వెబినార్లను వీక్షించడానికి, వాటిలో మాట్లాడటానికీ రుసుము ఏమీ చెల్లించనక్కర్లేదు. వీటిని చాలా తరచుగా లైవ్ కార్యక్రమాలుగానూ నిర్వహిస్తున్నారు. భారత్‌లో ఉన్నత విద్యాసంస్థలు తమ అధ్యాపక సిబ్బంది కోసం పరిశోధన సంవిధానాలు, పరిశోధన పత్రాల లేఖనం, ప్రచురణ, వక్తృత్వం వంటి అంశాల్లో చాలా తక్కువ ఫీజుకు వెబినార్లు నిర్వహిస్తున్నాయి. అధ్యాపకులు, విద్యార్థులు, పరిశోధకులకు ఇవి అత్యంత ఉపయోగకరంగా ఉన్నాయి. సౌదీ అరేబియా, ఒమన్, బహ్రెయిన్, ఇథియోపియా, భూటాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లకు చెందినవారూ ఈ వెబినార్లలో పాల్గొన్నారు. ఇటీవల చెన్నైకి చెందిన ఇస్కాన్ సొసైటీ లాక్‌డౌన్ కాలంలో భగవద్గీతపై చేపట్టిన ఆన్‌లైన్ తరగతులకు ఎంతో గిరాకీ ఏర్పడింది. విజ్ఞానానికి ఎల్లలు లేవని వెబినార్లు నిరూపిస్తున్నాయి. మానవ మూల ధన సృష్టికి విలువైన సేవలు అందిస్తున్నాయి. ■

కర్టసీ: ఈనాడు

## నగర ప్రభుత్వాలకు సాధికారత లేకుంటే

# ఓటింగ్‌లో నిర్లిప్తతే






గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ తాజా ఎన్నికల్లో ప్రచారం, ప్రసంగాలు హోరెత్తినా, పార్టీలు పోటాపోటీ ఉచితాల్ని గుప్పించినా, జాతీయ స్థాయి నుంచి నాయకులు పాల్గొన్నా ఓటింగ్ గొర్రెతోక లెక్కను దాటి పెరగకపోవటం రాజకీయ వ్యవస్థకు పెద్ద హెచ్చరిక అని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ప్రజాస్వామ్యానికి పాఠశాల వంటి స్థానిక ప్రభుత్వంలో ప్రజల భాగస్వామ్యం కొరవడటం, రాజకీయానికి-ప్రజల జీవితానికి మధ్య సంబంధం తెగిపోవటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రలోభాలు, కోట్ల డబ్బు వెదజల్లటం వంటివి లేకపోతే ఓటింగ్ శాతం ఇంకా తగ్గి ఉండేదన్నారు. ఓటర్ల జాబితాల్లో లోపాలున్నప్పటికీ పాతికేళ్ల క్రితంతో పోలిస్తే ఇప్పుడు చాలా మెరుగని, మొబైల్ ఫోన్‌లోనే పరిష్కరించుకునే అవకాశముందని (లోక్‌సత్తా చాలా ఎక్కువ సమయాన్ని వెచ్చించిన కార్యక్రమం ఓటర్ల జాబితాల ప్రక్షాళన).. ఓటర్ల జాబితాల్లో గందరగోళం, కొవిడ్, వరుస సెలవలు వంటి అంశాలకన్నా కూడా ఈ ఎన్నికల్లో ఓటు వేయటం వల్ల తమ జీవితాల్లో మార్పు వస్తుందన్న నమ్మకం ప్రజల్లో లేకపోవటం అసలు సమస్యన్నారు. ఏ పార్టీకి ఓటు వేసినా వృథా అనే భావన ప్రజానీకంలో నెలకొందన్నారు. ఈ నిర్లిప్తతను అధిగమించి ఓటు వేయటానికి కావలసిన ప్రత్యామ్నాయ ఎజెండాను రాజకీయ పార్టీలు ప్రజల ముందుంచలేకపోయాయన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే స్థానిక ప్రభుత్వాల పట్ల ప్రజల అసంతృప్తి వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎసరు పెట్టినా ఆశ్చర్యపోనక్కర్లేదన్నారు. ఇతర దేశాల్లో మేయర్ల పేర్లు ప్రముఖంగా ప్రజలు గుర్తుంచుకుంటారని, కానీ మన దేశంలో మేయర్లు చాలామందికి తెలియదని, నగర ప్రథమ పౌరుడంటే ముఖ్యమంత్రే అనుకుంటారన్నారు. నగరాలకు స్వయంప్రతిపత్తి కల్పించి, వార్డు కమిటీల్ని మొక్కుబడిగా కాకుండా ప్రజలు ఎన్నుకున్నవారితో ఏర్పాటు చేస్తే ప్రజలకు తాగునీరు, రోడ్లు, మురుగుపారుదల, విద్య, వైద్యం వంటి రోజువారీ సేవలు సక్రమంగా అందుతాయన్నారు. తమ ఓటుకు-తమ జీవితానికి మధ్య సంబంధం ఎప్పుడైతే ఇలా స్పష్టంగా ప్రజలకు అర్థమవుతుందో, చొరవగా ఓట్లు వేస్తారన్నారు. ఢిల్లీలో ఇదే జరుగుతోందన్నారు. ఢిల్లీ పేరుకు రాష్ట్రమైనా కూడా, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి గణనీయ నిధులు, విధులు ఉన్న మేయర్‌తో సమానమని, అందువల్లే అక్కడి ప్రజలకు తమ ఓటు వల్ల ప్రయోజనాలు కళ్ల ముందే కనిపిస్తున్నాయని అన్నారు.

ఆర్థిక వ్యవస్థలో నగరాల పాత్ర శరవేగంగా పెరుగుతోందని, అందువల్ల నగర స్థానిక ప్రభుత్వాలకు నిధుల్ని, అధికారాల్ని బదిలీ చేయాలన్నారు. నగర పాలనలో తప్పులు జరిగితే కఠిన చర్యలు తీసుకునే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన చేతుల్లో పెట్టుకోవచ్చన్నారు. మన దేశంలో కంటే పాకిస్థాన్, బంగ్లాదేశ్‌లలో, నియంతృత్వ చైనాలో స్థానిక ప్రభుత్వాలకు ఎక్కువ సాధికారత ఉందన్నారు. తెలుగు రాష్ట్రాల్లో 2023-24 ఎన్నికల్లో గెలవటం కోసమైనా నగరాల్లో ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో కూడిన స్వయంప్రతిపత్తిని కల్పించటం అవసరమని కేసీఆర్, కేటీఆర్, వైఎస్ జగన్, ఇతర పార్టీల నేతలు గుర్తించాలన్నారు. నగర ప్రభుత్వాలకు సాధికారత, ప్రజలకు భాగస్వామ్యం కల్పించాలని, ప్రోత్సాహకాలతో కూడిన నిర్బంధ ఓటింగ్‌ను, ఈ-ఓటింగ్‌ను దశలవారీగా అమల్లోకి తెచ్చే విషయాల్ని కూడా పరిశీలించాలని జయప్రకాష్ నారాయణ్ ఈ సందర్భంగా సూచించారు.

RNI. Regd No. 69976/98 Postal Reg. No. HD-913/2018-2020 Published on 10th December, 2020 Posting Date 15 &16th of every month




## BOOK POST
### PRINT MATTER

*If undelivered please return to:*

*LOKSATTA UDYAMA SAMSTHA,*
*Tulips Apartments, 6-3-655,*
*Flat.No. 407,*
*Behind civil supplies office,*
*Somajiguda,*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, Tulips Apartments, 6-3-655, Flat.No. 407, Behind civil supplies office, Somajiguda, Hyderabad - 500 082. Printed at Kala Jyothi Process Pvt Ltd, 1-1-60/5, RTC "X" Roads, Hyderabad 500 020**